


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 258

శనివారం 1-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గాయత్రి-ట్రెసా సంచలనం

ప్రపంచ ఆరో ర్యాంక్ జోడీపై గెలుపు సింగపూర్ ఓపెన్‌లో సెమీస్‌కు - 13లో



భళా.. భారత్

క్యూ4లో 7.8శాతం పురోగతి 2023-24లో 8.2% పరుగు - 13లో



ఆదివారం సరెండరవుతా

ఎన్నికల ప్రచారం కోసం బెయిల్‌పై తిహార్ జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆదివారం తిరిగి లొంగిపోనున్నారు.

వివరాలు 6లో ▸



ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్

విదేశాల నుంచి బెంగళూరుకు చేరుకున్న లైంగిక దాడుల కేసు నిందితుడు, జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 6లో ▸



అమెరికా స్పెల్ బీ విజేత బృహత్

అమెరికా స్పెల్లింగ్ పోటీల్లో తెలుగు సంతతికి చెందిన 12 ఏళ్ల బృహత్ సోమ విజేతగా నిలిచాడు. అతని తండ్రి నల్లగొండ వాసి.

వివరాలు 6లో ▸



డొనాల్డ్ ట్రంప్ దోషి

హష్ మనీ కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌ను న్యూయార్క్ కోర్టు దోషిగా తేల్చింది. జూలై 11న ఆయనకు శిక్ష ఖరారు కానుంది.

వివరాలు 6లో ▸

ఇది ఈసీ వివక్షే

పేరు, హోదా వివరాలు, సీలు లేకపోతే పోస్టల్ బ్యాలెట్ ఎలా చెల్లుతుంది?

ఎన్నికల కమిషన్ ఇచ్చిన తాజా ఉత్తర్వులు విస్మయకరం, అన్యాయం

హైకోర్టుకు నివేదించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, వీరారెడ్డి

- దేశంలో ఎక్కడా లేని ఉత్తర్వులు ఒక్క ఏపీలోనే అమలు
- ఎన్నికలసంఘం పరిధి దాటి ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తోంది
- చట్టబద్ధ నిబంధనలను మెమోలు, సర్క్యులర్, లేఖల ద్వారా మార్చలేరు.. వాటిని పార్లమెంట్ మాత్రమే మార్చగలదు
- ఎప్పుడో ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఇప్పుడు ఉత్తర్వులివ్వడం ఏమిటి?
- కౌంటింగ్ వేళ ఎన్నికల కమిషన్ తీరు సందేహాస్పదం
- ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం.. అలాంటిది 5.39 లక్షల ఓట్ల విషయంలో బాధ్యతారాహిత్యం
- మా ఆందోళన, ఫిర్యాదును సీఈసీ పట్టించుకోలేదు
- నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ ఉంటే కోర్టులు జోక్యం చేసుకోవచ్చు.. ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా ఏకపక్ష ఉత్తర్వులను రద్దు చేయాలని విన్నపం
- ఫలితాలపై అభ్యంతరం ఉంటే ఎన్నికల పిటిషన్ వేసుకోవాలన్న ఎన్నికల సంఘం సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్
- ముగిసిన వాదనలు.. నేటి సాయంత్రం 6 గంటలకు తీర్పు



సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం మాత్రమే ఉండి.. పేరు, హోదా వివరాలు, సీలు లేకపోయినా ఆ పోస్టల్ బ్యాలెట్‌లను ఆమోదించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గురువారం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్ణయం వెలువరిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం ఎన్నికల సంఘం గురువారం జారీ చేసిన ఉత్తర్వులను చట్ట విరుద్ధంగా ప్రకటించి, ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి

మిగతా 2వ పేజీలో ▶



కవ్వించి.. కలబడాలి!

టీడీపీ చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లకు చంద్రబాబు నిర్దేశం

పోలింగ్ రోజు తరహాలో మరోసారి విధ్వంసానికి పథకం

- కౌంటింగ్ కేంద్రాలు, బయట హింస రాజేయడమే లక్ష్యం
- కొమ్ము కాసే అధికారుల అండతో వ్యూహం అమలుకు ప్రణాళిక
- రెచ్చగొట్టి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను వెళ్లగొట్టడమే లక్ష్యం
- ఈసీ నిర్లిప్త వైఖరిపై ప్రజాస్వామ్యవాదుల విస్మయం

సాక్షి, అమరావతి: పోలింగ్ రోజు రాష్ట్రవ్యాప్తంగా సృష్టించిన విధ్వంస కుట్రలకు చంద్రబాబు మరింత పదును పెడుతున్నారు! అత్యంత కీలకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను హైజాక్ చేసేందుకు పక్కా పన్నాగం పన్నుతున్నారు. ఓట్లు లెక్కించే జూన్ 4వతేదీన దాడులు, దౌర్జన్యాలు, హింసాకాండకు తెగబడేందుకు టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పుతున్నారు. ప్రధానంగా కౌంటింగ్ కేంద్రాల్లో కవ్వింపులకు దిగి ఘర్షణలతో ఉద్రిక్తత రేకెత్తించేందుకు పథకం రూపొందించారు. వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను కవ్వించి కౌంటింగ్ కేంద్రాల నుంచి బయటకు వెళ్లగొట్టడమే టీడీపీ దుష్ట పన్నాగం. అందరినీ ఏమార్చి ఓట్ల లెక్కింపులో అక్రమాలకు పాల్పడాలన్నదే చంద్రబాబు కుతంత్రం. పోస్టల్ బ్యాలెట్ల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు వరకు ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తూ పచ్చ ముఠాలు బరితెగించడం ఆందోళనకరంగా మారింది. ఈసీని ప్రభావితం చేసి తమ చెప్పుచేతల్లో నడుచుకునేలా నియమించుకున్న

మిగతా 2వ పేజీలో ▶

నేడు రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్

- ముగిసిన విదేశీ పర్యటన



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విదేశీ పర్యటన ముగించుకొని నేడు రాష్ట్రానికి చేరుకోనున్నారు. మే 17వ తేదీన కుటుంబసభ్యులతో కలిసి సీఎం జగన్ లండన్‌కు బయలుదేరి వెళ్లారు. విదేశీ పర్యటన ముగించుకొని శుక్రవారం సాయంత్రం సీఎం జగన్ లండన్ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. శనివారం తెల్లవారుజామున ఆయన తాడేపల్లిలోని ఇంటికి చేరుకోనున్నారు.

న్యూస్‌రీల్

కొత్త వైద్య కళాశాలలకు 380 పోస్టుల మంజూరు



రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలకు 21 విభాగాల్లో 380 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను సీఎం జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే.

వివరాలు 2లో ▸

సీఎస్ మా భూముల వద్దకు రాలేదు: రైతులు



సీఎస్ జవహర్‌రెడ్డిపై విశాఖ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని తేలింది. సీఎస్ ఎన్నడూ తమ భూముల వద్దకు రాలేదని జనసేన, టీడీపీ నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో రైతులు కుండబద్దలు కొట్టారు.

వివరాలు 2లో ▸

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి అమిత్ షా



తిరుమల ఆలయంలోని రంగనాయకుల మండపంలో పెద్ద శేష వాహనం వద్ద అమిత్ షా దంపతులు

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సతీసమేతంగా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. - తిరుమల

వేగంగా నైరుతి

- రెండు రోజుల్లో రాష్ట్రాన్ని తాకే అవకాశం
- అప్పటి వరకు కొనసాగనున్న ఎండల తీవ్రత
- ఏప్రిల్‌లో 46 డిగ్రీలతో ఉష్ణోగ్రతలు మొదలు
- మే ఆఖరు వరకు అదే రీతిలో కొనసాగిన ఉష్ణతాపం
- నేడు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు



3లో

చల్లని రేయే వేడెక్కెనులే!

పట్టణీకరణ ప్రభావంతో పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

- భారత నగరాల్లో 60 శాతం వేడి రాత్రులే
- కాంక్రీటు, తారు రోడ్లు పగటిపూట వేడిని గ్రహించి నిల్వ చేస్తాయి.. అవి రాత్రిళ్లు వేడిని విడుదల చేస్తాయి
- దేశంలోని వాయవ్య, ఈశాన్య, దక్షిణ ప్రాంతాల్లోనే ఎక్కువ పెరుగుదల.. ప్రతి దశాబ్దానికి సగటున 0.53 డిగ్రీలు పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- ఐఐటీ భువనేశ్వర్ తాజా పరిశోధనలో వెల్లడి

14లో

నేడే తుది పోరు

- నేడు చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లోని 57 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్
- ఒడిశాలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా..

6లో

నేడు ఎగ్జిట్‌పోల్స్

సాయంత్రం 6.30 గంటలకు ఎన్నికల ఫలితాల అంచనాలు వెల్లడి



సన్నాహక సమయం

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్

రాత్రి 8గం.నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రసారం -13లో



ఇదంజగత్



మీకేమో నోట్లో నాలుక లేనట్లుండేవారు! ఆయనకేమో నోటి నిండా నాలుకలే!

కొత్త విత్తనాలు వేద్దాం

పెట్టుబడి, ఉత్పత్తి నష్టాలను అధిగమిద్దాం..

- ఖరీఫ్‌లో 37 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 20 లక్షల ఎకరాల్లో 20–30 ఏళ్ల పైబడిన వంగడాలే
- చీడపీడలు, తుపాన్ల బారిన పడుతున్న పాత రకాలు
- ఏటా రూ.వేల కోట్ల పెట్టుబడి నష్టాన్ని చవిచూస్తున్న రైతన్నలు
- దశలవారీగా కొత్త వంగడాలకు మారేలా కార్యాచరణ
- నూతన విత్తనాల ప్రత్యేకతలపై ఆర్బీకేల ద్వారా విస్తృత ప్రచారం



శాస్త్రవేత్తలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలు

వరి సాగులో విత్తన మార్పిడిని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. దశాబ్దాలుగా అన్నదాతలు సాగు చేస్తున్న పాత రకాల వరి వంగడాలకు బదులుగా శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు నవీకరించిన రకాల సాగును ప్రోత్సహించాలని భావిస్తోంది. దశలవారీగా వీటి సాగును విస్తరించేలా చర్యలు చేపట్టింది. ఆ దిశగా రైతులను కార్యోన్ముఖులను చేసేందుకు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించారు. - వివరాలు 10లో

ఇది ఈసీ వివక్షే

▶ మొదటి పేజీ తరువాయి

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఆ ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ ఓ అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా హౌస్ మోషన్ రూపంలో విచారణ జరపాలని కోరుతూ పిటిషనర్ తరఫు న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ హైకోర్టు రిజిస్ట్రీని కోరారు. దీంతో రిజిస్ట్రీ ఈ కేసు ఫైల్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందు ఉంచింది. దానిని పరిశీలించిన ఆయన హౌస్ మోషన్ రూపంలో అత్యవసర విచారణకు అనుమతి మంజూరు చేశారు. దీంతో జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ విజయ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.

దేశ వ్యాప్తంగా కాకుండా ఏపీలో మాత్రమే అమలు చేస్తారా?

వైఎస్సార్‌సీపీ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, హైకోర్టు సీనియర్ న్యాయవాది పాపెల్లుగారి వీరారెడ్డి, న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ వాదనలు వినిపించారు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం మాత్రమే ఉండి.. పేరు, హోదా వివరాలు, సీలు లేకపోయినా కూడా ఆ పోస్టల్ బ్యాలెట్‌లను ఆమోదించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులు వివక్షాపూరితమని సింఘ్వీ తెలిపారు. ఈ ఉత్తర్వులు చాలా కొత్తగా ఉన్నాయన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఉత్తర్వులను దేశంలో ఇతర ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయడం లేదని, కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అమలు చేస్తోందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు దేశం మొత్తానికి వర్తిస్తాయని, కానీ విస్మయకరంగా తాజా ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే వర్తింప చేస్తోందని వివరించారు. ఇంత కన్నా అన్యాయం ఏమీ ఉండదన్నారు. తాజా ఉత్తర్వులు ఎన్నికల కమిషన్ స్వీయ నిబంధనలకు విరుద్ధమన్నారు. లేఖలు, సర్క్యులర్లు, మెమోల ద్వారా చట్టబద్ధ నిబంధనలను మార్చలేరన్నారు. అది పార్లమెంట్ పని అని తెలిపారు. పార్లమెంట్‌లో ఎలాంటి సవరణ చేయకుండా తాజా ఉత్తర్వులు తీసుకురావడానికి వీల్లేదని, అందువల్ల అవి ఎంత మాత్రం చెల్లుబాటు కావని ఆయన స్పష్టం చేశారు.



కౌంటింగ్‌కు నాలుగు రోజుల ముందు ఎందుకిలా?

రాష్ట్రంలో 5.39 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ అయ్యాయని, ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ఇవి సరిపోతాయని సింఘ్వీ అన్నారు. ఎన్నికల నిర్వహణ నిబంధనల్లో రూల్స్ 27ఎఫ్, 54ఏ, 13 ఏ లకు విరుద్ధంగా ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులు అమల్లోకి తెచ్చిందన్నారు. అటెస్టేటింగ్ అధికారి పేరు, హోదా వివరాలు లేకుండా ఆ పోస్టల్ బ్యాలెట్‌ను ఎవరు ధృవీకరించారో తెలియదని, దీని వల్ల అక్రమాలకు ఆస్కారం ఉంటుందన్నారు. అసలు పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై ఎవరైనా సంతకం చేయవచ్చన్నారు. తప్పుడు, నకిలీ ఓట్లను కూడా ఆమోదించేందుకు తాజా ఉత్తర్వులు అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. ఎప్పుడో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయితే, ఇప్పుడు కౌంటింగ్‌కు నాలుగు రోజుల సమయం మాత్రమే ఉండగా, కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఈ తాజా ఉత్తర్వుల వల్ల నష్టం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ తీరు సందేహాస్పదంగా ఉందని తెలిపారు. ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ ఇలాంటి ఉత్తర్వుల ద్వారా నిష్పాక్షికతకు అర్థం లేకుండా చేస్తోందన్నారు. ఏకపక్షంగా జారీ చేసిన ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన కోర్టును కోరారు. ఎన్నికల ఫలితాలపై అభ్యంతరం ఉంటేనే ఎన్నికల పిటిషన్ (ఈపీ) దాఖలు చేసుకోవాల్సి ఉంటుందని, కానీ ఇక్కడ ఆ పరిస్థితి కాదని, అందువల్ల తమ వ్యాజ్యానికి విచారణార్హత ఉందని వివరించారు.

తాజా ఉత్తర్వులు ఆ ఉద్యోగులకే వర్తింపు

కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల విధుల్లో ఉండి ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులకే తమ తాజా ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద అటెస్టేటింగ్ అధికారిని సంబంధిత రిటర్నింగ్ అధికారే నియమిస్తారని.. అందువల్ల డిక్లరేషన్ ఫాంపై ఆ అధికారి సంతకం ఉంటే చాలని చెప్పారు. పేరు, హోదా వివరాలు, సీలు ఉండాల్సిన అవసరం లేదని తెలిపారు. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను మొత్తం నిబంధనలకు అనుగుణంగా వీడియోగ్రఫీ చేశారని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంలో పిటిషనర్ అనవసరంగా ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల ప్రక్రియను సవాలు చేయడానికి వీల్లేదని, ఒకవేళ పిటిషన్లు దాఖలు చేసినా అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని తెలిపారు. పిటిషనర్ పరోక్షంగా ఎన్నికల ఫలితాల గురించే మాట్లాడుతున్నారని, అందువల్ల వారు ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్నికల ఫలితాల వ్యవహారంలో ఈపీ దాఖలు చేసుకోవాలన్న వాదన సరైందేనని, అయితే పిటిషనర్ తన వ్యాజ్యంలో లేవనెత్తిన అంశాలు పూర్తిగా వేరని వ్యాఖ్యానించింది. ఇదేమీ వ్యక్తిగత కేసు కాదని స్పష్టం చేసింది. అనంతరం వైఎస్సార్‌సీపీ వ్యాజ్యంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల నిర్వహణ నిబంధనలను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులు సబబేనన్నారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు తెలిపింది. శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్ణయాన్ని వెలువరిస్తామంది.

పరిధి దాటి వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం

సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమేనన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘమే చెబుతోందని, అలాంటిది 5.39 లక్షల ఓట్ల విషయంలో మాత్రం బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో తమ ఆందోళనను గానీ, తామిచ్చిన వినతి పత్రాన్ని గానీ ఎన్నికల సంఘం కనీస స్థాయిలో కూడా పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. తాము హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన తర్వాత హడావుడిగా తాజా ఉత్తర్వులిచ్చిందన్నారు. అతి కొద్ది రోజుల్లో కౌంటింగ్ జరగబోతుండగా, ఇప్పటికిప్పుడు ఈ ఉత్తర్వులను తీసుకు రావాల్సిన అవసరం ఏముందో ఎన్నికల సంఘం చెప్పడం లేదన్నారు. ఎన్నికల సంఘం చర్యల్లో నిజాయితీ ఉండి ఉంటే, ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే ఈ ఉత్తర్వులు అమల్లోకి తెచ్చి ఉండేదని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివాదంపై ఎన్నికల పిటిషన్లు వేయాలంటే 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో దాఖలు చేయాల్సి ఉంటుందని, ఇది ఆచరణ సాధ్యం కాదన్నారు. ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా తన పరిధి దాటి వ్యవహరించిందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో గత ఏడాది జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని, బ్యాలెట్ ఫాంపై పేరు, హోదా వివరాలు, సీలు లేకుంటే ఆ ఓటును తిరస్కరించాల్సిందేనన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ సాగుతున్నప్పుడు అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని వీరారెడ్డి తెలిపారు.

అరచేతిలో ఎన్నికల ప్రపంచం

→ ఎన్నికల ఫలితాల తాజా అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు డిజిటల్ రూపంలో మీ ముందుకు తెస్తోంది సాక్షి.కామ్. క్షణక్షణం ఇచ్చే ఈ అప్‌డేట్స్‌తో పాటే విశ్లేషణాత్మక కథనాలు, ఏ నియోజకవర్గ సమాచారాన్ని అయినా చిటికెలో ఇట్టే తెలుసుకో గలిగేలా అందిస్తోంది. అంతే కాదు.. మీరు స్వయంగా నావిగేట్ చేసుకునే సౌకర్యం, జిల్లాల వారీగానూ ఎన్నికల ఫలితాలు, స్పష్టంగా అర్థమయ్యే గ్రాఫిక్స్.. ఇలా ఎన్నెన్నో విశేషాలున్న సాక్షి.కామ్‌ను అస్సలు మిస్ కావొద్దు. ఫాలో www.sakshi.com.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. సాక్షి ఎలక్షన్ స్పెషల్‌ను చూడండి..

పరోక్ష సేవల టికెట్ల అమ్మకాలకు ప్రైవేట్ ఏజెన్సీకి అనుమతి

దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో భక్తుల పేరిట స్వామి వార్లకు నిర్వహించే వివిధ రకాల ఆన్‌లైన్(పరోక్ష) సేవల టికెట్ల అమ్మకాలకు సంబంధించి సర్వదేవస్థానం హిందూ చారిటబుల్ ట్రస్టు(ఢిల్లీ)కు అనుమతిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ టికెట్ల అమ్మకాలు దేవదాయ శాఖ ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా జరిగేవి. అయితే, ఆన్‌లైన్ ద్వారా స్వామి వార్ల సేవల్లో పాల్గొనే వారు అత్యధికులు ఎన్‌ఆర్‌ఐ భక్తులు కావడంతో.. అందరికీ తెలిసేలా ఎక్కువ ప్రచారం కల్పించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులకు అవగాహన



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రగతిని వివరించేందుకు ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధిని వివరించనున్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి 'ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల గృహ సందర్శన కార్యక్రమం' అమలు చేస్తున్నట్లు తెలిపారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించడం కోసం ఈ విధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ఉన్నతమైన ప్రగతి సాధించాలంటే ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమని, విద్యలో తల్లిదండ్రుల ప్రమేయం విద్యాపరమైన ఫలితాలను గణనీయంగా పెంచుతుందన్నారు. తరగతి ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి ఇంటిని విద్యా సంవత్సరంలో రెండు సార్లు (జూన్, జనవరి) సందర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లల చదువు తీరు, విద్యా ఫలితాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

కవ్వించి.. కలబడాలి!

▶ మొదటి పేజీ తరువాయి

పోలీసు అధికారుల ద్వారా ఈ కుట్రలను అమలు చేసేందుకు చంద్రబాబు ఉద్యుక్తమైనట్లు స్పష్టమవుతోంది.

ఎంతకైనా తెగించేందుకు వెనుకాడొద్దు..

కౌంటింగ్ సందర్భంగా ఏదో ఒక సాంకేతిక అంశాన్ని సాకుగా చూపించి అధికారులతో వాగ్వాదంతోపాటు వైఎస్సార్‌సీపీ ఏజెంట్లతో ఘర్షణకు దిగాలని టీడీపీ ఏజెంట్లకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. మొదట లెక్కించే పోస్టల్ బ్యాలెట్ల నుంచే ఈ వ్యూహాన్ని అమలు చేయాలని ఆదేశించడం ద్వారా ఎంత పకడ్బందీగా కుట్ర పన్నారో స్పష్టమవుతోంది. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈమేరకు చంద్రబాబు ఉపదేశించారు. ఇక సాధారణ కౌంటింగ్ ఏజెంట్లతో శనివారం నిర్వహించే సమావేశంలోనూ ఇవే అంశాలు పునరుద్ఘాటించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. ఎంత తీవ్రస్థాయిలో ఘర్షణకు అయినా సిద్ధం కావాలని అందుకోసం ఎంతకైనా తెగించాలని కౌంటింగ్ ఏజెంట్లను పురిగొల్పడం ద్వారా చంద్రబాబు తన కుతంత్రాన్ని బహిర్గతం చేశారు.

పోలింగ్ రోజు మోడల్ అమలు

పోలింగ్ సందర్భంగా పాల్పడిన కుట్రలనే కౌంటింగ్ రోజు కూడా పునరావృతం చేయాలని చంద్రబాబు స్కెచ్ వేశారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ద్వారా తాము నియమించుకున్న పోలీసు యంత్రాంగం ఇందుకు పూర్తిగా సహకరిస్తుందనే ధీమాతో ఉన్నారు. రాష్ట్రంలో పోలింగ్ నిర్వహించిన ఈ నెల 13వతేదీన టీడీపీ రౌడీమూకలు దాడులతో భయానక వాతావరణం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రధానంగా పల్నాడు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో అల్లరి మూకలు యథేచ్ఛగా దౌర్జన్యకాండకు పాల్పడ్డాయి. టీడీపీ రౌడీ మూకలు పోలింగ్ కేంద్రాలతోపాటు నడి వీధుల్లో స్వైర విహారం చేస్తున్నా పోలీసు యంత్రాంగం చోద్యం చూసింది. అదే అదనుగా మహిళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలను ఓటింగ్‌కు దూరం చేయడమే లక్ష్యంగా పచ్చ ముఠాలు కత్తులు, కర్రలు, రాడ్లు చేతబట్టుకుని బీభత్సం సృష్టించాయి. బాంబు దాడులతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అదే విధ్వంసకాండ మోడల్‌ను ఓట్ల లెక్కింపు రోజు కూడా అమలు చేయాలని చంద్రబాబు పథకం వేశారు. కౌంటింగ్ కేంద్రాల బయట దాడులతో దృష్టి మళ్లించి ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో తమ ఏజెంట్లతో కవ్వింపు చర్యలకు దిగాలని కుట్ర పన్నారు.

వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను వెళ్లగొట్టండి...!

వైఎస్సార్ సీపీ ఏజెంట్లే లక్ష్యంగా కౌంటింగ్ కేంద్రాల్లో కవ్వింపు చర్యలతో ఘర్షణలకు దిగాలని, దాడులకూ వెనకాడొద్దని చంద్రబాబు ఆదేశించారు. అదే అదనుగా తమకు అనుకూలంగా వ్యవహరించే కొందరు పోలీసు అధికారులను రంగ ప్రవేశం చేయించి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రాల నుంచి బలవంతంగా బయటకు పంపేలా చంద్రబాబు ఇప్పటికే కీలక అధికారులతో మంతనాలు జరిపారు. ఆ తరువాత ఓట్ల లెక్కింపులో అక్రమాలకు పాల్పడాలన్నది ఆయన లక్ష్యం. ఈమేరకు పోస్టల్ బ్యాలెట్ల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు వరకూ ప్రతి దశలోనూ కౌంటింగ్ కేంద్రాల్లో వాగ్వాదం, ఘర్షణలతో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించేందుకు టీడీపీ పావులు కదుపుతోంది. చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిడితో వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్న ఈసీ, కొందరు పోలీసు అధికారులు కౌంటింగ్ ప్రక్రియలోనూ అదే రీతిలో వ్యవహరించే అవకాశాలున్నాయని ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించాల్సిన ఈసీ, అధికార యంత్రాంగం ఉదాసీనంగా, నిస్తేజంగా వ్యవహరించడంపై సర్వత్రా తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది.

అమెరికాలో యోగా కార్యక్రమానికి దాజీ

21న యోగా డే సందర్భంగా కీలక ఉపన్యాసం

సాక్షి, హైదరాబాద్: జూన్ 21న అమెరికాలోని న్యూయార్క్‌లో 'యూఎన్ ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా' కార్యక్రమంలో కీలక ఉపన్యాసం ఇవ్వాల్సిందిగా శ్రీరామచంద్రమిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ గైడ్ కమలేశ్ డి.పటేల్ దాజీని నిర్వాహకులు ఆహ్వానించారు. అదేవిధంగా జూన్ 24న వాషింగ్టన్‌డీసీలోని ప్రపంచబ్యాంక్ హెడ్‌క్వార్టర్స్‌లో జరగనున్న కార్యక్రమంలో సీనియర్ అధికారులు, ఉద్యోగులను ఉద్దేశించి దాజీ ప్రసంగించనున్నారు. దాజీ అమెరికా పర్యటనలో భాగంగా.. జూన్ 1,2 తేదీల్లో అట్లాంటాలోని అంబాజీ శక్తి మందిరంలో ధ్యానానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. కాగా, సమాజానికి దాజీ అందిస్తున్న సేవలకు గాను జూన్ 8న కాలిఫోర్నియాలో ఆయనను సన్మానించనున్నారు.

జస్టిస్ శేషసాయి సేవలు ఎనలేనివి

హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

సాక్షి, అమరావతి: హైకోర్టు న్యాయమూర్తిగా జూన్ 2న పదవీ విరమణ చేయనున్న జస్టిస్ ఆకుల వెంకట శేషసాయికి హైకోర్టు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. జూన్ 2 ఆదివారం కావడంతో హైకోర్టు ఆయనకు శుక్రవారమే వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థకు జస్టిస్ శేషసాయి సేవలు ఎనలేనివన్నారు. న్యాయమూర్తిగా ఆయన 23 వేల కేసులు పరిష్కరించారని చెప్పారు. జస్టిస్ శేషసాయి సహనానికి మారుపేరని తెలిపారు. రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ.. న్యాయ పరిధిలో సమస్యలకు సమగ్ర పరిష్కారాలు చూపడం జస్టిస్ శేషసాయికే చెల్లిందన్నారు. రాజీ, మధ్యవర్తిత్వ విధానాలను ఎంతగానో ప్రోత్సహించారన్నారు. న్యాయవ్యవస్థలో రాబోయే తరాలను ప్రోత్సహించడంలో, వారిని సరైన దారిలో నడిపించడంలో జస్టిస్ శేషసాయి ముందుంటారన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థ పట్ల ఎంతో అకింతభావం ఉన్న వ్యక్తి జస్టిస్ శేషసాయి అని కొనియాడారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ.. జస్టిస్ శేషసాయి న్యాయవాదిగా ఎంతో కష్టపడి న్యాయమూర్తి స్థాయికి ఎదిగారన్నారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థుల కోసం ఎంతో సమయం కేటాయించి, వారికి మార్గ నిర్దేశం చేశారన్నారు. జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ.. తన ప్రస్థానంలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల కష్టమే తనను ఈ స్థాయిలో నిలబెట్టిందన్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గంగారావు, జస్టిస్ శేషసాయి కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

కొత్త వైద్య కళాశాలలకు 380 పోస్టుల మంజూరు

వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలకు 21 విభాగాల్లో 380 పోస్టులను ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను సీఎం జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, 2023–24 విద్యా సంవత్సరంలో మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం వైద్య కళాశాలలను ప్రారంభించారు. 2024–25 విద్య సంవత్సరంలో పాడేరు, పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని కళాశాలలను ప్రారంభించనున్నారు. కళాశాలకు 222, బోధన ఆస్పత్రికి 484 చొప్పున గతంలోనే కొత్త పోస్టులను మంజూరు చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా వైద్యులు, టీచింగ్ ఫ్యాకల్టీని అందుబాటులో ఉంచడంలో భాగంగా తాజాగా మరో 380 పోస్టులను మంజూరు చేశారు. 60 ప్రొఫెసర్, 85 అసోసియేట్ ప్రొఫెసర్, 75 అసిస్టెంట్ ప్రొఫెసర్, 160 ఎస్ఆర్/ట్యూటర్ పోస్టులకు కొత్తగా మంజూరు చేసిన వాటిలో ఉన్నాయి. కాగా, 2024–25 విద్య సంవత్సరంలో ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా శుక్రవారం 130 మంది ట్యూటర్, 37 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) నియామక ఉత్తర్వులిచ్చింది. కొత్త వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. నియామక ప్రక్రియ పూర్తి చేసి ఎంపికైన అభ్యర్థుల జాబితాలను డీఎంఈకి అందజేయగా వీరికి పోస్టింగ్‌లు ఇస్తున్నారు.





ప్రధాన నగరాలు, పట్టణాల్లో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	46.6	32.4
గుంటూరు	45.0	31.0
ఒంగోలు	44.0	31.0
మార్కాపురం	44.0	31.0
విజయవాడ	43.0	31.0
కనిగిరి	43.0	31.0
భీమవరం	43.0	30.0
కడప	42.0	32.2
ఏలూరు	42.0	30.0
కర్నూలు	42.0	29.6
రాజమహేంద్రవరం	42.0	29.0
తాడేపల్లిగూడెం	42.0	29.0
జంగారెడ్డిగూడెం	42.0	29.0
తిరుపతి	42.0	29.0
నూజివీడు	41.0	30.0
చిత్తూరు	40.0	27.0
అనకాపల్లి	38.0	30.0
విశాఖపట్నం	37.2	36.0
నరసాపురం	36.0	29.0

పక్కా లోకల్ సెర్చ్

- స్థానిక భాషల్లోనే 57శాతం ఇంటర్నెట్ వినియోగం
- భారతీయ భాషల ద్వారానే నెట్‌లో శోధన
- అగ్రస్థానంలో హిందీ, తర్వాత తమిళం

స్థానిక భాషలో ఇంటర్నెట్ యాక్సెస్ ఇలా..

భాష	శాతం	భాష	శాతం
హిందీ	24	గుజరాతీ	3
తమిళం	6	బెంగాలీ	2
తెలుగు	4	కన్నడ	2
మరాఠి	3	ఇతర దేశీయ భాషలు	10
మలయాళం	3	ఇంగ్లిష్	43

సాక్షి, అమరావతి: భారతీయ భాషల్లో ఇంటర్నెట్‌లో శోధన క్రమంగా పెరుగుతోంది. దేశంలో 57శాతం మంది ఇంటర్నెట్ వినియోగదారులు తమకు అవసరమైన అంశాలను స్థానిక భాషల్లోనే శోధించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా హిందీ భాషలో అత్యధికంగా ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ), మార్కెటింగ్ డేటా ఎనలిటిక్స్ కంపెనీ కాంతర్ సంయుక్త నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. అదేవిధంగా 2023నాటికి దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 45శాతం మంది ఇంటర్నెట్‌కు దూరంగా ఉన్నారని ఆ నివేదిక తెలిపింది. ఇంగ్లిష్‌లో ఉండే ఇంటర్నెట్ విధానాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, దాని ప్రయోజనాలపై తగినంత అవగాహన లేకపోవడం ఈ అంతరానికి ప్రధాన కారణమని తెలిపింది.

వాయిస్ శోధనతో సులభం..

గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లిష్ ప్రావీణ్యం చాలా తక్కువగా ఉంది. స్థానిక భాషల్లో కంటెంట్ ఉన్నప్పటికీ ఇంటర్నెట్‌లో ఇంగ్లిష్ ఎక్కువగా కనిపిస్తుంది. అయితే, వాయిస్ శోధన అందుబాటులోకి రావడంతోనే భారతీయ భాషల్లో ఇంటర్నెట్ వినియోగం క్రమంగా పెరిగింది. భారతీయ భాషల్లో ఇంటర్నెట్ వినియోగాన్ని పరిశీలిస్తే.. అత్యధికంగా వీడియోలు చూడటం, సంగీతం వినడం, కమ్యూనికేషన్, సోషల్ నెట్‌వర్కింగ్, ఆన్‌లైన్ షాపింగ్ వంటి అంశాలపై శోధనలు చేస్తున్నట్టు తెలుస్తోంది. స్థానిక భాషల్లో వాయిస్ శోధన ద్వారా భవిష్యత్తులో 40కోట్ల మందికి ఇంటర్నెట్‌ను చేరువచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మరొకరి ఫోన్లలో ఇంటర్నెట్ వినియోగం..

ఇప్పటికీ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కోసం బహుళ వినియోగదారులు ఒకే స్మార్టుఫోన్‌ను ఉపయోగిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 2021లో 11శాతం, 2022లో 13శాతం, 2023లో 21శాతం మంది వేరొకరి ఫోన్‌లో ఇంటర్నెట్‌ను వినియోగించారు. ఇదే పట్టణ ప్రాంతాల్లో అయితే 2021లో 5శాతం, 2022లో 10 శాతం, 2023లో 14 శాతంగా ఉంది. ఇక్కడ సొంతంగా స్మార్ట్‌ఫోన్ లేనివారు సైతం ఇంటర్నెట్‌ను వినియోగించడానికి ఆసక్తి పెంచుకోవడం కనిపిస్తోంది.

సీఎస్ మా భూముల వద్దకు రాలేదు..

- ఆ రోడ్డుపై వెళ్లారని సీఎస్‌పై సందేహం: రైతులు
- ప్రెస్‌మీట్‌లో జనసేన కార్పొరేటర్ తెల్లమొహం
- జవహర్‌పై బురద చల్లేందుకు ప్రయత్నించి భంగపాటు
- ఐదేళ్లుగా రెండు గ్రామాల మధ్య భూ వివాదాల రగడ



రైతులతో మీడియా సమావేశం పెట్టించిన జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

విశాఖ సిటీ: అసైన్డ్ భూముల వ్యవహారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిపై బురద జల్లడానికి ప్రయత్నించిన ఎల్లో మీడియా యత్నాలు బెడిసికొట్టాయి. సీఎస్‌పై విశాఖ జీవీఎంసీ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చేసిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని వెల్లడైంది. సీఎస్ ఎన్నడూ తమ భూముల వద్దకు రాలేదని, భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే సమయంలో రోడ్డు మీదుగా మాత్రమే వెళ్లారని జనసేన, టీడీపీ నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో రైతులు కుండబద్దలు కొట్టారు. విశాఖలో 800 ఎకరాల అసైన్డ్ భూములను సీఎస్ రైతుల నుంచి బలవంతంగా రాయించుకొని ఫ్రీ హోల్డ్ అనుమతులు పొందినట్లు పీతలమూర్తి యాదవ్ ఆరోపణలు చేశారు. దీన్ని ఆధారాలతో నిరూపిస్తానని బీరాలు పలికిన ఆయన శుక్రవారం టీడీపీ కార్యాలయంలో రైతులు చిట్టెమ్మ, అప్పన్న, నారాయణతో ప్రెస్‌మీట్ నిర్వహించి చివరకు తెల్లమొహంవేశారు.

అగ్రిమెంట్లు చేయలేదన్న రైతులు

తమ భూములను ఎవరికీ అగ్రిమెంట్ చేయలేదని మీడియా సమావేశంలో రైతులు స్పష్టం చేశారు. సీఎస్ ఎప్పుడైనా మీ భూములు ఇవ్వాలని బలవంతం చేశారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా అసలు జవహర్‌రెడ్డి ఎన్నడూ తమ భూముల వద్దకే రాలేదని రైతులు స్పష్టం చేశారు. ఇటీవల భోగాపురం విమానాశ్రయం పనుల పరిశీలన నిమిత్తం వచ్చినప్పుడు ఇటుగా వెళ్లడంతో అలా భావించామనడంతో టీడీపీ నేతలు, జనసేన కార్పొరేటర్ కంగుతిన్నారు.

700 ఎకరాలకే ఫ్రీ హోల్డ్ ప్రొసీడింగ్స్

గత ఎనిమిది నెలల్లో విశాఖ జిల్లాలో 700 ఎకరాల అసైన్డ్ భూములకు మాత్రమే ఫ్రీ హోల్డ్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. రాష్ట్రంలో అత్యల్పంగా అనుమతులు ఇచ్చిన జిల్లాల్లో విశాఖ రెండో స్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9.1 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ప్రకారం తెలుస్తోంది. దళితులకు అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో జీవో 596 ఇచ్చింది.

ఇరు గ్రామాల మధ్య ఐదేళ్లుగా వివాదం

టీడీపీ, జనసేన నేతలు తీసుకొచ్చిన రైతుల మధ్య భూ వివాదాలు ఐదేళ్లుగా నలుగుతున్నాయి. భీమిలి మండలం అన్నవరం, భోగాపురం మండలం తూడెం పంచాయతీల మధ్య అసైన్డ్ భూముల వివాదాన్ని సీఎస్‌కు అంటగట్టేందుకు ప్రయత్నించి జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ భంగపడ్డాడు. రైతులు మాట్లాడుతుండగా సీఎస్ పేరు చెప్పాలని ఆయన గదమాయించడం గమనార్హం. జవహర్‌రెడ్డి పేరు కూడా తెలియని వారంతా తడబడుతూ జవర్ అని పేర్కొన్నారు.

పార్టీకి సంబంధం లేదు..

సీఎస్‌పై పీతల మూర్తి యాదవ్ ఆరోపణల గురించి జనసేన విశాఖ అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను ఇటీవల మీడియా ప్రతినిధులు వివరణ కోరగా ఆయన వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని తేల్చి చెప్పడం గమనార్హం. ఆయన బయట చేసే వ్యాఖ్యలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

వేగంగా నైరుతి

రెండు రోజుల్లో రాష్ట్రాన్ని తాకే అవకాశం

అప్పటి వరకు కొనసాగనున్న ఎండల తీవ్రత



సాక్షి, అమరావతి/విశాఖపట్నం : నైరుతి రుతు పవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి. రెండు రోజుల్లో రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారానికి ఇవి రాయలసీమలోకి ప్రవేశిస్తాయని తెలుస్తోంది. ఇప్పటికే బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, త్రిపుర, మేఘాలయ, అస్సాంలోని కొన్ని ప్రాంతాలతో పాటు పశ్చిమ బెంగాల్, సిక్కింలోని చాలా ప్రాంతాలకు విస్తరించాయి. రాబోయే రెండు రోజుల్లో అరేబియా సముద్రంలోని పలు భాగాలు, లక్షద్వీప్, కేరళ, కర్ణాటక, తమిళనాడులోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో రుతు పవనాలు ప్రవేశించే వరకు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. రెమల్ తుపాను ప్రభావంతో గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో ఎండ, ఉక్కపోత ప్రభావం ఎక్కువగా ఉంటోంది. రుతు పవనాలు ముందుగా ప్రవేశించనుండటంతో రాష్ట్రంలో ఎండల తీవ్రత మిగిలిన ప్రాంతాల కంటే కొంచెం తగ్గనున్నట్లు అంచనా వేస్తున్నారు. అవి పురోగమించకపోతే ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉండేదని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఏదేమైనా మరో రెండు, మూడు రోజులు ఎండల తీవ్రత ఉంటుందని, ఆ తర్వాత వాతావరణం చల్లబడి వర్షాలు పడతాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం పల్నాడు జిల్లా వినుకొండలో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రకాశం జిల్లా పుల్లలచెరువులో 45.4 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 45.3, గుంటూరు జిల్లా తుళ్లూరు, ఫిరంగిపురంలో 45, బాపట్ల జిల్లా పర్చూరులో 44.8, నెల్లూరు జిల్లా జలదంకిలో 44.4, కృష్ణా జిల్లా కోడూరులో 44.2, అల్లూరి జిల్లా కూనవరంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కొద్ది రోజులు ఎండల్లో తిరగొద్దు

రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశిస్తున్నప్పటికీ, మరోవైపు ఎండల తీవ్రత మరికొద్ది రోజులు కొనసాగనుంది. ఈ తరుణంలో వడదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలి. వృద్ధులు, గర్భిణిలు, బాలింతలు తగిన జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలి. చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. గుండె జబ్బులు, షుగర్, బీపీ ఉన్న వారు ఎండలో తిరగకూడదని, శారీరక శ్రమతో కూడిన కఠిన పనులను ఎండలో చేయరాదని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు అక్కడక్కడ వడగాడ్పులు, వర్షం

శనివారం విజయనగరం జిల్లాలో 6, పార్వతీపురం మన్యం జిల్లాలోని 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 43 మండలాల్లో ఓ మోస్తరు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఆదివారం నుంచి మూడు రోజులు అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదివారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవచ్చు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఈ వేసవి భగభగ



ఈ ఏడాది వేసవి ఆద్యంతం అగ్ని గుండంగానే కొనసాగింది. గతానికి భిన్నంగా మార్చి మూడో వారం నుంచే సూర్య ప్రతాపం మొదలైంది. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా 44 డిగ్రీల వరకు నమోదయ్యాయి. అప్పట్నుంచే వడగాడ్పులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ మొదటి వారానికల్లా ఉష్ణోగ్రతలు మరింత తీవ్ర రూపం దాల్చాయి. సాధారణం కంటే 5–8 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలోని 358 మండలాల్లో వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీచాయి. మే నెల మధ్యలో నమోదు కావలసిన ఉష్ణోగ్రతలు ఏప్రిల్ రెండో వారంలోనే రికార్డయ్యాయి. ఏప్రిల్ 8న మార్కాపురంలో 46 డిగ్రీలు, మే 2న 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మే 3న నంద్యాల జిల్లా బండి ఆత్మకూరులో 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజనులో ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. ఆ తర్వాత కూడా పగటి ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు కొనసాగుతూనే ఉన్నాయి. మధ్యమధ్యలో వర్షాలు కురిసి ఉష్ణ తీవ్రతను కాస్త తగ్గించినా, రెండు మూడు రోజుల్లోనే మళ్లీ యథా స్థితికి చేరుకున్నాయి. ఇలా ఒకపక్క అధిక ఉష్ణోగ్రతలు, మరోపక్క వడగాడ్పులు పోటీ పడుతూ జనాన్ని బెంబేలెత్తించాయి. ఈ వేసవిలో రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే 5–9 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. ఏప్రిల్ 17న ప్రకాశం జిల్లా పెద్దారవీడులో 33.4 డిగ్రీలు, కర్నూలులో 32, కడపలో 31 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మే నెలలో రాత్రిళ్లు పలుమార్లు 31–34 డిగ్రీల వరకు నమోదయ్యాయి.

సరికొత్త రాష్ట్ర గీతం కోసం పోటీలు

ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ భౌగోళిక, సాహితీ, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేలా సరికొత్త రాష్ట్ర గీతాన్ని రూపొందించనున్నట్టు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా సరికొత్తగా రాష్ట్ర గీతాన్ని రూపొందించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అందించాలని సంకల్పించినట్లు చెప్పారు. ఇందుకోసం పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాన్ని గౌరవిస్తూనే.. వర్తమాన ఆంధ్ర ప్రాంత వైభవ స్వాభిమాన గీతాన్ని రూపొందించబోతున్నట్లు చెప్పారు. ఇందుకోసం గీత రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జూన్ 30వ తేదీలోపు.. కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్, అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రం, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునామాకు 5 నిమిషాల నిడివికి సరిపోయే గీత రచనలను పంపాలని కోరారు. జూలై 15 నాటికి వాటిని పరిశీలించి.. ఒక గీతాన్ని ఎంపిక చేసి రూ.లక్ష పారితోషికం అందిస్తామన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసుడితో ఆ గీతానికి స్వరకల్పన చేయించి ముఖ్యమంత్రికి సమర్పిస్తామన్నారు.

పల్నాడులో ఆగని టీడీపీ అరాచకం

- వైఎస్సార్‌సీపీ నాయకుడి సుబాబుల్ తోటకు నిప్పు
- నరసరావుపేట మండలం రావిపాడులో ఘటన



దహనమైన సుబాబుల్ తోట

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలో టీడీపీ గూండాల అరాచకాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించాడనే కక్షతో వైఎస్సార్‌సీపీ నాయకుడికి చెందిన సుబాబుల్ తోటకు నిప్పు పెట్టారు. నకరికల్లు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దినేని దాసయ్య ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేశాడు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డారు. కానీ దాసయ్య లొంగకపోవడంతో వారు కక్షగట్టారు. నరసరావుపేట మండలం రావిపాడు రెవెన్యూ పరిధిలో దాసయ్య ఆరు ఎకరాల సుబాబుల్ తోట ఉంది. గురువారం మధ్యాహ్నం టీడీపీ కార్యకర్త ఆ సుబాబుల్ తోటకు నిప్పుపెట్టాడు. దీనిని గమనించిన స్థానిక రైతులు కేకలు వేయడంతో ఆ టీడీపీ కార్యకర్త పారిపోయాడు. రైతులు ఆ మంటలను అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆరు ఎకరాల సుబాబుల్ తోట పూర్తిగా తగలబడిపోయింది. దాదాపు రూ.10 లక్షల నష్టం సంభవించిందని బాధితుడు దాసయ్య వాపోయాడు. ఈ ఘటనపై దాసయ్య శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి

- బ్యాంకుల్లో పింఛన్ లబ్ధిదారులకు తగిన నగదు నిల్వలు ఉండేలా చూడండి
- రాష్ట్ర బ్యాంకర్ల సంఘం కన్వీనర్‌కు ప్రభుత్వం లేఖ
- 65.30 లక్షల మందికి రూ.1,939.35 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: ఎన్నికల కోడ్ ఇంకా కొనసాగుతుండటంతో ఈసారి కూడా పింఛన్ లబ్ధిదారులకు నగదును వారి బ్యాంకు ఖాతాల్లోనే ప్రభుత్వం జమ చేసింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు.. ముఖ్యంగా 47,74,733 మంది అవ్వాతాతలకు బ్యాంకుల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ శుక్రవారం రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ కన్వీనర్‌కు లేఖ రాశారు. పింఛను నగదు తీసుకోవడానికి ఒకటో తేదీనే ఎక్కువ మంది అవ్వాతాతలు బ్యాంకుల వద్దకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకనుగుణంగా తగిన నగదు నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కాగా జూన్ ఒకటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 65,30,838 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ రకాల చేతివృత్తిదారులతోపాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు రూ.1,939.35 కోట్లను ఇప్పటికే విడుదల చేసినట్టు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం వేరొక ప్రకటనలో తెలిపారు. మొత్తం లబ్ధిదారుల్లో 73.11 శాతం మందికి డీబీటీ రూపంలో నేరుగా ఒకటో తేదీ ఉదయానికల్లా బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ పూర్తవుతుందన్నారు. లబ్ధిదారులు వారికి అనుకూల సమయంలో ఎప్పుడైనా ఆ డబ్బులను బ్యాంకుల నుంచి తీసుకోవచ్చని తెలిపారు. కాగా ఎనభై ఏళ్లు పైబడిన 17,56,105 (26.89 శాతం) మంది అవ్వాతాతలతోపాటు దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ కారణాలతో గత నెలలో ఇంటి వద్దనే పింఛన్ తీసుకున్నవారికి వారి సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామని వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది శనివారం నుంచి జూన్ 5 వరకు ఆయా లబ్ధిదారుల ఇళ్ల వద్దే డబ్బులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పంపిణీ కార్యక్రమం ప్రశాంతంగా పూర్తయ్యేలా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఏఐజీ రవీంద్రనాథ్‌బాబు సేవలు అమూల్యం



రవీంద్రనాథ్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా

సాక్షి, అమరావతి: పోలీస్ శాఖలో సుదీర్ఘకాలంపాటు సేవలందించిన ఏఐజీ రవీంద్రనాథ్‌బాబు సేవలు అమూల్యమైనవని డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా కొనియాడారు. రవీంద్రనాథ్‌బాబు పదవీ విరమణ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ 23 ఏళ్ల పాటు పోలీస్ శాఖలో పలు విభాగాల్లో రవీంద్రనాథ్‌బాబు సమర్థవంతంగా సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్, ఎస్పీ బి.రవిచంద్ర, అదనపు ఎస్పీ కె.రామచంద్రమూర్తి, డీఎస్పీ పి.జగన్నాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శిశు విక్రయాలు, అక్రమ దత్తతపై కఠిన చర్యలు

ఏపీ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పసిపిల్లలను విక్రయించేవారిపై, అనధికారిక దత్తత స్వీకరించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కొంతమంది శిశువులను విక్రయిస్తున్న ఘటనలపై స్పందించిన ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శిశువులను అక్రమంగా సేకరించి సంతానం లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా పోలీసులకు పట్టుబడిందని తెలిపారు. పోలీసులు నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 16 మంది శిశువులను గుర్తించి హైదరాబాద్‌లోని శిశు సంరక్షణ కేంద్రంలో చేర్పించారన్నారు. మీడియాలో దీనికి సంబంధించిన కథనాలు వచ్చిన నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి బాలల అక్రమ రవాణా రాకెట్ వెనుక ఉన్నవారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులను అప్పారావు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ఫెర్టిలిటీ కేంద్రాలు, క్లినిక్‌లపై నిరంతర నిఘా, పర్యవేక్షణ ఉంచాలన్నారు. గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చూడాలని రాష్ట్ర అధికారులను అప్పారావు ఆదేశించారు. శిశు విక్రయాలపై కమిషన్‌కు వచ్చిన సమాచారంతో సుమోటో కేసులు నమోదు చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శిశు విక్రయాలు, అనధికార దత్తత అంశాలపై రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర పోలీస్ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌కు నివేదిక సమర్పించాలని అప్పారావు ఆదేశించారు.

కొనసాగుతున్న పోలీస్ తనిఖీలు

సాక్షి, అమరావతి: ఓట్ల లెక్కింపు సమయం సమీపిస్తున్న కొద్దీ రాష్ట్రంలో పోలీస్ తనిఖీలు ముమ్మరం చేశారు. మూడు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు 579 ప్రదేశాల్లో నిర్వహించిన కార్డెన్- సెర్చ్ ఆపరేషన్లలో 16 మందిని అరెస్ట్ చేశారు. 374 లీటర్ల అక్రమ మద్యం, 1,400 లీటర్ల పులియబెట్టిన బెల్లం జప్తు చేశారు. సరైన పత్రాలు లేని 3,524 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

చేనుకుచేవ.. రైతుకు రొక్కం.. బయోచార్!

- వ్యర్థాలతోనే పంటలకు పోషకాల వృద్ధి
- బయోచార్‌తో పంట భూములు సారవంతం
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు



బయోచార్ కలిపే విధానాన్ని వివరిస్తున్న అధికారులు

పిఠాపురం: గత కొన్నేళ్లుగా మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువులు, పురుగు మందులతో భూమి తన సహజ గుణాలను కోల్పోయింది. దీంతో ఆశించిన నాణ్యమైన ఉత్పత్తులను అందించలేక, క్రమంగా చౌడుబారుతోంది. మొక్కలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు భూమిలో అంతరించిపోతున్నాయి. తద్వారా భూమి సారాన్ని కోల్పోయి నిస్తేజంగా మారి, నాణ్యమైన పంటలు పండే అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఈ సమస్య నుంచి రైతులను ఆదుకోవడానికి పూర్వం వాడుకలో ఉండే బయోచార్‌ను (బయో అంటే జీవం.. చార్ అంటే బొగ్గు) మళ్లీ వాడుకలోకి తీసుకు రావడానికి ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

బయోచార్‌తో ఇదీ మేలు...

వాస్తవానికి 1850 నుంచే ఈ పద్ధతి వినియోగంలో ఉన్నప్పటికీ కాలక్రమంలో మరుగున పడిపోయింది. ఎలాంటి ఎరువునైనా మొక్కలు గ్రహించి మంచి దిగుబడి రావడానికి బయోచార్ ఒక మంచి ఔషధంగా పని చేస్తుంది. ఆమ్ల గుణాలున్న మట్టి పీహెచ్ స్థితిని సాధారణ స్థాయికి తీసుకుని రావడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. సహజంగా మనం ఎన్ని ఎరువులు వేసినా, వాటిలో మొక్కకు 30 నుంచి 40 శాతం మాత్రమే అందుతాయి. పంటలకు వేసే ఎరువుల్లో బయోచార్‌ను కలపడం ద్వారా వంద శాతం ఎరువులను మొక్కలు గ్రహించే అవకాశముంటుంది. మట్టిలో తేమ శాతాన్ని క్రమబద్ధీకరించి, తగిన తేమ అందేలా చేయడంలో దీనికి మించింది మరొకటి లేదు. మొక్కలకు పోషకాలు అందని చోట ఇది ఉత్ప్రేరకంగా పని చేసి, మొక్కలకు పోషకాలు అందేలా చేస్తుంది. ముఖ్యమైన సూక్ష్మజీవుల సంఖ్యను పెంచుతుంది. నేలలో రసాయనాల గాఢతను తగ్గించి, సహజంగా మార్చుతుంది.

ఉపయోగించే విధానం...

కర్ర బొగ్గు 50 కేజీలు, చివికిన పశువుల పెంట 50 కేజీలు, రసాయనాలు వాడని అడవి మట్టి లేదా పుట్ట మట్టి 10 కేజీలు తీసుకుని, 8 నుంచి 10 లీటర్ల నీరు, రెండు కేజీల బెల్లం కరిగించి తీసుకోవాలి. దీంతో పాటు ద్రవ జీవామృతాన్ని నేరుగా దీనిలో కలపాలి. వీటన్నిటినీ బాగా కలియబెట్టి వారం పది రోజుల పాటు ఒక డబ్బాలో వేసి నీడలో పెట్టాలి. రోజుకోసారి కలుపుతూ ఉండాలి. లోపల గాలి తగిలే విధంగా గోనె సంచి మూత పెట్టి ఉంచుకోవాలి. పది రోజుల తరువాత బయోచార్ తయారవుతుంది. దీన్ని వరి దమ్ములో వేసుకోవాలి, ఉద్యాన పంటల్లో మొక్కల మొదళ్ల చుట్టూ పళ్లెం కట్టి దానిలో బయోచార్‌ను వేసి మట్టితో కప్పివేయాలి. దీనివల్ల పంట నాణ్యత పెరుగుతుంది.

బయోచార్ తయారీ ఇలా..

బహిరంగంగా కాల్చడం

- రెండు మీటర్ల పొడవు, ఒక మీటరు లోతున గొయ్యి తవ్వి, దానిలో వృక్ష వ్యర్థాలను వేసి, ఒకసారి మంట మండిన తరువాత దాన్ని పచ్చటి ఆకులతో కప్పి బయటి నుంచి ఆమ్లజని అందకుండా చేయాలి. తద్వారా రెండు రోజులకు బయోచార్ తయారవుతుంది.
- స్థానికంగా లభ్యమయ్యే వృక్ష వ్యర్థాలను, నిరుపయోగంగా పడి ఉండే కట్టెలను కాల్చడానికి వీలుగా గుల్ల తయారీ బట్టీల మాదిరిగా అర్ధచంద్రాకారంలో బట్టీలను తయారు చేసుకోవాలి.

ఆ బట్టీల్లో వృక్ష వ్యర్థాలు వేసి, కాల్చి రెండు రోజుల తరువాత తీసుకుంటే బయోచార్ సిద్ధమవుతుంది.

నాణ్యత, దిగుబడి పెరిగాయి...



రెండేళ్లుగా బయోచార్ ద్వారా నువ్వులు, వేరుశనగ, ఆకుకూరలు పండిస్తున్నాను. దీన్ని వేయక ముందు పంటలు నాసిరకంగా ఉత్పత్తయ్యేవి. బయోచార్ వాడటం మొదలు పెట్టాక పంటల నాణ్యతతో పాటు దిగుబడి బాగా పెరిగింది. నేల సారవంతంగా మారి వర్షాభావ పరిస్థితులను తట్టుకుని, మొక్కలు జీవంతో ఉంటున్నాయి. తేమ తగ్గిపోకుండా ఉంచడంలో ఇది చాలా బాగా పని చేస్తోంది. భూమిలో కార్బన్ శాతం పెరగడానికి ఇది బాగా ఉపయోగపడుతోంది.

– దుర్గాప్రసాద్, ఫార్మసీ సైంటిస్టు, రైతు, బలభద్రపురం, జగ్గంపేట మండలం, కాకినాడ జిల్లా

బయోచార్‌తో మంచి ఫలితాలు..



మా పొలంలో ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. గత ఏడాది ప్రకృతి వ్యవసాయ అధికారులు బయోచార్ గురించి వివరించడంతో దీన్ని ఉపయోగించడం ప్రారంభించాం. దీనివల్ల పంటలకు నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. తడులు తక్కువగా పెట్టినా ఇబ్బంది ఉండటం లేదు. పంటలు గతంలో కంటే ఆశాజనకంగా, నాణ్యతగా వస్తున్నాయి. ఎరువుల వాడకమూ తగ్గింది. కూరగాయలు ఎక్కువ రోజులు తాజాగా ఉంటున్నాయి. మొక్కల పెరుగుదల చాలా బాగుంది.

– ఎం.మల్లీశ్వరి, రైతు, ఒమ్మంగి, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా

ప్రయోగాత్మకంగా చేపట్టాం...



బయోచార్ విధానాన్ని గత ఏడాది నుంచి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఆచరణలోకి తెచ్చాం. ఈ ఏడాది 1,500 ఎకరాల్లో ఈ విధానంలో సాగు చేయాలని నిర్ణయించాం. ఇప్పటి వరకూ 50 ఎకరాల్లో 60 మంది రైతులు ఈ విధానంలో సాగు చేపట్టారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ విధానం అమలుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. దీన్ని ఒకసారి ఉపయోగిస్తే కనీసం 60 నుంచి 80 రోజుల పాటు పంటలకు పోషకాలను అందిస్తుంది. ఎనిమిదేళ్ల పాటు ఫలితం ఉంటుంది. ఎరువుల వాడకం 60 నుంచి 70 శాతం తగ్గిపోతుంది. నీటి ఎద్దడి ఉన్నా పంటలు నష్టపోకుండా దిగుబడులు ఇస్తాయి.

– ఎలియాజర్, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి, కాకినాడ

కమిటీతో బయోచార్ పంటల సాగు...



బయోచార్‌తో లాభాలను జిల్లాలోని రైతులకు తెలియజేస్తున్నాం. 2024 రబీలో 19 మంది రైతు శాస్త్రవేత్తలతో బయోచార్ తయారు చేయించి, పొలాల్లో వేయించి, ఆ పొలాల పరిస్థితిని అంచనా వేశాం. ఈ ఏడాది ఖరీఫ్, వచ్చే రబీలో 19 మంది రైతు మెంబర్లతో దీన్ని తయారు చేయించి, వారి పొలాల్లో వేయించి, పంటల తీరును ఇతర రైతులకు తెలియజేసేవిధంగా అవగాహన కల్పించాం. ఎక్కువ మంది రైతులు ఈ విధానంలో పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– రేష్మ సోమ, జిల్లా పాయింట్ పర్సన్, ప్రాజెక్టు లింక్ అసోసియేట్, కాకినాడ

ఆధునీకరణవైపు వేగంగా డిస్కంల అడుగులు







సాక్షి, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థల ఆధునీకరణ పథకం (ఆర్‌డీఎస్ఎస్) ద్వారా రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్)ల్లో పనుల వేగవంతానికి రాష్ట్ర ఇంధన శాఖ చర్యలు చేపట్టింది. విద్యుత్ పంపిణీ, సరఫరాకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ప్రస్తుత వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ ఉపయోగపడుతుంది. పాత నెట్‌వర్క్‌ను పునర్వ్యవస్థీకరించడం ద్వారా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయడం ఈ పథకం ముఖ్యఉద్దేశం. ఈ పథకంలో ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ వ్యవస్థను బాగుచేసి, కొత్త పరికరాలతో ఆధునీకరించేందుకు ప్రణాళికలను ఇప్పటికే అధికారులు రూపొందించారు. దీనివల్ల వినియోగదారులకు, ముఖ్యంగా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని అధికారులు భావిస్తున్నారు.

కొత్త కొత్తగా కరెంట్ వ్యవస్థ

విద్యుత్ ప్రమాదాలు జరగడానికి, విద్యుత్ సరఫరా నష్టాలు రావడానికి ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు బలంగా లేకపోవడం, ఓవర్ లోడ్ కావడమే ప్రధాన కారణమవుతుంది. ఆర్‌డీఎస్ఎస్‌లో భాగంగా వాటిని గుర్తించి లోడ్ సరిచేస్తారు. ఒకే ఫీడర్‌పై వ్యవసాయ, ఇతర సర్వీసులు ఉన్న చోట వాటిని వేరు చేసి, వ్యవసాయానికి ప్రత్యేక లైన్లు అందుబాటులోకి తెస్తారు. తద్వారా వ్యవసాయ బోర్లకు ఎలాంటి ఇబ్బంది రాకుండా విద్యుత్ సరఫరా జరుగుతుంది. గృహాలకు నిరంతర సరఫరాకు విఘాతం రాకుండా ఉంటుంది. అదే విధంగా ప్రకృతి విపత్తులు సంభవించినపుడు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను బాగుచేయడానికి కూడా ఇందులో నిధులు కేటాయించారు. మొదటి దశలో రాష్ట్రంలో 30 శాతం ఓవర్ లోడ్ అయిన ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసి, అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయడం, 33కేవీ, 11కేవీ, ఎల్‌టీ లైన్లలో 200 కిలోమీటర్ల మేర పాత కండక్టర్లు మార్చడం, సాంకేతిక సంబంధిత (ఐటీ) పనులు, తుపాన్లు వంటి ప్రకృతి విపత్తులు ఎక్కువగా సంభవించే ప్రాంతంలో భూగర్భ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయడం వంటి పనులను డిస్కంలు చేపడుతున్నాయి.

ఏడాదిన్నరలోపే పెట్టుబడి వెనక్కి

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్ల జీవితకాలం 25 ఏళ్లుగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) తన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. వినియోగ సమయం పెరిగేకొద్దీ కోర్ సాచురేషన్, వైండింగ్ ఇన్సులేషన్ డ్యామేజ్, ఆయిల్ నాణ్యత లోపించడం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లలో నష్టాలు పెరుగుతాయి. పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయటం వల్ల సమస్యలు తగ్గుతాయి. స్టార్‌రేటెడ్ ట్రాన్స్‌ఫార్మర్ల వినియోగం ద్వారా సుమారు 20 నుంచి 25 శాతం మేరకు సాంకేతిక నష్టాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. పెట్టిన పెట్టుబడి ఏడాదిన్నరలోపే వెనక్కి వస్తుంది. నాణ్యమైనవి కొనడం వల్ల ఇతర డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లతో పోల్చితే ఫెయిల్యూర్ శాతం చాలా తక్కువగా ఉంటుంది.

వచ్చే ఏడాదికల్లా మొదటిదశ పూర్తి

ఆర్డీఎస్ఎస్ పథకం తొలి దశలో పాతవైపోయిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు, బ్రేకర్లు మార్చడం ద్వారా నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, వ్యవసాయ విద్యుత్తు ఫీడర్లు విభజన, తుపాను ప్రభావిత ప్రాంతంలో భూగర్భ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటు, స్మార్ట్ మీటర్లు టెండర్ల ప్రక్రియను దశలవారీగా చేపట్టి, పనులను సంబంధిత గుత్తే దారులకు అప్పగించారు. రెండవ దశ విద్యుత్ వ్యవస్థ ఆధునికరణకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) తనిఖీ కోసం డిస్కంలు పంపించాయి. అక్కడి నుంచి క్లియరెన్స్ రాగానే డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను తయారు చేసి డిపార్ట్‌మెంటల్ రివ్యూ కమిటీ (డీఆర్‌సీ), రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం కోసం ఇంధన శాఖకు పంపుతాయి. ఆర్డీఎస్ఎస్ పనులను డిస్కంలు నిర్దేశిత సమయంలో పూర్తి చేస్తే కేంద్ర ప్రభుత్వ గ్రాంటు లభిస్తుంది. మొదటి దశ పనులు ఇప్పటికే ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులను పూర్తి చేయడానికి 2025 వరకూ గడువు ఉంది.



> ఆ పరమాత్మ సకల ప్రాణుల హృదయ కమలాల్లో స్థితమైవుండి, అన్నమయమైన స్థూలశరీరంలో ప్రతిష్ఠితుడై ఉంటాడు.
>
> – ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 1 జూన్ 2024

మహాపరాధి ట్రంప్!

అధికారంలోకొచ్చింది మొదలు అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను నేరస్తుడిగా నిరూపించాలని తపిస్తున్న డెమాక్రాటిక్ పార్టీ వాంఛ చివరి అంకంలో నెరవేరింది. నీలి చిత్రాల తార స్టార్మీ డేనియల్స్ నోరు మూయించడానికి భారీగా సొమ్ము ముట్టజెప్పి, ఆ మొత్తాన్ని ట్రంప్ తన కంపెనీ ఖాతాల్లో వేరేగా చూపారన్న ఆరోపణ రుజువు కావటంతో మన్‌హట్టన్ న్యాయస్థానం ఆయన్ను మహాపరాధిగా తేల్చింది. భిన్న రంగాలకు చెందిన అయిదుగురు మహిళలతో సహా 12 మందితో కూడిన జ్యూరీ... ఈ వ్యవహారంలో ట్రంప్‌కు విధించబోయే శిక్ష ఏమిటన్నది ఇంకా ప్రకటించలేదు. వచ్చే నెల 11న వెల్లడించే ఆ శిక్ష తప్పనిసరిగా కారాగారవాసమే కానవసరం లేదని, అది జరిమానా మొదలుకొని ప్రొబేషన్‌లో ఉంచటం వరకూ ఏదైనా కావొచ్చన్నది న్యాయనిపుణులు చెబుతున్న మాట. ఇది క్రిమినల్ కేసే అయినా వ్యక్తిని హతమార్చటం వంటిది కాదు గనుక జైలు శిక్ష ఉండకపోవచ్చంటున్నారు. జైలుకు పోయినా పోకపోయినా దేశాధ్యక్ష పదవికి జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీపడటానికి అదేమీ అవరోధం కాదు. తీర్పు వెలువరించే ముందు జ్యూరీకి నాయకత్వం వహించిన న్యాయమూర్తి జువాన్ మెర్కన్ తన సహచరులను లాంఛనంగా 'తీర్పుతో మీరు ఏకీభవిస్తున్నట్టేనా...' అని అడగటం, వారు అంగీకారాన్ని తెలపటం పూర్తయ్యాక ట్రంప్ అక్కడినుంచి నిష్క్రమించారు. వెళ్లేముందు 'ఇది మోసపూరితమైన, సిగ్గుమాలిన తీర్పు. అసలు తీర్పును నవంబర్ 5న అమెరికా ప్రజలివ్వబోతున్నారు' అని ఆయన చేసిన వ్యాఖ్య గమనించదగ్గది. వచ్చే అయిదారు నెలల్లో ఆ దేశ రాజకీయ పోకడలెలా ఉండబోతున్నాయో ట్రంప్ వ్యాఖ్య చెబుతోంది. ట్రంప్ నేరం రుజువై అపరాధిగా తేలిన తొలి కేసు ఇదే.

దేశాధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ 2016లో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలోనే ట్రంప్‌ను అనేకానేక కుంభకోణాలు చుట్టుముట్టాయి. తమపై లైంగిక నేరానికి పాల్పడ్డాడని, అసభ్యకర చేష్టలతో వేధించాడని కొందరు మహిళలు ఏకరువు పెట్టగా, ఆయన ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడంటూ మరికొందరు ఆరోపించారు. ఇవిగాక 2021లో పదవినుంచి దిగిపోయేనాటికి రెండు క్రిమినల్ కేసులు కూడా వచ్చిపడ్డాయి. తన గెలుపును డెమాక్రాటిక్ పార్టీ కొల్లగొట్టిందంటూ పార్టీ శ్రేణుల్ని రెచ్చగొట్టడం, అధికార బదలాయింపు కోసం సెనేట్, ప్రతినిధుల సభ కొలువుదీరిన వేళ కాపిటల్ హిల్ భవనంపైకి జనాన్ని మారణాయుధాలతో ఉసిగొల్పటం తదితర ఆరోపణలున్న కేసు కొలంబియా కోర్టులో సాగుతోంది. బైడెన్ విజయాన్ని మార్చడానికి ప్రయత్నించారన్న అభియోగంపై జార్జియాలో విచారణ కొనసాగుతోంది. పదవి నుంచి దిగిపోతూ రహస్య పత్రాలు వెంటతీసుకెళ్లడం తదితర నేరాభియోగాలు ఫ్లోరిడాలో విచారిస్తున్నారు. వీటికి అనుగుణంగా రెండు అభిశంసన కేసులు నమోదయ్యాయి. వీటిల్లో ఒక అభిశంసనపై కింది కోర్టు తీర్పిచ్చినా అమెరికా సుప్రీంకోర్టు దాన్ని కొట్టేసింది. ఆ అధికారం అమెరికన్ కాంగ్రెస్‌కే ఉంటుందని తేల్చింది. లైంగిక నేరాలకు సంబంధించి మహిళలు చేసిన ఆరోపణలు వీగిపోయాయి. 2006 నాటి తన రాసలీలల సంగతి బయటపెట్టొద్దని అభ్యర్థిస్తూ న్యాయవాది ద్వారా స్టార్మీకి పంపిన 1,30,000 డాలర్ల డబ్బే ఇప్పుడు ట్రంప్‌ను నిండా ముంచింది. ఈ కేసులో వచ్చిన మొత్తం 34 అభియోగాలూ రుజువయ్యాయని న్యాయస్థానం తేల్చింది. ట్రంప్ గద్దెనెక్కకుండా నిరోధించేది ప్రజా తీర్పేనని అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించినా ఆ విషయంలో డెమాక్రాటిక్ పార్టీకి పెద్దగా ఆశలున్నట్టు కనబడదు. తటస్థులైన ఓటర్లలో ఒకటి రెండు శాతంమంది తాజా తీర్పు వెలువడ్డాక ట్రంప్‌కు వోటేయాలన్న తమ నిర్ణయాన్ని మార్చుకున్నట్టు చెప్పినా అదేమంత ఉపయోగపడేలా కనబడటం లేదు. తొక్కేయాలని చూస్తున్నకొద్దీ ఆయన మరింత బలశాలిగా మారుతున్నాడంటూ రిపబ్లికన్ వ్యూహకర్త స్కాట్ రీడ్ చేసిన వ్యాఖ్య అవాస్తవం కాదు. గత ఆరు వారాలుగా ట్రంప్ రేటింగ్ పెరగటం, ఆయనకొచ్చే విరాళాల వెల్లువ ఇందుకు తార్కాణం. అయిదారేళ్లుగా రిపబ్లికన్ పార్టీ తన సామాజిక మాధ్యమాల ద్వారా, ఫాక్స్ న్యూస్ వంటి పార్టీ అనుకూల మీడియా ద్వారా సాగిస్తున్న ప్రచారం దీనికి కారణం. పార్టీ మొత్తం ట్రంప్ వెనక దృఢంగా నిలబడి ఆయన మాటలనూ, చేష్టలనూ సమర్థిస్తూ వచ్చింది. తమ నాయకుడిది తప్పంటున్న డెమాక్రాటిక్ నేతలే నేరగాళ్లంటూ ఊదరగొట్టింది. వీటి మాటెలావున్నా న్యాయస్థానం మహాపరాధిగా తేల్చిన వ్యక్తి దేశాధ్యక్షుడిగా వ్యవహరించటం సరైందేనా అన్న మీమాంస నడుస్తోంది. నాలుగు వందల ఏళ్లనాటి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి సందేహాలు ఎప్పుడూ రాలేదు. నేర నిరూపణ అయిన వ్యక్తి వందేళ్ల క్రితం జైలునుంచి పోటీచేసిన చరిత్రవున్నా మాజీ అధ్యక్షుడు మహాపరాధిగా తేలటం, ఆయనే మరోసారి బరిలో దిగటం కనీవినీ ఎరుగనిది. ఈ విషయంలో రాజ్యాంగంలో నిర్దిష్టమైన నిబంధనేదీ లేదు.

ట్రంప్ ఈ నాలుగేళ్లలో మారిందేమీ లేదు. ఎన్నికల్లో గెలిచిన ప్రత్యర్థికి రాజ్యాంగబద్ధంగా అధికారాన్ని బదలాయించటానికి బదులు అనుచరులను రెచ్చగొట్టి అవరోధాలు సృష్టించాలని చూసిన ట్రంప్‌కు ఇప్పటికీ వ్యవస్థలంటే గౌరవం లేదు. తిరిగి నెగ్గితే ఆయన చేయబోయే పనుల్లో వలసలను కట్టడి చేయటం మొదలుకొని అంతర్జాతీయ సాయానికి కత్తెరేయటం వరకూ చాలావున్నాయి. ప్రభుత్వ సిబ్బంది సర్వీసు భద్రతను తొలగించే ప్రయత్నం కూడా చేస్తానని ఇప్పటికే చెప్పారు. గెలిచి అందలమెక్కితే ట్రంప్‌పై కేసులు వ్యక్తిగతంగా ఆయనకు మాత్రమే కాదు... అమెరికాకు సైతం సమస్యగా మారడం ఖాయం.

జనం తీర్పు ఏం చెప్పనుంది?

జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. నాయకత్వం, గుర్తింపు, ఆర్థిక వ్యవస్థ గురించి భారతీయ ఓటర్లు ఏమి చెబుతున్నారనే అంశంపై దృష్టి పెట్టి ఈ ఫలితాలను చూడాల్సి ఉంటుంది. ప్రస్తుత బీజేపీ పాలన తన వంతు ఉత్తమంగా కృషి చేసిందా? భవిష్యత్తులో ఆదాయాలను మెరుగు పరచడానికి, ఉద్యోగాలు వస్తాయని విశ్వసించడానికి మోదీ ఆర్థిక సంక్షేమ నమూనా సరిపోతుందా? అధికార ప్రతిపక్షాలు రెండూ తమవైన వివరణలను జోడించి చేసిన 85 శాతం–15 శాతం ప్రచారాన్ని ఓటర్లు ఎలా తీసుకున్నారు? ద్రవ్యోల్బణం, మరింత ఉచిత రేషన్‌పై వాగ్దానం వంటివి మార్పు జరగాలనే ఆకాంక్షకు దారితీశాయా? ఇలాంటి ప్రశ్నలకు ఓ రెండ్రోజుల్లో సమాధానం లభిస్తుంది.

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

జూన్ 4న వెల్లడి కానున్న సార్వత్రిక ఎన్నికల లెక్కల్లో బీజేపీ 303 స్థానాలకు పైగా గెలుచుకోవచ్చు. లేదా దాని స్థానాలు 272 నుంచి 303 మధ్య ఉండవచ్చు. లేదా మెజారిటీ మార్కు కంటే తక్కువగా ఉండవచ్చు. వీటి గురించి ఇప్పటికైతే ఎవ్వరికీ తెలియదు. అయితే నాయకత్వం, గుర్తింపు, ఆర్థిక వ్యవస్థ గురించి భారతీయ ఓటర్లు మనకు ఏమి చెబుతున్నారనే అంశంపై దృష్టి పెట్టి ఆ ఫలితాలను పరిశీలించండి.

గత దశాబ్దం గురించిన స్పష్టమైన మొదటి పరికల్పనను ఇక్కడ చూద్దాం. నరేంద్ర మోదీ రాజకీయాలను పునర్నిర్వచించారు. ప్రతి ఎన్నికా స్థానిక, జాతీయ సమతూకంతో ఉంటుంది. అయితే సంక్షేమ పథకాల పంపిణీ, ఎడతెగని జాతీయ సందేశపు ప్రదర్శనతో మోదీ జాతీయతను, స్థానికతను అనుసంధానించారు. దీంతో 2014, 2019 ఎన్నికల్లో భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన ప్రాంతాల్లో కూడా బీజేపీ అభ్యర్థులు ఎదుర్కొన్న ప్రతికూలతలను పూడ్చడానికి మోదీ ప్రజాదరణ సరిపోయింది. మరోవైపున ఓటర్లు కూడా తమ శాసన సభా కార్యకలాపానికి ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారు అనే అంశాని కన్నా, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎవరు నడుపుతారు అనేదానికి ప్రాధాన్యతను ఇచ్చారు.

2024 తీర్పు ఈ ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. బీజేపీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో, కొత్త భౌగోళిక ప్రాంతాలలో ఇంకా ఎక్కువ మంది ఓటర్లను మోదీ ఆకర్షిస్తున్నారా, లేదా? బీజేపీ అభ్యర్థి స్వభావం లేదా కుల సమీకరణలు లేదా ఆర్థిక ఆందోళన నుండి ఉత్పన్నమయ్యే స్థానిక బలహీనతలను పూడ్చడానికి మోదీ ఇమేజ్ సరిపోతుందా? ఓటర్లు భారత ప్రభుత్వ అధికారంలో ఒక బలమైన నాయకుడిని కోరుకుంటున్నారా లేక బలమైన తనిఖీలతో 1989–2014 మధ్యకాలపు తరహా ఏర్పాటు తిరిగి రావాలని కోరుకుంటున్నారా?

ఇక రెండో పరికల్పన హిందూ మత–రాజకీయ గుర్తింపునకు పెరుగుతున్న భావన గురించి. దీన్ని బీజేపీ స్పష్టమైన అవగాహనతోనే పెంచి పోషించింది. హిందూ మత గుర్తింపునకు సంబంధించిన రాజకీయ ప్రకటనకు ప్రభుత్వ మద్దతు ఉంది. కల్పిత మనోవేదనల సమాహారం ద్వారా ముస్లింలను ఇతరులుగా మార్చే భావన మరొకటి. వెనుకబడిన, దళిత ఉప సమూహాలకు సాంస్కృతిక, రాజకీయ ప్రాతినిధ్యాన్ని అందించడం ద్వారా సమ్మిళిత హిందూ గుర్తింపును నిర్మించడం కూడా దీని వెనుక ఉంది. అయోధ్యలో లేదా కశ్మీర్‌లో లేదా దేశ విభజన సమయంలో జరిగిన చారిత్రక అన్యాయాల 'సవరణ' ఉంది. హిందువులు ఐక్యంగా ఉంటే, వారు ముస్లిం ఓట్లను అసంగతం చేయగలరనీ, ముస్లిం ప్రాతినిధ్యాన్ని చాలావరకు తగ్గించగలరనీ చూపించడానికి ఒక ఎన్నికల నమూనా కూడా దీని వెనుక ఉంది.



కులాలకు అతీతంగా హిందుత్వ సామాజిక గాఢత కనబడటం, 'లౌకికవాదం' ప్రతిధ్వనులు ఎక్కడా వినిపించకపోవడం, ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీలు) మద్దతు వంటివి తనకు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ నీరుగారిపోయింది. బీజేపీ తరహా రాజకీయ మతపరమైన గుర్తింపును సవాలు చేసే కథనం తన దగ్గర లేకపోవడంతో కుల గణన, మరిన్ని రిజర్వేషన్లు, అన్ని రంగాలలో అన్ని కుల సమూహాలకు దామాషా ప్రాతినిధ్యాన్ని వాగ్దానం చేసింది. ఇది చారిత్రాత్మకం! జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్... దేశాన్ని కుల సమూహాలు, మతాలు, జాతుల మొత్తంగా కాకుండా హక్కులతో కూడిన, వ్యక్తిగత పౌరులతో కూడిన ఒక పెద్ద సమూహంగా భావించింది. మౌలికమైన అస్తిత్వ ఆధారిత విధానాల కంటే సామాజిక ప్రయోజనాలను సమతుల్యం చేసే క్రమానుగతమైన మార్పును విశ్వసించింది. ఈ రెండు అంశాలకు సంబంధించినంతవరకూ నెహ్రూ పార్టీని రాహుల్ గాంధీ భారత రాజకీయాలను సామ్యవాద స్రవంతి వైపు తిరిగి మళ్లించారు. పైగా కమ్యూనిస్ట్ స్రవంతి నుండి అరువు తెచ్చుకున్న బలమైన పెట్టుబడిదారీ వ్యతిరేక వైఖరిని దానికి జోడించారు.

హిందూ గొడుగులోని సంకీర్ణ కూటమిని విచ్ఛిన్నం చేయడానికి, ప్రతిపక్షాలు ఎన్నికలను 85%–15% యుద్ధంగా మలిచాయి. ఇక్కడ బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న 15 శాతం అంటే 'ఇతరులైన' ఉన్నత కులాలు. దళితులు, ఓబీసీలు, గిరిజనుల రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ ఉద్దేశించినట్లు అది తప్పుగా పేర్కొంది. మరోవైపున తన సొంత హిందూ సామాజిక సంకీర్ణాన్ని కొనసాగించడానికి, బీజేపీ ఈ ఎన్నికలను 85% వర్సెస్ 15% యుద్ధంగా రూపొందించింది. ఇక్కడ 15 శాతం అంటే 'ఇతరులైన' ముస్లింలు ఇండియా కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆరోపించింది. అట్టడుగు హిందువుల రిజర్వేషన్లను రద్దు చేసి, వాటిని ముస్లింలకు ఇవ్వడానికి కాంగ్రెస్ ఉద్దేశించినట్లు బీజేపీ తప్పుగా ఆరోపించింది. అన్ని ప్రశ్నల పరంపరకు ఈ ఎన్నికల తీర్పు సమాధానం ఇస్తుంది. ఏకీకృత హిందూ రాజకీయ గుర్తింపునకు చెందిన ఆలోచన భౌగోళికంగా దక్షిణాదిలో కూడా విస్తరించి, సామాజికంగా దళితులు, గిరిజనులలో లోతుగా పాతుకుపోయిందా? రిజర్వేషన్ నిర్మాణాన్ని మరింత విస్తరించడానికి ఈ తీర్పు పార్టీలను ఎంతవరకు ఒత్తిడికి గురి చేస్తుంది?

మూడవ పరికల్పన రాజకీయ ఆర్థిక వ్యవస్థ గురించి. మోదీ నమూనా మౌలిక సదుపాయాలలో తయారీపై, పెట్టుబడులు పెంచడంపై ఆధారపడినది. ప్రైవేట్ వ్యవస్థాపకతను ముందుకు తీసుకుపోవడానికి డిజిటల్ ప్రభుత్వ మౌలిక వసతులను ఉపయోగించడం; ఆర్థిక మార్కెట్లను విస్తరించడం; పరపతిని సరళీకరించడం; ఆర్థిక వ్యవస్థను లాంఛనప్రాయంగా మార్చడం; సేవలలో భారతదేశ బలాన్ని పెంచడం; నగదు, గృహాలు, నీరు, ఆహారం, విద్యుత్, వంట గ్యాస్ వంటి వాటిని అందుకునే కోట్లాది మంది ప్రజలతో కూడిన సంక్షేమ వలయాన్ని సృష్టించడం ఈ నమూనాలో భాగం. సంక్షేమం ఒక తరగతి లబ్ధిదారులను సృష్టించింది, గుర్తింపులు, ప్రాంతాల వ్యాప్తంగా మహిళా ఓటర్ల మద్దతును గెలవడానికి ఇవి మోదీకి సహాయపడ్డాయి. కానీ ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోవడంపై ప్రజల్లో కోపం, బాధ పెరుగుతున్నాయని కూడా స్పష్టమైంది. గరిష్ఠంగా నగదు బదిలీలు, ప్రభుత్వ రంగ ఉపాధి, ఒక సంవత్సరం అప్రెంటిస్‌షిప్ ప్రణాళికతో సహా మరింత సంక్షేమానికి ప్రతిపక్షాలు వాగ్దానం చేశాయి.

ప్రస్తుత పాలన తన వంతు ఉత్తమంగా కృషి చేసిందా? భవిష్యత్తులో ఆదాయాలను మెరుగుపరచడానికి, ఉద్యోగాలు వస్తాయని విశ్వసించడానికి మోదీ ఆర్థిక సంక్షేమ నమూనా సరిపోతుందా? ఓటర్లను, ముఖ్యంగా మహిళలను, యథాతథ స్థితికి కట్టుబడి ఉండటానికి లేదా బీజేపీ రాజకీయ ప్రయోజనాలు నెరవేరడానికి సంక్షేమం ప్రేరేపణ కలిగించిందా? రాజకీయ–క్యాపిటల్ నెట్‌వర్క్‌పై ప్రజలకు ఆగ్రహం ఉందా? మహమ్మారి అనంతరం వివిధ రూపాల్లో దేశం కోలుకోవడం జరిగిందా? ద్రవ్యోల్బణం, మరింత ఉచిత రేషన్‌పై వాగ్దానం వంటివి మార్పు జరగాలనే ఆకాంక్షకు దారితీశాయా?

తమను ఎవరు నడిపించాలనుకుంటున్నారు, తమను ఎలా నిర్వచించాలనుకుంటున్నారు, తమ ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించి వారు ఎవరిని విశ్వసిస్తారు అనే కీలకాంశాలను రెండ్రోజుల్లో ఓటర్లు ప్రకటిస్తారు. ఇది 2024కి సంబంధించిన అసలైన కథ.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పోయిన ఛాన్స్



ఎటూ అన్ని కోణాల్లో కెమెరాలు ఉంచారు కాబట్టి, మోదీ ధ్యానాన్ని ఒక ఇంటెరాక్టివ్ ఈవెంట్‌గా మలిచే విషయంలో బీజేపీ ఒక గొప్ప మార్కెటింగ్ అవకాశాన్ని కోల్పోయింది. 'మోదీతో ధ్యానం చేయండి' అని ప్రకటించి, దాన్ని లైవ్ స్ట్రీమ్ చేస్తూ, అందరినీ తమ తమ స్థానాల్లోంచే చేయమని చెబితే పోయేది.

– కార్తీక్, మార్కెటింగ్ స్ట్రాటజీ కన్సల్టెంట్

బంగారు భారత్



రిజర్వ్ బ్యాంకు తన 100 టన్నుల బంగారం నిల్వలను యూకే నుంచి ఇండియాకు తరలించింది. చాలా దేశాలు తమ బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ లేదా అలాంటి ప్రదేశాల్లో ఉంచి, దానికోసం ఫీజు చెల్లిస్తాయి. 1991లో రాత్రికి రాత్రి మన బంగారాన్ని తరలించిన స్థితి నుంచి ఇండియా చాలాదూరం ప్రయాణించింది.

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

వద్దు పొగాకు



నా అంతర్జాతీయ కెరీర్ ప్రారంభంలో మా నాన్న నాకు సాధారణమే అయినా ముఖ్యమైన సలహా ఇచ్చారు: పొగాకును ప్రమోట్ చేయొద్దు. నేను దాన్ని పాటించాను. మీరు కూడా పాటించొచ్చు. మెరుగైన భవిష్యత్ కోసం మనం పొగాకు మీద ఆరోగ్యాన్ని ఎంపిక చేసుకుందాం (మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం)

– సచిన్ టెండూల్కర్, క్రికెటర్

వ్యవస్థ తీరు



ఒక మాజీ యూఎస్ అధ్యక్షుడి మీద తీవ్రమైన నేర నిర్ధారణ జరిగింది... ఇరాక్ లేదా అఫ్గానిస్తాన్ యుద్ధాలు, అక్రమమైన సీఐఏ కుట్రలు, డ్రోన్ దాడులు లేదా అమెరికన్ల మీద నిఘా పెట్టడం విషయంలో కాదు; కేవలం ఒక పోర్న్ స్టార్‌కు 1,30,000 యూఎస్ డాలర్ల చెల్లింపును ట్రంప్ తప్పుగా వర్గీకరించడంపై!

– గీగర్ క్యాపిటల్, వ్యాఖ్యాత

ఒప్పుకొన్నట్టేనా?



కశ్మీరీ కవి అహ్మద్ ఫర్హాద్ కేసు విషయంలో, పాకిస్తాన్‌కు సంబంధించి కశ్మీర్ 'విదేశీ ప్రదేశం' అని ఆ దేశ అదనపు అడ్వకేట్ జనరల్(దేశ ప్రతినిధి) ఇస్లామాబాద్ హైకోర్టులో అంగీకరించారు. (ఫర్హాద్‌ను ఐఎస్ఐ అపహరించింది.)

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

కళ విశ్వజనీనం

గత కొన్ని రోజులుగా తెలంగాణ రాష్ట్ర గీతంపై ఒక తీవ్రమైన చర్చ నడుస్తోంది. ఈ గీతానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు అనగానే చాలామందికి ఇది ఆత్మ గౌరవంతో ముడిపడిన వ్యవహారంగా కనబడింది. తెలంగాణ గీతానికి తెలంగాణేతర సంగీత దర్శకులు వుండ కూడదా? ఉంటే వచ్చే నష్టం ఏమిటి?

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్న తరుణంలో ఎక్కడ చూసినా 'జయ జయహే తెలంగాణ' అన్న గీతాన్నే నాలుగున్నర కోట్ల గొంతుకలు ఒక్కటై నినదించాయి. పది జిల్లాల గొప్పతనం గురించి అత్యద్భుతంగా అల్లిన అక్షర మాలను అందెశ్రీ ఎంతో ప్రేమతో, తెలంగాణపై భక్తితో జాతికి అంకితం చేశారు. ఇంత వరకు బాగానే వుంది. కాని, తెలంగాణ సిద్ధించిన తర్వాత మాత్రం ఆ గేయానికి ప్రభుత్వం మాత్రం ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదన్నది అందరికీ తెలిసిన విషయమే.

మరి అప్పటి ప్రభుత్వానికి ఆత్మ గౌరవం అంటే తెలియలేదమో. లేక అందెశ్రీ అక్షరాలపై వివక్ష వున్నదో తెలియదు కాని, దాన్ని రాష్ట్ర గీతంగా పెట్టటానికి మనసు రాలేదు. ఇన్నాళ్ళకు మొత్తానికి ప్రస్తుత ప్రభుత్వం దాన్ని రాష్ట్రగీతంగా ప్రకటించింది. కాని, ఇప్పుడే అసలైన సమస్య మొదలైంది. తెలంగాణ జాతికి అంకితం చేసే గీతానికి మరింత వన్నె తెచ్చి యావత్ తెలంగాణకు ఒక గొప్ప రాష్ట్ర గీతం అందివ్వాలని ప్రముఖ సంగీత దర్శకులు కీరవాణికి దానికి సంగీతం అందించే బాధ్యతను అప్పగించింది ప్రభుత్వం. వెంటనే మేధావులు, నాయకులు, కళాకారులు అందరూ ఒక్కసారిగా ఆంధ్ర వాళ్ల చేతిలో ఆత్మ గౌరవం ఎలా పెడతారు అని అడుగుతున్నారు.

పాటకి అక్షరమే ప్రాణం. సంగీతం కేవలం పాటకి హంగు మాత్రమే. తెలంగాణేతరులు సంగీతం అందిస్తే తెలంగాణ ఆత్మ గౌరవం దెబ్బతింటుందా? కళకు ప్రాంత, లింగ, వర్ణ విభేదాలు ఉండవు. అది విశ్వజనీనం. మరి ఈ విషయం అర్థమయ్యేలా ఈ విమర్శకులకు ఎలా చెప్పాలి?

– రామ్ ఠాకూర్ । విశ్లేషకులు, రచయిత

ఈసీ పనితీరు విస్మయం కలిగిస్తోంది!

అభిప్రాయం



పూనూరు గౌతమ్ రెడ్డి

దేశంలో స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థల పనితీరు గడచిన దశాబ్దన్నర కాలం నుండి ప్రశ్నార్థకంగా మారింది. తమకు వ్యతిరేకంగా ఉన్న వారిపట్ల ఈ వ్యవస్థలను ఉపయోగించి వారిని బలవంతంగా లొంగదీసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నది సామాన్య మానవుడిలో ఉన్న మీమాంస. దీనికి ఆయా ప్రభుత్వాలే సమాధానం చెప్పాల్సిన అవసరం కూడా ఉందన్నది నిర్వివాదాంశం. నిన్న మొన్నటి వరకూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దేశ వ్యాప్తంగా వార్తల్లోకెక్కింది. దీని పనితీరుపై ప్రజల్లో అనేకానేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, ప్రజల అనుమానాలు నివృత్తి చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నది కూడా నిర్వివాదాంశమే. ఇప్పుడు ఎన్నికల కమిషన్ వ్యవహార శైలిపై కూడా ప్రజల్లో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. వాటన్నింటికీ సమాధానం చెప్పాల్సిన ఈ కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నది ప్రజల ఆరోపణ. మరికొన్ని గంటల్లో దేశ వ్యాప్తంగా ఆరు విడతల్లో జరిగిన ఎన్నికలకు సంబంధించి కీలకమైన ఓట్లలెక్కింపు ప్రక్రియ ప్రారంభం కాబోతోంది. దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఈ గెలుపోటములపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయకుండా ఎన్నికల కమిషన్ ఒంటెత్తు పోకడలు పోతోందని వస్తున్న విమర్శలను ఆ కమిషన్ తనకున్న కొద్దిపాటి సమయంలో ఎటువంటి సమాధానం చెబుతుందనేది చర్చనీయాంశం అయ్యింది. కమిషన్ మీద నమ్మకంలేని పరిస్థితుల్లో ప్రజలే పెద్ద ఎత్తున కౌంటిగ్ ప్రక్రియను సజావుగా జరిపించేందుకు స్టార్ కాంపెయినర్లుగా మారిన అరుదైన సంఘటన ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

మే 13న జరిగిన ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది చోట్ల ఈవీఎంలను ధ్వంసంచేశారు. అయితే వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికలను పర్యవేక్షించిన ఎన్నికల కమిషన్ కిమ్మనకుండా ఉండటం వెనుక దాగి ఉన్న కుట్రలు ఏంటన్నది ఇప్పుడు సామాన్యుడు సంధిస్తున్న ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం లేకపోగా కేవలం మాచర్ల నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఒకే ఒక్క ఘటన... అది కూడా నిజమో కాదో ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకూ స్పష్టం చేయకుండా కాలయాపన చేస్తూ వస్తోంది. అంతేకాకుండా దీనిపై రాజకీయ రగడ మొదలవడంతో దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగిన చందంగా రెండుమూడు రోజుల క్రితం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంది.



వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించిన ఎన్నికల కమిషన్ వచ్చిన వీడియో ఎక్కడ నుండి వచ్చింది, దానికి బాధ్యులెవరు అన్నదానిని మరచి, వారిపై చర్యలు తీసుకోవడం మానేసి పోలింగ్ అధికారులను బాధ్యుల్ని చేస్తూ చర్యలకు పూనుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మిగిలిన ఎనిమిది చోట్ల జరిగిన సంఘటనలపై చర్యలు తీసుకోవడం అటుంచి విచారణ కూడా చేపట్టకపోవడంతో ప్రజల అనుమానాలు రెట్టింపయ్యాయి.

ఇదిలా ఉంటే పోస్టల్ బ్యాలెట్ల అంశం రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులను సృష్టిస్తోంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించాల్సి ఉంది. అయితే బ్యాలెట్లపై రిటర్నింగ్ అధికారి సంతకం లేకపోయినా సరే లెక్కించాలంటూ ఎన్నికల సంఘం ఆదేశించడం ఆ అనుమానాలను మరింత బలంగా నాటుకుపోయేలా చేస్తున్నాయి. దీనికితోడు ఉదయం 9 లోపు పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావాలి. అలా కాని పక్షంలో దానికి సమాంతరంగా ఈవీఎంల లెక్కింపు ప్రారంభం కావాలి. కానీ, అందుకు భిన్నంగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తయ్యాకే ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఇచ్చిన ఆదేశాలు కూడా ప్రజల్లో అనుమానాలకు దారితీస్తోంది. ఇదిలా ఉండగా కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం సడలింపులు చేయడం కమిషన్ అధికార దుర్వినియోగాన్ని సుస్పష్టం చేస్తోంది. అటెస్టింగ్ అధికారుల స్పెసిమెన్ సిగ్నేచర్ల సేకరణ ఈసీఐ నిబంధనలకు విరుద్ధంగా ఉంది. ఇది పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను తిరస్కరించేందుకు దారితీస్తుంది. దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరినా దానిమీద ఇప్పటి వరకూ స్పందన కనిపించలేదు.

అంపైర్‌గా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ అలా వ్యవహరించలేదు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు వైరస్‌తో ఎన్నికల కమిషన్ ఇన్ ఫెక్ట్ అయిందనేది ప్రజలే చెప్పే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే సందర్భంలో చంద్రబాబు గతంలో ఎన్నికల కమిషన్‌పై ఎలా దాడికి వెళ్లారో కూడా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. వైఎస్ జగన్ ఎప్పుడూ ఈసీపై చంద్రబాబులా వ్యవహరించలేదన్నది కూడా వారు సరిపోల్చుకుంటున్నారు. అధికార వ్యవస్థ, ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరించినా ఫలితాల అనంతరం వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని సామాన్య ప్రజలు ఢంకా భజాయించి చెబుతున్నారు. ఇది ఒక నిబద్ధత కలిగిన నేత పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసం అనడానికి నిదర్శనంగా మనం చెప్పుకోవచ్చు.

వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు । 98481 05455

ఆదర్శ హనుమాన్

భారత దేశంలో అత్యధిక భక్తుల చేత నిత్యం ఆరాధించబడుతున్న దైవం ఆంజనేయ స్వామి. పురాణాల్లో ఏ దేవునికీ లేని ప్రత్యేకత హనుమంతుని సొంతం. హనుమంతుడు గొప్ప వ్యాకరణశాస్త్ర పండితుడు. బాల్యంలో కఠోర దీక్షతో, శ్రద్ధగా సూర్యుని దగ్గర విద్య నేర్చుకున్నాడు. ధర్మాధర్మ విచక్షణ జ్ఞానాలు తెలిసిన వ్యక్తి. ఎదుటివారిని ఆకట్టుకునేలా ప్రసంగించే వాక్చాతుర్యం ఆయన సొంతం. ఈ అద్భుత తెలివితేటలే శ్రీరామ–సుగ్రీవ మైత్రిని కలిసేలా చేసింది. శ్రీరాముణ్ణి యజమానిగా, సుగ్రీవుణ్ణి మహారాజుగా ఇద్దరికీ సమ ప్రాధాన్యత నిచ్చాడు. లంకలో రావణునికి నీతి వచనాలతో హిత బోధ చేశాడు. మనం హనుమంతుని జీవిత చరిత్ర నుండి కమ్యూనికేషన్ స్కిల్స్, ఎదుటి వారిని మెప్పించే నైపుణ్యం, యజమాని (మనం పని చేసే డిపార్ట్‌మెంట్/కంపెనీ) పట్ల పూర్తి విధేయత, నమ్మకం, సంపూర్ణ విశ్వసనీయతతో ఎలా ఉండాలి వంటివి నేర్చుకోవచ్చు.

ఇంతేనా... ఆయన నుంచి నేర్చుకోవలసిన సుగుణాలు చాలానే ఉన్నాయి. ఎదుటివారిపట్ల సముచిత గౌరవం, నమ్మిన వారి కోసం ఏమైనా చేసే త్యాగనిరతి, శత్రువుల పట్ల సమ న్యాయబద్ధంగా వ్యవహరించే మాటతీరు, గురువు పట్ల నిస్వార్థ భక్తి భావన, రాజ్యం పట్ల సైనికుడిగా విద్యుక్త ధర్మం, నిరాడంబర జీవనం, అన్ని తెలిసినా ఇంకా తెలుసుకోవాలనే జిజ్ఞాస, ధర్మరక్షణ కోసం శ్రమించే వీరత్వం, ఆపద సమయంలో ప్రదర్శించే ఆత్మ విశ్వాసం లాంటివి ముఖ్యమైనవి.

తాను ఎంత బలవంతుడైనప్పటికీ అతి సాధారణంగా జీవించడం హనుమంతుడు మనకు నేర్పాడు. సముద్రాన్ని దాటినా, లంకను సగం కాల్చినా, సీతమ్మను తీసుకువచ్చే బలం ఉన్నా... ఎప్పుడూ పొంగిపోలేదు. సుగ్రీవుని వేలాది సైన్యంలో తానూ ఒక సైనికుడిగా రాచకార్యంలో భాగంగానే ఈ పనులు నిర్వర్తించానని భావించాడు. ఇంత చేసి అంత చెప్పుకునే చాలామందికి హనుమాన్ కనువిప్పు. ఆధునిక భావి తరానికి చక్కని మార్గదర్శి. హనుమంతుని జీవనాన్ని అధ్యయనం చేసిన వారికే ఆ గొప్పతనం తెలుస్తుంది.

– భైతి దుర్గయ్య
(నేడు హనుమాన్ జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.నవమి ఉ.6.21 వరకు, తదుపరి దశమి తె.3.50 వరకు(తెల్లవారితే ఆదివారం), **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.2.28 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.1.04 నుండి 2.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.35 నుండి 7.12 వరకు, **అమృతఘడియలు:** రా.10.01 నుండి 11.31 వరకు ; **రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం :** 5.28, **సూర్యాస్తమయం :** 6.27.

క్లుప్తంగా...

రికార్డు సృష్టించిన విశాఖ కంటైనర్ టెర్మినల్



సాక్షి, విశాఖపట్నం: మేజర్ పోర్టులతో పోటీ పడుతూ నంబర్‌వన్ గ్రీన్‌ఫీల్డ్ పోర్టుగా రూపాంతరం చెందే దిశగా అడుగులు వేస్తున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ.. సరుకు రవాణా విషయంలో ఎప్పటికప్పుడు తన రికార్డుల్ని తిరగ రాస్తోంది. పోర్టు అనుబంధ సంస్థ విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (వీసీటీపీఎల్) 2024–25లో ఆదిలోనే దూకుడు ప్రదర్శించింది. ఒకే నెలలో రికార్డు స్థాయిలో టీఈయూ (20పుట్‌ఈక్వలెంట్) కంటైనర్స్‌ని హ్యాండ్లింగ్ చేసింది. మేలో 68,812 టీఈయూ రవాణా జరిగినట్లు కంటైనర్ టెర్మినల్ అధికారులు వెల్లడించారు. గతేడాది ఆగస్టులో 67,636 టీఈయూల రికార్డుని అధిగమించినట్లు వీసీటీపీఎల్ అధికారులు పేర్కొన్నారు.

ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.1.50 కోట్ల విరాళం



తిరుమల: టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వివేక్ కైలాస్, విక్రమ్ కై లాస్ కుటుంబ సభ్యులు అక్షిత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున రూ.1.50 కోట్ల విరాళం ఇచ్చారు. విరాళం డీడీని తిరుమలలో టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దాతల సేవా దృక్పథాన్ని అభినందించారు.

తిరుపతి జిల్లాలో 57 మందిపై రౌడీషీట్లు

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడి

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా పరిధిలో అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడిన 57 మందిపై రౌడీషీట్లు తెరిచినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల అనంతరం ఇప్పటివరకు అల్లర్లు సృష్టించిన వారిని గుర్తించి రౌడీషీట్ ఓపెన్ చేశామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు వీరందరిపై ప్రత్యేకంగా నిఘా ఉంచుతామని చెప్పారు. వీరిలో టీడీపీకి చెందిన వారు 23 మంది, వైఎస్సార్‌సీపీకి చెందిన వారు 22 మంది, మరో ఇద్దరు ఏ పార్టీకి సంబంధం లేని వారని తెలిపారు. 620 మందిని బైండోవర్ చేశామని.. మరో రెండు రోజుల్లో 40 మందిని బైండోవర్ చేస్తామన్నారు. పటిష్ట భద్రత ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేలా చూస్తున్నామని తెలిపారు.

చేప ప్రసాదంగా కొల్లేరు కొర్రమీను

ఏపీ నుంచి 7 లక్షల కొర్రమీను సరఫరాకు టెండర్లు

జూన్ 8న నాంపల్లిలో బత్తిన సోదరులతో చేప ప్రసాదం పంపిణీ

ఏలూరు, పశ్చిమ గోదావరి నుంచి నలుగురు సీడ్ ఫార్మర్ల టెండర్లు

కైకలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని కొల్లేరు కొర్రమీను పిల్లలు (సీడ్) ఆస్తమా నివారణలో ఔషధంగా మారాయి. మృగశిరకార్తె రోజున హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బత్తిన సోదరులు అందించే చేప ప్రసాదానికి కొల్లేరు ప్రాంత కొర్రమీను పిల్లలను సరఫరా కానున్నాయి. తెలంగాణ స్టేట్ ఫిషరీస్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ (టీఎస్ ఎఫ్‌సీఓఎఫ్) ఆధ్వర్యంలో చేప మందు ప్రసాదం నిమిత్తం టెండర్లను ఆహ్వానించింది. దాదాపు 5 లక్షల నుంచి 7 లక్షల వరకు కొర్రమీను పిల్ల అవసరమని గుర్తించారు. తెలంగాణ మత్స్యశాఖ అధికారులు కొర్రమీను సీడ్ అందించే సీడ్ ఫామ్‌లను పరిశీలించి నివేదికను అక్కడి ప్రభుత్వానికి అందించారు.

తెలంగాణలో లభ్యత లేకపోవడంతో..

చేప ప్రసాదానికి తెలంగాణలో సరిపడినన్ని చేప పిల్లల లభ్యత లేకపోవడంతో ఏపీ నుంచి కొర్రమీను పిల్లలకు మే 21న టెండర్లు ఆహ్వానించింది. ఏపీ నుంచి కొల్లేరు ప్రాంతాలైన ఏలూరు జిల్లాలోని ముదినేపల్లి మండలం దేవపూడి ఫణిరామ్ ఫిష్ సీడ్ ఫామ్, ఏలూరుకు చెందిన దుర్గమల్లేశ్వర ఫిష్ హేచరీస్, కలిదిండి మండలం పోతుమర్రు, పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు నుంచి దుర్గ ఫిష్ సీడ్ ఫామ్‌తో పాటు తెలంగాణలోని నల్గొండ, హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు కలిపి మొత్తం ఏడుగురు టెండర్లను దాఖలు చేశారు. తెలంగాణకు చెందిన వనపర్తి, ఖమ్మం, హన్మకొండ, సంగారెడ్డిలకు చెందిన జిల్లా మత్స్యశాఖ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతను అక్కడి ప్రభుత్వం అప్పగించింది. ఖమ్మం మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయస్వామి నేతృత్వంలో అధికారులు టెండర్లు వేసిన ఏపీలో సీడ్ ఫామ్‌లను పరిశీలించి ఈ నెల 25 తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక అందించారు.

పోషకాల గని కొర్రమీను

కొర్రమీను పిల్ల చాలా హుషారుగా ఉంటుంది. ఇది మీటరు వరకు పెరుగుతుంది. మంచినీటి సరస్సులు, పొలాల బోదెలు, బురద నేలల్లో ఇవి పెరుగుతాయి. వీటిలో 18–20 శాతం మాంసకృత్తులు ఉంటాయి. ఆకు కూరల్లో లభించే విటమిన్ 'ఏ' కంటే కొర్రమీనులో ఉండే విటమిన్ 'ఏ' తేలిగ్గా జీర్ణమవుతుంది. వీటిలో గంధకం కలిగిన లైసిన్, మిథియానిక్, సిస్టిన్ అమినో యాసిడ్లు లభిస్తాయి.



కొల్లేరు ప్రాంతంలో సీడ్‌ను సంచుల్లో నింపుతున్న దృశ్యం (ఫైల్)



తెలంగాణలో చేప మందుగా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్న కొర్రమీను పిల్లలు

చేప మందుతో కొర్రమీనుకు గుర్తింపు

ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు చేప ప్రసాదాన్ని హైదరాబాద్‌లో బత్తిన సోదరులు ఉచితంగా అందిస్తారు. కరోనా కారణంగా మూడేళ్లు ఆగిన ప్రసాదం పంపిణీ ఈ ఏడాది జూన్ 8న మృగశిర కార్తె ప్రారంభమయ్యే ఉదయం 11 నుంచి 9వ తేదీ ఉదయం 11 గంటల వరకు పంపిణీ చేయనున్నారు. వీరు తయారు చేసిన ప్రత్యేక మందును కొర్రమీను పిల్ల సహా నోటిలో వేస్తారు. తెలంగాణకు సరఫరా చేసే కొర్రమీను పిల్ల సైజు 2 అంగుళాల నుంచి 3 అంగుళాలు ఉండాలి. నల్ల రంగులో హుషారుగా ఉండాలి. ప్రస్తుత మార్కెట్‌లో ఒక్కో కొర్రమీను పిల్ల రూ.30 ధర పలుకుతోంది.

పిల్ల సేకరణ ఓ సవాల్

కొర్రమీను పిల్లను సేకరించడం పెద్ద సవాల్‌గా మారుతోంది. కొల్లేరు సరస్సు, పొలాల గుంతల్లో కొర్రమీను తల్లి చేపను గుర్తిస్తారు. తల్లి వద్ద తిరిగే వేలల్లో పిల్లలను సేకరించి సిమెంటుతో చేసిన కుండీలలో ప్రత్యేకంగా పెంచుతారు. రోజుకు మూడు పూటలా నీరు మారుస్తారు. నాలుగు పూటలా మేత వేస్తారు. తెలంగాణ వరకు వ్యాన్‌లలో అత్యంత జాగ్రత్తగా వీటిని రవాణా చేస్తారు. కొల్లేరు ప్రాంతాల నుంచి వెళ్లే వ్యాన్‌లలో పిల్లలకు మూడు ప్రాంతాల్లో నీటిని మార్పు చేస్తారు. చేప మందు ప్రసాదం నిమిత్తం జూన్ 6వ తేదీన ఉదయం హైదరాబాద్‌కు కొల్లేరు కొర్రమీను పిల్లల్ని తరలించనున్నారు.

కొల్లేరు ప్రాంతం అనుకూలం



చిత్తడి నేలల ప్రాంతమైన కొల్లేరు సరస్సులో సహజసిద్ధంగా కొర్రమీను పెరుగుతుంది. నల్లజాతి చేపల్లో కొర్రమీనుకు ప్రత్యేక స్థానం ఉంది. కొల్లేరు పరీవాహక ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాలకు వీటిని సరఫరా చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో కొర్రమీను సాగు సైతం చేస్తున్నారు. కొర్రమీనులో పోషకాహారాలు అధికంగా ఉంటాయి. – షేక్ చాన్‌బాషా, ఫిషరీస్ ఏడీ, కైకలూరు

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి అమిత్ షా



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ శుక్రవారం దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో రాష్ట్ర మంత్రి కొట్టు సత్యనారాయణ, తమిళనాడు సీఎస్ శివ దాస్ మీనా, మహారాష్ట్ర ఎంపీ సుధీర్ మునగంటివారి, వేలూరు ఎంపీ షణ్ముగం, తమిళనాడు ఎమ్మెల్యే నైనారు నాగేంద్ర, తమిళనాడు మాజీ మంత్రి చంద్ర ప్రేమగా, సినీ దర్శకుడు ఓదెల శ్రీకాంత్, సినీనటి డింపుల్ హయాతి ఉన్నారు.



తిరుమల ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్

జూడోకు రాష్ట్రస్థాయిలో మూడు శిక్షణ కేంద్రాలు

2032 నాటికి బంగారు పతకాలే లక్ష్యం • ఏపీ జూడో అసోసియేషన్ చైర్మన్ నాగూరయ్య

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉన్న జూడో ఆటకు రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి పట్టణాల్లో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ నూతన చైర్మన్, ట్రినిటీ ఆసుపత్రి అధినేత నాగూరయ్య తెలిపారు. నూతన చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం శుక్రవారం నాయుడుపేటలోని ట్రినిటీ ఆసుపత్రి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జూడోలో 2032 నాటికి ఏపీ నుంచి బంగారు పతకాల సాధనే లక్ష్యమని తెలిపారు. ఈ క్రీడపై ప్రజలకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. తనను చైర్మన్ చేసినందుకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న గ్లోబల్ బ్రాడ్‌కాస్టింగ్ మీడియా హౌస్ (జీబీసీ)కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో జీబీసీ మీడియా హౌస్ సహకారంతో ఈ క్రీడను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న నాగూరయ్య

రూ.200 కోట్లతో ఓజిలి మండలం, పెద్దపెరియ వద్ద ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ క్రీడపై జూన్ 2న సాయంత్రం 4 గంటలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఫెలిసిటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జూడో అసోసియేషన్ సభ్యులు రాయపు రమేష్‌నాయుడు, డాక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో అప్రైజర్ అరెస్ట్

కాణిపాకం(చిత్తూరు జిల్లా): కాణిపాకంలో ఆభరణాలు అపహరించిన ఓ బ్యాంకు అప్రైజర్‌ను శుక్రవారం సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్‌ఐ రామమోహన్ అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కాణిపాకం ఆలయ హుండీని గురువారం ఉదయం లెక్కించారు. ఈ సమయంలో అక్కడున్న ఓ బ్యాంకు అప్రైజర్ ప్రకాశ్ 100 గ్రాముల బంగారు బిస్కెట్, 1.5 గ్రాముల ఉంగరం, రూ.500 నగదును దొంగిలించాడు. దీన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆలయ అధికారులు ప్రకాశ్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఏఈఓ మాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాణిపాకం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ వ్యక్తిని అరెస్ట్ చూపించి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో సత్తాచాటిన డాక్టర్ వినీత



లబ్బీపేట(విజయవాడ తూర్పు): సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశానికి ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్షలో తెలుగు వైద్యురాలు డాక్టర్ కన్నెగంటి వినీత సత్తా చాటారు. ఐఎన్‌ఐఎస్ఎస్ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో డీఎం ఇన్ క్లినికల్ ఇమ్యునాలజీ, రుమటాలజీ విభాగంలో డాక్టర్ వినీత జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. గుంటూరుకు చెందిన డాక్టర్ కన్నెగంటి వినీత భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేయగా, చండీఘర్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో ఎండీ జనరల్ మెడిసిన్ చేశారు. ఆమె తండ్రి కె.వెంకటేశ్వరరావు ఓ ప్రైవేటు కళాశాలలో ప్రిన్సిపాల్‌గా, తల్లి మాధవీలతె ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో సత్తాచాటిన డాక్టర్ వినీతకు మాజీ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్, ప్రముఖ గుండె సర్జన్ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే, మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

వేడికి 'కోడి' విలవిల!

మండుతున్న ఎండలకు పౌల్ట్రీ పరిశ్రమ బెంబేలు

- వేడిగాలులకు కళ్లు తేలేస్తున్న కోళ్లు
- లక్ష కోళ్లు ఉన్న పౌల్ట్రీలో రోజుకు 500 వరకు మృత్యువాత
- 15 శాతం మేర తగ్గిన గుడ్ల ఉత్పత్తి
- గత మూడు రోజుల్లో పౌల్ట్రీకి రూ.కోట్లలో నష్టం



సాక్షి, భీమవరం: మండుతున్న ఎండలు పౌల్ట్రీ పరిశ్రమకు గుబులు పుట్టిస్తున్నాయి. వేడిగాలులకు తాళలేక ఫారాల వద్ద వందల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడం కోళ్ల రైతులను కలవరపరుస్తోంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోట్లలో నష్టం వాటిల్లి పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతోందని పౌల్ట్రీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. కోస్తాలోని ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గుడ్లు పెట్టే లేయర్ కోళ్లు నాలుగు కోట్ల వరకు ఉండగా, ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, రాయలసీమలోని చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో కోటి వరకూ ఉన్నాయి. గుడ్లు పెట్టే దశకు చేరువలోని బ్రోయిర్, చిక్స్ మూడు కోట్ల వరకు ఉంటాయి. లక్ష కోళ్లు ఉన్న పౌల్ట్రీలో సాధారణంగా రోజుకు 60 నుంచి 80 కోళ్లు వరకు చనిపోతుంటాయి. ప్రస్తుతం ఈ మరణాల సంఖ్య 450 నుంచి 500 వరకు చేరింది. ఆరోగ్యంగా ఉన్న కోళ్లు 40 డిగ్రీల ఉష్ణోగ్రత వరకూ తట్టుకుంటాయి. గత మూడు రోజులుగా 40 డిగ్రీలకు పైబడి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, వేడిగాలుల ప్రభావంతో ముందెన్నడూ లేనంతగా ఈ ఏడాది కోళ్ల మరణాలు పెరిగాయి. కోస్తా ప్రాంతంలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉందంటున్నారు. ఒక కోడి చనిపోవడం వల్ల రూ.250 వరకు నష్టం వాటిల్లుతుంది.. ఈ మేరకు గత మూడు రోజుల్లో రోజుకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల కోళ్లు చనిపోగా పరిశ్రమకు రూ.30 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు అంచనా.

పడిపోయిన గుడ్ల ఉత్పత్తి

ఎండల తీవ్రత వల్ల గుడ్ల ఉత్పత్తి 15 శాతం మేర తగ్గింది. సాధారణ పరిస్థితుల్లో రాష్ట్రంలో రోజుకు 4.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతుండగా వడగాలుల తీవ్రతకు ఆ ఉత్పత్తి 3.49 కోట్లకు తగ్గిపోయింది. డ్రాపింగ్ కారణంగా రోజుకు 61.5 లక్షల గుడ్లను రైతులు కోల్పోవాల్సి వస్తోంది. ప్రస్తుతం గుడ్డు రైతు ధర రూ.4.85 ఉండగా.. రోజుకు రూ.2.98 కోట్ల చొప్పున మూడు రోజుల్లో రూ.8.95 కోట్ల మేర నష్టం వాటిల్లిందని పౌల్ట్రీ వర్గాలంటున్నాయి. అధిక ఉష్ణోగ్రతల నుంచి కోళ్లకు ఉపశమన చర్యలతో ఖర్చులు పెరిగిపోయాయి. వడదెబ్బకు గురికాకుండా కోళ్లకు ప్రత్యేక మందులివ్వడం, ఫారాల్లో వాతావరణాన్ని చల్లబర్చేందుకు చుట్టూ గోనె సంచులు కట్టి వాటికి వాటరింగ్ చేయడం, స్ప్రింక్లర్ల ఏర్పాటు తదితర జాగ్రత్తలకు తోడు.. పెరిగిన మేత ధరలు, కూలి రేట్లతో నిర్వహణ భారం మారిందని కోళ్ల రైతులంటున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్డు సరఫరా లేక స్థానిక వినియోగం తగ్గి గుడ్డుకు రైతు ధర పతనమవుతోందని చెబుతున్నారు.



దాహార్తి తీర్చుకునేందుకు నీరు తాగుతున్న కోడి

ప్రభుత్వం ఆదుకోవాలి..




ఎప్పుడూ లేనంతగా ఈసారి ఎండల తీవ్రతకు కోళ్ల మరణాలు ఎక్కువగా ఉన్నాయి. గుడ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. ప్రభుత్వం ఆదుకోకుంటే కోళ్ల పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుంది. ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయిస్ గోదాముల్లోని మనుషులు తినడానికి పనికిరాకుండా నిల్వ ఉన్న గోధుమలు, మొక్కజొన్న, నూకలను తక్కువ ధరపై కోళ్ల రైతులకు ప్రభుత్వం అందజేయాలి.

– పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఫరీద్‌కోట్...బహుముఖ పోటీ

- ప్రధాన అభ్యర్థులకు రైతుల నుంచి సెగ
- బరిలో ఇందిరా హంతకుని కుమారుడు





• హన్స్‌రాజ్ హన్స్



• సరబ్‌జీత్ సింగ్ ఖల్సా

సాక్షి, న్యూఢిల్లీ: పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ లోక్‌సభ స్థానంలో బహుముఖ పోటీ నెలకొంది. బీజేపీ నుంచి ప్రముఖ గాయకుడు హన్స్‌రాజ్ హన్స్, ఆప్ నుంచి నటగాయకుడు కరంజీత్ అన్మోల్ బరిలో ఉన్నారు. అకాలీదళ్, కాంగ్రెస్‌లకు తోడు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హంతకుల్లో ఒకరైన బియాంత్‌సింగ్ కుమారుడు సరబ్‌జీత్ సింగ్ ఖల్సా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి గట్టి పోటీయే ఇస్తున్నారు. దాంతో శనివారం చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరిగే స్థానాల్లో ఫరీద్‌కోట్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

కాంగ్రెస్‌కు కష్టాలు..

ఫరీద్‌కోట్ కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం. పంజాబీ జానపద గాయకుడు మహ్మద్ సాదిక్ 2019లో గెలుపొందారు. ఈసారి ఆయన్ను కాదని అమర్‌జీత్ కౌర్ సాహోక్‌కు టికెటిచ్చింది. స్థానికురాలైన సాహోక్ దాన్నే ప్రధాన బలంగా మార్చుకుని ప్రచారం చేశారు. కానీ పార్టీలోనే తీవ్రమైన వ్యతిరేకత ఉండటం ఆమెకు మైనస్‌గా మారింది. సీనియర్ నేతలు ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉన్నారు. దాంతో సాహోక్‌కు మద్దతుగా కాంగ్రెస్ ఒక్క పెద్ద ర్యాలీ కూడా నిర్వహించలేకపోయింది! ఆప్ అభ్యర్థి అన్మోల్ సీఎం భగవంత్ మాన్‌కు సన్నిహితుడు. తన స్టార్‌డమ్, మాన్ ప్రభుత్వ పనితీరు తనను గెలిపిస్తాయనే ధీమాతో ఉన్నారు. పంజాబీ నటులు, గాయకులు అన్మోల్‌కు మద్దతుగా జోరుగా ప్రచారం చేశారు. ఇక 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ విజయానికి కారణమైన సిక్కు సంస్థలు ఈసారి ఇండిపెండెంట్ సరబ్‌జీత్ సింగ్ ఖల్సాకు దన్నుగా నిలిచాయి.

సూఫీల ఇలాకా...

రాజ నగరంగా ప్రసిద్ధి చెందిన ఫరీద్‌కోట్ సూఫీ సాధువుల అడ్డా. బాబా ఫరీద్ నగరం అని కూడా అంటారు. ఈ లోక్‌సభ స్థానం 1977లో ఏర్పాటైంది. ఒకప్పుడు అకాలీదళ్‌కి కంచుకోట. 2014లో ఆప్, 2019 కాంగ్రెస్ గెలిచాయి. దీని పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ సీట్లూ ఆప్ చేతిలోనే ఉండటం ఆ పార్టీకి కాస్త కలిసొచ్చే అంశం. ఒక్క అభ్యర్థి కూడా నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడలేదన్నది స్థానికుల ఆరోపణ. డ్రగ్స్, అభివృద్ధి లేమి ఇక్కడి ప్రధాన సమస్యలు. దీనికి తోడు రైతు ఆందోళనల ప్రకంపనలు ఈసారి అందరు అభ్యర్థులనూ తాకాయి!

బీజేపీకి చుక్కలు...

గత ఎన్నికల్లో ఢిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన బీజేపీ అభ్యర్థి హన్స్‌రాజ్ హన్స్ ఫరీద్‌కోట్కు పూర్తిగా కొత్త. ప్రచారం పొడవునా రైతు సంఘాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొన్నారు. దానికి తోడు రైతులకు వ్యతిరేకంగా ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు బీజేపీని మరింత ఇరుకున పెట్టాయి. ప్రచారంలో పాటలు పాడుతూ ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అకాలీదళ్ కూడా ఈసారి ఎలాగైనా నెగ్గాలని పట్టుదలగా ఉంది. ఆ పార్టీ అభ్యర్థి రాజ్విందర్ సింగ్ మాజీ ఎమ్మెల్యే శీతల్ సింగ్ కుమారుడు, మాజీ మంత్రి గురుదేవ్ బాదల్ మనవడు. 2015లో ఆప్‌లో చేరిన ఆయన 2017 అసెంబ్లీ ఎన్నికల ముందు మళ్లీ అకాలీదళ్‌కు తిరిగొచ్చారు. తన కుటుంబ రాజకీయ వారసత్వాన్నే నమ్ముకున్నారు. ఫరీద్‌కోట్‌కు తన కుటుంబం ఎంతో సేవ చేసిందంటూ ప్రచారం చేశారు. దళిత ప్రాబల్యమున్న ఫరీద్‌కోట్‌లో బీఎస్పీ పోటీ ప్రధాన పార్టీల అవకాశాలను దెబ్బ తీసేలా ఉంది.

నేటి నుంచి తిరుమలలో హనుమజ్జయంతి ఉత్సవాలు





తిరుమల: తిరుమలలోని అంజనాద్రి ఆకాశ గంగ ఆలయం, జపాలి తీర్థంలో శనివారం నుంచి 5వ తేదీ వరకు హనుమాన్ జయంతి నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఆకాశ గంగలోని శ్రీఅంజనాదేవి– శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయంలో 1న మల్లెపూలు, 2న తమలపాకులు, 3న ఎర్ర గన్నేరు, కనకాంబరం, 4న చామంతి, 5న సింధూరంతో అభిషేకాలు చేయనున్నారు. అలాగే జపాలిలో ప్రతిరోజూ మధ్యాహ్నం దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. 1న హరికథ, 2న అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల సంకీర్తనలు, 3న పురంధరదాస సంకీర్తనలు, 4న హిందూధర్మ ప్రచార పరిషత్ వారి భజన, 5న అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల హరికథ గానం ఉంటుంది. రోజూ సాయంత్రం వేళ ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులచే నృత్య కార్యక్రమాలు ఉంటాయి. అదే విధంగా నాద నీరాజనం వేదికపై ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య శ్రీ హనుమాన్ జననం, శ్రీ హనుమంతుని సంబంధించిన ఇతర ఆసక్తికరమైన అంశాలపై ప్రముఖ వేద పండితులచే ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు.

మోదీవి పగటి కలలు

- ఎన్‌డీఏ నుంచి బాబు బయటకు రావడం ఖాయం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి (కల్చరల్): దేశవ్యాప్తంగా 400 స్థానాల్లో గెలుస్తామంటున్న నరేంద్రమోదీ పగటి కలలు కంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అన్నారు. మోదీ అధికారం కోల్పోతే ఎన్‌డీఏ నుంచి మొదట బయటకు వచ్చే వ్యక్తి టీడీపీ అధినేత చంద్రబాబు అని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి సీపీఐ అభ్యర్థి మురళి తరఫున ప్రచారం చేసిన వారికి అభినందనలు తెలిపేందుకు గంధమనేని శివయ్య భవన్‌లో శుక్రవారం సభ నిర్వహించారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో మోదీ కన్యాకుమారికి వెళ్లి ధ్యానం చేస్తున్నారని, నాడు వివేకానందుడు చేసిన ధ్యానానికి, నేడు మోదీ చేసే ధ్యానానికి చాలా తేడా ఉందన్నారు. దేశంలో పాలనను గాలికి వదిలేసి మోదీ తిరుగుతున్నాడన్నారు.



మోదీ ధ్యాన ముద్ర

సాక్షి, చెన్నై: కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌లో ధ్యానం చేస్తున్న ప్రధాని మోదీ శుక్రవారం సూర్యోదయ వేళ సూర్యునికి అర్ఘ్యం సమర్పించారు. కాషాయ వస్త్రాలను ధరించిన ప్రధాని మోదీ జపమాల చేబూని, కమండలంలోని జలాన్ని సముద్రంలోకి వదులుతూ ప్రార్థన చేశారు. అనంతరం సర్వశక్తిమంతుడైన ఆ సూర్యభగవానునికి ముకుళిత హస్తాలతో నమస్కరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను, సంక్షిప్త వీడియోను బీజేపీ 'ఎక్స్'లో షేర్ చేసింది. ధ్యాన మంటపంలో ప్రధాని ధ్యానంలో ఉన్న ఫొటోలను, జపమాలతో ధ్యాన మంటపం చుట్టూ ఆయన ప్రదక్షిణలు చేస్తున్న ఫొటోలను కూడా బీజేపీ విడుదల చేసింది. మే 30వ తేదీ సాయంత్రం మొదలైన మోదీ ధ్యానం జూన్ ఒకటో తేదీ సాయంత్రంతో ముగియాల్సి ఉంది. అయితే, ప్రధాని మోదీ పర్యటన కారణంగా వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద పర్యాటకులు ఇబ్బందులు పడ్డారని తమిళనాడు మంత్రి దురైమురుగన్ ఆరోపించారు. ఆ పరిసర ప్రాంతాల్లోకి ప్రజలతోపాటు ఓడలు, విమానాలను కూడా అనుమతించలేదని చెప్పారు. 'ఎన్ని భంగిమలు! ఎంతమంది ఫొటోగ్రాఫర్లు! స్వామి వివేకానంద మౌనంగా ఉన్నారు'అంటూ తమిళనాడు కాంగ్రెస్ ప్రధాని మోదీ ధ్యానంపై వ్యాఖ్యానించింది.

అమెరికా స్పెల్ బీ విజేత బృహత్ సోమ

బృహత్ తండ్రి శ్రీనివాస్ సోమ నల్లగొండ వాసి

ఫ్లోరిడాలో స్థిరపడిన శ్రీనివాస్ కుటుంబం

వాషింగ్టన్: అమెరికా స్పెల్లింగ్ పోటీలో తెలుగు సంతతి విద్యార్థి గెలుపొందారు. ఏడో గ్రేడ్ చదువుతున్న 12 ఏళ్ల బృహత్ సోమ.. ప్రతిష్టాత్మక స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ–2024లో విజేతగా నిలిచాడు. 90 సెకన్లలో 29 పదాలకు సరైన సమాధానం ఇచ్చి బహుమతిగా 50వేల డాలర్లు అంటే దాదాపు రూ.41.64లక్షలు గెలుచుకున్నాడు. వాషింగ్టన్‌లో మూడు రోజుల పాటు జాతీయ స్పెల్‌బీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. 50 రాష్ట్రాల నుంచి 245 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. 14 రౌండ్ల తర్వాత గురువారం జరిగిన ఫైనల్‌కు 8 మంది చేరుకున్నారు. ఫైనల్‌లో మొదట 30 పదాలకు 29కి సరైన సమాధానం చెప్పిన బృహత్ టై బ్రేకర్‌గా నిలిచాడు. 25 పదాల్లో 21 పదాలకు సరైన సమాధానం ఇచ్చిన ఫైజన్ జాకీ మిగిలిన ఆరుగురిని అధిగమించాడు. లైటెనింగ్ రౌండ్‌లో బృహత్‌తో పోటీ పడలేకపోయాడు. 90 సెకన్లలో 30 పదాల్లో 29 పదాలకు స్పెల్లింగ్‌ను కరెక్టుగా చెప్పి బృహత్ రికార్డు నెలకొల్పాడు. అబ్సీల్ అనే పదం బృహత్‌కు చాంపియన్‌షిప్‌ను అందించింది. 90 సెకన్లలో 20 పదాలకు మాత్రమే సరైన సమాధానం ఇచ్చిన ఫైజన్ రెండో స్థానంలో నిలిచాడు. 25వేల డాలర్లను గెలుచుకున్నాడు. ఇక కాలిఫోర్నియాకు చెందిన శ్రేయ్ పారిఖ్, నార్త్ కరోలినాలోని అపెక్స్‌కు చెందిన అనన్య ప్రసన్న మూడో స్థానంలో నిలిచారు. చెరో 12,500 డాలర్లను బహుమతిగా అందుకున్నారు. ఫైనల్‌కు చేరిన ఎనిమిది మంది విద్యార్థుల్లో ఐదుగురు భారతీయ సంతతికి చెందినవారు. కాలిఫోర్నియాకు చెందిన 14 ఏళ్ల రిషబ్ సాహా, కొలరాడోకు చెందిన 13 ఏళ్ల అదితి ముత్తుకుమార్ కూడా ఫైనల్‌కు చేరినవారిలో ఉన్నారు.

అమోఘమైన జ్ఞాపకశక్తి..

బృహత్ తండ్రి శ్రీనివాస్ సోమ నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తి. ఫ్లోరిడాలో స్థిరపడ్డారు. బృహత్‌కు జ్ఞాపకశక్తి ఎక్కువని, భగవద్గీతలో 80 శాతం కంఠతా వస్తుందని అతని తల్లిదండ్రులు తెలిపారు. ''గెలిచానని ప్రకటించగానే కొన్ని క్షణాలపాటు నమ్మలేకపోయాను. నా గుండె వేగం పెరిగింది. ఆ తరువాత గొప్ప అనుభూతినిచ్చింది'' అని బృహత్ వెల్లడించాడు. కేవలం 12 ఏళ్ల వయసులో బృహత్ తన ప్రశాంతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడని స్క్రిప్స్ నిర్వాహకులు తెలిపారు. బృహత్‌కు గొప్ప జ్ఞాపకశక్తి ఉందని, అన్ని రౌండ్లలో ఏ ఒక్క పదాన్ని కోల్పోకుండా సమాధానం చెప్పి పదాలను శాసించాడని కొనియాడారు. గతంలోనూ స్పెల్ బీలో పాల్గొన్న బృహత్ 2023లో 74వ స్థానంలో, 2022లో 163 స్థానంలో నిలిచారు. వివిధ అంశాల్లో ఆసక్తి, అభిరుచి ఉన్న బృహత్ అంతకుముందు వర్డ్స్ ఆఫ్ విస్డమ్ బీ, స్పెల్ పండిట్ బీలను కూడా గెలుచుకున్నాడు.



తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి స్పెల్ బీ ట్రోఫీతో బృహత్ సోమ

భారత సంతతి విద్యార్థుల హవా...

కాగా, స్పెల్ బీలో భారత సంతతి విద్యార్థుల హవా కొనసాగుతోంది. గత ఏడాది స్పెల్ బీని సైతం భారత సంతతికి చెందిన విద్యార్థి దేవ్ షా గెలుచుకున్నాడు. 2022లో హరిణి లోగాన్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. దేశంలోనే అతిపెద్ద, ఎక్కువ రోజులు జరిగే కార్యక్రమం అయిన స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీని 1925లో ప్రారంభించారు. 1999 నుంచి ఇప్పటివరకు ఇరవై తొమ్మిది మంది భారతీయ సంతతికి చెందిన విద్యార్థులే చాంపియన్లుగా నిలిచారు.

నేడు ఎగ్జిట్‌పోల్స్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ తుది దశ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ శనివారంతో ముగియనుండటంతో అందరి దృష్టి ఎగ్జిట్ పోల్స్‌పై పడింది. శనివారం చివరి దశలో ఎన్నికలు జరుగుతున్న 57 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే పోలింగ్ ఏజెన్సీలు, న్యూస్ ఛానెళ్లు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయనున్నాయి. జూన్ ఒకటి సాయంత్రం 6 గంటల వరకు ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రచురించకుండా న్యూస్ ఛానెల్‌లను ఎన్నికల సంఘం నిషేధించిన నేపథ్యంలో సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయి. దేశంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏ కూటమి ఏర్పాటు చేస్తుందన్న దానిపై అంచనాలను వెల్లడించనున్నాయి. రాజకీయ పండితులు బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) విజయం సాధిస్తుందని అంచనా వేస్తుండగా, ఇండియా కూటమి చివరివరకు గట్టిగా పోరాడటంతో ఎగ్జిట్ పోల్స్‌పై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో బీజేపీ సొంతంగా 303 స్థానాలు, ఎన్డీఏ కూటమితో కలిసి 352 స్థానాలు గెలుచుకున్నాయి.





హిమాచల్ ప్రదేశ్‌లోని తషిగంగ్ గ్రామంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ ఇది • ఈ పోలింగ్ స్టేషన్ వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నేడే తుదిపోరు

చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లోని 57 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్

ఒడిశాలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు సైతం పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగింపు దశకు చేరింది. ఎన్నికల్లో భాగంగా ఆఖరి విడత పోలింగ్ శనివారం జరుగనుంది. కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌పాటు బిహార్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 57 లోక్‌సభ స్థానాలకు ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుంది. వీటితో పాటు ఒడిశా శాసనసభ ఎన్నికల్లో మిగిలిన 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు సైతం పోలింగ్ నిర్వహిస్తారు. అంతేకాకుండా బిహార్ ఒకటి, ఉత్తరప్రదేశ్‌లో ఒకటి, పశ్చిమబెంగాల్‌లో ఒకటి, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా ఉపఎన్నిక జరుగనుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆఖరి దశలో పోలింగ్ జరిగే స్థానాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, అభిషేక్ బెనర్జీ, మీసా భారతి, కంగనా రనౌత్ వంటి ప్రముఖులు బరిలో నిలిచారు. చివరి విడతలోని 57 లోక్‌సభ స్థానాల్లో 2019 ఎన్నికల్లో ఎన్డీఏ 32, యూపీఏ 9 సీట్లు దక్కించుకున్నాయి. మిగతా స్థానాలను ఇతర పార్టీలు గెలుచుకున్నాయి. అంటే సగానికి పైగా ఎన్డీయే సిట్టింగ్ స్థానాలు ఉన్నాయి. ఏప్రిల్ 19న ప్రారంభమైన సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటిదాకా జరిగిన ఆరు దశల్లో 486 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. కాగా మొత్తం ఏడు దశల్లోని 543 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలు, 13 రాష్ట్రాల్లోని 26 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ప్రారంభంకానుంది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జూన్ 2న ప్రారంభమవుతుంది.

పోలింగ్ జరిగే లోక్‌సభ స్థానాలు

రాష్ట్రం	స్థానాలు
పంజాబ్	13
ఉత్తరప్రదేశ్	13
పశ్చిమ బెంగాల్	9
బిహార్	8
ఒడిశా	6
హిమాచల్‌ప్రదేశ్	4
జార్ఖండ్	3
చండీగఢ్	1

మొత్తం స్థానాలు 57

జనరల్ 41
ఎస్టీ 03
ఎస్సీ 13



మొత్తం ఓటర్లు	10.06 కోట్లు
పురుషులు	5.24 కోట్లు
మహిళలు	4.82 కోట్లు

ఇప్పటిదాకా 6 దశల్లో నమోదైన పోలింగ్

దశ	లోక్‌సభ స్థానాలు	పోలింగ్ శాతం
1	102	66.14
2	88	66.71
3	93	65.68
4	96	69.16
5	49	62.2
6	58	63.36



ఏమిటీ కేసు?

శృంగార తార స్టార్మీ డేనియల్‌తో ట్రంప్ సన్నిహితంగా గడిపినట్లు వార్తలొచ్చాయి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఆమె నోరు విప్పితే తనకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండడంతో ట్రంప్ అడ్డదారి ఎంచుకున్నారు. ఆమె నోరు మూయించేందుకు 1.30 లక్షల డాలర్లు తన లాయర్ ద్వారా చెల్లించారు. ఎన్నికల ప్రచారం కోసం పార్టీకి అందిన విరాళాల నుంచే ఈ సొమ్మును స్టార్మీ డేనియల్‌కు చేరవేశారు. అక్రమ చెల్లింపులను కప్పిపుచ్చడానికి బిజినెస్ రికార్డులను తారుమారు చేశారు. ఈ వ్యవహారమంతా బహిర్గతం కావడంతో అమెరికాలో గగ్గోలు మొదలైంది. ట్రంప్‌పై విచారణ అధికారులు 34 అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసులో న్యూయార్క్ కోర్టులో సుదీర్ఘంగా విచారణ జరిగింది. 22 మంది సాక్షులను న్యాయస్థానం ప్రశ్నించింది. ఎన్నికల చట్టాన్ని ట్రంప్ ఉల్లంఘించారని, పోర్న్ స్టార్‌కు చెల్లించిన సొమ్మును కోర్టు ఖర్చుల కింద చూపించారని ప్రాసిక్యూటర్లు వాదించారు. ట్రంప్ తనతో ఏకాంతంగా గడిపిన మాట నిజమేనని స్టార్మీ డేనియల్ కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో అంగీకరించారు. గురువారం 12 మంది న్యాయమూర్తుల ప్యానెల్ చరిత్రాత్మక తీర్పు వెలువరించింది.

డొనాల్డ్ ట్రంప్ దోషి

హష్ మనీ కేసులో న్యూయార్క్ కోర్టు తీర్పు

- ట్రంప్‌పై 34 అభియోగాలు రుజువయ్యాయని వెల్లడి
- జూలై 11న శిక్ష ఖరారు చేయనున్న న్యాయస్థానం
- జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం
- అవినీతికి పాల్పడి తప్పుడు తీర్పు ఇచ్చారని ట్రంప్ ఆగ్రహం
- ఒక కేసులో దోషిగా తేలిన అమెరికా తొలి మాజీ అధ్యక్షుడిగా రికార్డుకెక్కిన ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్: ఒక కేసులో దోషిగా తేలిన అమెరికా తొలి మాజీ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్(77) అప్రతిష్ట మూటగట్టుకున్నారు. పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు 1.30 లక్షల డాలర్లు అక్రమంగా చెల్లించి, బిజినెస్ రికార్డులు తారుమారు చేసిన కేసులో న్యూయార్క్ కోర్టు ఆయనను దోషిగా తేల్చింది. ట్రంప్‌పై నమోదైన 34 తీవ్ర అభియోగాలన్నీ రుజువయ్యాయని వెల్లడించింది. జూలై 11న న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వడంతోపాటు శిక్ష ఖరారు చేయనుంది. ఈ వ్యవహారంలో ట్రంప్‌కు జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. శిక్ష పడినప్పటికీ.. మరో ఆరు నెలల్లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా ట్రంప్ పోటీ చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు కాబోవని అంచనా వేస్తున్నారు. న్యూయార్క్ కోర్టు తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. కోర్టు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ఓ న్యాయమూర్తి అవినీతికి పాల్పడి తప్పుడు తీర్పు ఇచ్చారని విమర్శించారు. ఇక్కడేం జరిగిందో ప్రజలకు తెలుసని చెప్పారు. అసలైన తీర్పును నవంబర్ 5న అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా ప్రజలు ఇవ్వబోతున్నారని స్పష్టం చేశారు. తాను నిజాయతీపరుడినని, ఎలాంటి తప్పూ చేయలేదని పేర్కొన్నారు. అమెరికా కోసం, అమెరికా రాజ్యాంగం కోసం పోరాటం కొనసాగిస్తానని వెల్లడించారు. ఈ పోరాటంలో అంతిమ విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు.

హష్ మనీ కేసులో దోషిగా తేలిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ నిబ్బరంగానే కనిపించారు. కోర్టులో నిశ్శబ్దంగా ఉండిపోయారు. తుది తీర్పు వచ్చేదాకా బెయిల్‌పై బయటే ఉంటారు. జూలై 11న శిక్ష ఖరారు కానుంది. నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ అభ్యర్థిత్వం ఇప్పటికే ఖరారైంది. జూలై 15న మిల్వాకీలో రిపబ్లికన్ జాతీయ సదస్సులో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించబోతున్నారు. అంతా అనుకున్నట్లు జరిగితే అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్(81)తో డొనాల్డ్ ట్రంప్ తలపడతారు. కోర్టు తీర్పుపై బైడెన్–కమలా హారిస్ ప్రచార విభాగం ప్రతినిధి, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ మైఖేల్ టైలర్ హర్షం వ్యక్తం చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని న్యూయార్క్ కోర్టు తేల్చిచెప్పిందని అన్నారు

> రాజకీయ దురుద్దేశాలతోనే నాకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. ఇది హష్‌మనీ వ్యవహారం కాదు. ఇది బహిర్గతం చేయకూడదనే ఒక ఒప్పందం మాత్రమే. పూర్తిగా చట్టబద్ధంగానే జరిగింది. ఇలాంటివి అమెరికాలో సర్వసాధారణమే. ప్రత్యర్థులు నన్ను ఇలా ఇరికించారంటే వారు ఇక ఎవరినైనా ఇరికించగలరు. నాపై తప్పుడు కేసు పెట్టి, ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారు. వారి ఆటలు సాగవు
>
> – డొనాల్డ్ ట్రంప్

ఎన్నికల్లో ట్రంప్ పోటీ చేయొచ్చా?

న్యూయార్క్ కోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి ట్రంప్ భవితవ్యంపై పడింది. కోర్టు ఆయనకు జైలు శిక్ష గానీ, జరిమానా గానీ విధిస్తే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తారా? చట్టపరంగా అది సాధ్యమేనా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అమెరికా రాజ్యాంగం ప్రకారం చూస్తే నేరస్థులు ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకొనే నిబంధన ఏదీ లేదని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ రిచర్డ్ ఎల్.హసెన్ చెప్పారు. చట్టపరంగా ఇప్పుడు ట్రంప్ అభ్యర్థిత్వానికి వచ్చే ముప్పేమీ లేదని అన్నారు.

కారాగారమా? గృహ నిర్బంధమా?

- ట్రంప్‌పై 34 అభియోగాలు రుజువయ్యాయి. ఒక్కో అభియోగానికి గరిష్టంగా నాలుగేళ్ల చొప్పున జైలుశిక్ష, 5 వేల డాలర్ల దాకా జరిమానా విధించే అవకాశం ఉంది.
- జైలు శిక్ష కాకుండా జరిమానా, ప్రొబేషన్/సామాజిక సేవను శిక్షగా విధించవచ్చు. ప్రొబేషన్ శిక్ష విధిస్తే ప్రొబేషన్ అధికారి ఎదుట ట్రంప్ తరచుగా హాజరు కావాల్సి ఉంటుంది. కండీషనల్ డిశ్చార్జి అనే శిక్ష వేస్తే ప్రొబేషన్ అధికారి ఎదుట హాజరు కావాల్సిన అవసరం ఉండదు.
- గృహ నిర్బంధం విధించే అవకాశం సైతం లేకపోలేదు. అప్పుడు ట్రంప్ తన ఇంటికే పరిమితం కావాల్సి ఉంటుంది. ఆయన చుట్టూ ఎలక్ట్రానిక్ నిఘా పెడతారు. హౌజ్ అరెస్టు అయితే ట్రంప్ నాలుగు గోడల మధ్య నుంచే ఎన్నికల ప్రచారం చేయాలి.
- ట్రంప్ జైలుకెళ్తారా? అంటే కచ్చితంగా చెప్పలేమని న్యాయ నిపుణులు అంటున్నారు. రాబోయే అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కోర్టు ఆయనకు జైలుశిక్ష విధించకుండా కేవలం జరిమానాతో సరిపెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

ఆదివారం లొంగిపోతా!

- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటన
- తన తల్లిదండ్రుల ఆరోగ్యం కోసం ప్రార్థించాలంటూ ప్రజలకు వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్‌పై తిహార్ జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం (జూన్ 2న) తిరిగి లొంగిపోనున్నారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేజ్రీవాల్ ఉద్వేగంతో మాట్లాడారు. ఈసారి తాను ఎన్ని రోజులు జైల్లో ఉంటానో తెలియదన్న కేజ్రీవాల్.. అనారోగ్యంతో ఉన్న తన తల్లిదండ్రుల కోసం ప్రార్థనలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా జైల్లో వేధింపులకు గురిచేస్తారని, అయినా తలవంచేది లేదని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. దేశాన్ని కాపాడే క్రమంలో తన ప్రాణాలు పోయినా ఎవరూ ఆవేదన చెందవద్దన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఆప్ అధినేత కూడా అయిన కేజ్రీవాల్‌ను ఈడీ మార్చిలో అరెస్ట్ చేసింది. కేజ్రీవాల్ వినతి మేరకు.. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వీలుగా సుప్రీంకోర్టు మే 10 నుంచి 21 రోజులపాటు అంటే జూన్ ఒకటో తేదీ వరకు మధ్యంతర బెయిలిచ్చిన విషయం తెల్సిందే. తిహార్ జైలు నుంచి బయటకు వచ్చిన యూపీ, పంజాబ్, ఢిల్లీ, మహారాష్ట్రల్లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన 21 రోజుల గడువు జూన్ ఒకటో తేదీతో ముగియనుంది. అందుకే జూన్ 2న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిహార్ జైలులో అధికారుల ఎదుట లొంగిపోనున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు.

ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్

ఎయిర్‌పోర్టులోనే అదుపులోకి తీసుకున్న సిట్



సాక్షి, బెంగళూరు: దేశంలో సంచలనం సృష్టించిన లైంగిక దాడుల కేసు నిందితుడు, జేడీఎస్ ఎంపీ (హాసన్) ప్రజ్వల్ రేవణ్ణ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. నెల రోజులుగా విదేశాల్లో తలదాచుకున్న ప్రజ్వల్ గురువారం అర్ధరాత్రి బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మహిళా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లైంగిక దాడుల వీడియోలు బహిర్గతమైన వెంటనే, ఏప్రిల్ 26 రాత్రి జర్మనీకి పలాయనం చిత్తగించిన ప్రజ్వల్ 34 రోజుల తర్వాత తిరిగి బెంగళూరు చేరుకున్నారు. పోలీసుల సమన్లకు సైతం అతడు స్పందించలేదు. వెంటనే స్వదేశానికి వచ్చి విచారణ ఎదుర్కోకపోతే తన ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందంటూ మాజీ ప్రధాని దేవెగౌడ తన మనవడు ప్రజ్వల్‌కు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. దీంతో మే 31న కర్ణాటకకు తిరిగి వస్తున్నానని, సిట్ అధికారుల విచారణకు హాజరవుతానని ప్రజ్వల్ సోమవారం వీడియో విడుదల చేశారు. చెప్పినట్టుగానే మ్యూనిక్ నుంచి లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానం (ఎల్‌హెచ్ 764)లో ప్రజ్వల్ బెంగళూరుకు చేరుకున్నారు. అరెస్ట్ వారెంట్ చూపించి అతడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు సీఐడీ కార్యాలయానికి తరలించారు. ప్రాథమిక విచారణ పూర్తి చేసి, బౌరింగ్ అండ్ లేడీ కర్జన్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం 42వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కేఎన్ శివకుమార్ ముందు హాజరు పరిచి, 14 రోజుల కస్టడీకి అభ్యర్థించారు. జూన్ 6వరకు (ఏడు రోజుల పాటు) పోలీసు కస్టడీకి అనుమతిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్డీఏ అభ్యర్థిగా హాసన్ లోక్‌సభ స్థానం నుంచి ప్రజ్వల్ రేవణ్ణ మరోసారి పోటీ చేయడం తెలిసిందే.

ఉత్తరాదిన ఎండ ప్రచండం

- 43 మంది మృత్యువాత
- మృతుల్లో 25 మంది పోలింగ్ సిబ్బంది



లక్నో/పట్నా/భువనేశ్వర్/రాంచీ: ఉత్తరాదిన భానుడి భగభగలు, వడగాడ్పుల తీవ్రత కొనసాగుతోంది. 24 గంటల వ్యవధిలో మరో 43 మంది ఎండ తీవ్రతకు అనారోగ్యం పాలై చనిపోయినట్లు సమాచారం. వీరిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే 25 మంది సిబ్బంది కూడా ఉండటం గమనార్హం. ఉత్తరప్రదేశ్, బిహార్, ఒడిశా, జార్ఖండ్, రాజస్తాన్, పంజాబ్, హరియాణాల్లో ఎండలు అత్యంత తీవ్రంగా ఉన్నాయి. హరియాణాలోని ఫరీదాబాద్, నుహ్‌లలో శుక్రవారం 48.2, చండీగఢ్‌లో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్తాన్‌లోని కరౌలీలో అత్యధికంగా 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కొనసాగింది. ఉత్తరాది రాష్ట్రాల్లో జూన్ 3వ తేదీ వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. బిహార్‌లో శుక్రవారం కూడా 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలకు వడగాలులు తోడయ్యాయి. రాష్ట్రంలో 24 గంటల వ్యవధిలో 10 మంది పోలింగ్ సిబ్బంది సహా 14 మంది వడగాలులకు తాళలేక మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో 15 మంది పోలింగ్ సిబ్బంది సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒడిశాలో వడదెబ్బతో ఐదుగురు చనిపోయారు. జార్ఖండ్‌లో చాలా చోట్ల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. డాల్టన్‌గంజ్, గర్హ్వాల్లో శుక్రవారం 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రతతో నలుగురు మృతి చెందగా అనారోగ్యం పాలై 1,326 మంది ఆస్పత్రుల్లో చేరారు.

ఎన్నికలపై విదేశీ కుట్ర

ఇజ్రాయెల్ కేంద్రంగా ఆపరేషన్ • అడ్డుకున్న ఓపెన్‌ఏఐ



న్యూఢిల్లీ: భారత్‌లో లోక్‌సభ ఎన్నికల చివరి దశ ముందు ఓపెన్ ఏఐ సంచలనాత్మక విషయాన్ని బయటపెట్టింది. ప్రజల అభిప్రాయాలను కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో కృత్రిమంగా ప్రభావితం చేసేందుకు ఇజ్రాయెల్ కేంద్రంగా జరిగిన కోవర్ట్ ఆపరేషన్‌ను అడ్డుకున్నట్టు చాట్ జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐ ప్రకటించింది. అధికార బీజేపీని విమర్శిస్తూ, ప్రతిపక్ష కాంగ్రెస్‌ను ప్రశంసిస్తూ 'ఎస్‌టీవోఐసీ' అనే రాజకీయ ప్రచార నిర్వహణ సంస్థ భారత ఎన్నికలపై కంటెంట్‌ను రూపొందించినట్టు తెలిపింది. ''భారత్‌ను లక్ష్యంగా చేసుకుని అధికార బీజేపీని విమర్శిస్తూ, కాంగ్రెస్‌ను పొగుడుతూ అభిప్రాయాలను ఎస్‌టీవోఐసీ మే నెలలో వ్యాప్తిలోకి తెచ్చింది. 24 గంటల్లోనే దీన్ని అడ్డుకున్నాం''అని ఓపెన్‌ఏఐ వెల్లడించింది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌లు, వెబ్‌సైట్లు, యూట్యూబ్ వేదికలపై ఓ సమూహంతో కూడిన అకౌంట్ల ద్వారా కంటెంట్ ఎడిట్, ప్రసారం చేసినట్టు, అలాంటి ఖాతాలను నిషేధించినట్టు ఓపెన్ ఏఐ ఓ నివేదిక రూపంలో బయటపెట్టింది. తమ ఏఐ టూల్స్ సాయంతో కథనాలు, అభిప్రాయాలను రూపొందించి వాటిని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లలో పోస్ట్ చేసినట్టు పేర్కొంది. ఈ ఆపరేషన్‌కు 'జీరో జెనో' అని పేరు పెట్టింది. ఏఐని సురక్షిత అవసరాలకే వినియోగించాలన్న లక్ష్యంలో భాగంగానే ఈ ఆపరేషన్‌ను విచ్ఛిన్నం చేసినట్టు తెలిపింది.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శనివారం : 1 : జూన్ : 2024



మంగళూరులో ఇండియన్ ఓపెన్ సర్ఫింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం అరేబియా సముద్రంలో ఎగిసిపడుతున్న అలల మధ్య ఓ క్రీడాకారుడి విన్యాసం

న్యూస్‌రీల్

మురుఘాశ్రీపై పోక్సో కేసు విచారణ

దొడ్డబళ్లాపురం: చిత్రదుర్గ మురుఘాశ్రీపై నమోదైన పోక్సో కేసు విచారణను కోర్టు జూన్ 3కి వాయిదా వేసింది. శుక్రవారం కేసు విచారణ ఉండగా పోలీసులు మురుఘాశ్రీని చిత్రదుర్గ రెండవ సెషన్స్ కోర్టులో హాజరుపరిచారు. ఈకేసులో మురుగాశ్రీ ఏ1 ముద్దాయిగా ఉన్నారు. అయితే కోర్టు విచారణను జూన్ 3వ తేదీకి వాయిదా వేసింది.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా



యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ సమీపంలోని తుంబె వద్ద కడెగోళి జాతీయ రహదారిపై శుక్రవారం గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. మంగళూరు నుంచి గ్యాస్‌తో వస్తున్న వాహనం వేగానికి అదుపుతప్పి డివైడర్‌పై బోల్తా పడింది. అయితే ట్యాంకర్ నుంచి ఎలాంటి లీక్ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బంట్వాళ అగ్నిమాపకదళం, పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం జరగకుండా చర్యలు తీసుకున్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు ?



అభ్యర్థులు సుమలత, ప్రొ. నాగరాజు, రవి

దొడ్డబళ్లాపురం: విధాన పరిషత్‌కు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేయడానికి ఆ పార్టీ ముగ్గురు అభ్యర్థులను ఖరారు చేసింది. నేడు ముగ్గురు అభ్యర్థుల పేర్లను బీజేపీ అధికారికంగా ప్రకటించనుంది. 11 స్థానాలకు ఎన్నికలు జరగనుండగా సంఖ్యాబలం ఆధారంగా బీజేపీకి మూడు స్థానాలు దక్కనున్నాయి. అయితే మూడు స్థానాలకు ముప్పైకి పైగా ఆశావహులు ఉండడంతో అభ్యర్థులను ఎన్నుకోవడం ఆలస్యం అయ్యింది. ప్రతీ స్థానానికి ముగ్గురు ఆశావహుల పేర్లను కలిపి మొత్తం 9 మంది పేర్లను రాష్ట్ర నాయకులు హైకమాండ్‌కు పంపించగా అంతిమంగా ముగ్గురు పేర్లను ఎంపిక చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మాజీ ఎంపీ సుమలత, ప్రొ.నాగరాజు, ఎస్ రవికుమార్‌ల పేర్లను ప్రకటించనున్నారు.

6 రోజులపాటు మద్యం బంద్



దొడ్డబళ్లాపురం: మద్యం ప్రియులకు ఇది చేదు వార్త. ఎందుకంటే జూన్1 నుంచి 6వ తేదీ వరకూ రాష్ట్రంలో మద్యం విక్రయాలను బంద్ చేయనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రాష్ట్రంలో ఆరు రోజులపాటు మద్యం విక్రయాలను రద్దు చేస్తూ అబ్కారీ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

నంది విగ్రహ రూపకల్పనలో శిల్పి అరుణ్ యోగిరాజ్



నంది విగ్రహం తయారీలో శిల్పి అరుణ్ యోగిరాజ్

మైసూరు : అయోధ్యలో కొలువైన బాల రాముని విగ్రహాన్ని చెక్కిన మైసూరు నగరానికి చెందిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ చేతిలో మరో సుందరమైన నంది విగ్రహం రూపు దిద్దుకుంటోంది. కశ్మీర్‌లో చరిత్ర ప్రసిద్ధి చెందిన జ్యోతిర్లింగాల్లో ఒకటైన అమర్‌నాథ్ ఆలయంలో స్వామివారి మంచు శివలింగం ఎదురుగా అరుణ్ యోగిరాజ్ రూపొందిస్తున్న నంది విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. మూడు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల పొడవుతో ఈ నంది విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. కృష్ణ శిల నుంచి ఈ నంది విగ్రహం తయారవుతోంది.

గేమింగ్ జోన్లలో భద్రత ఎంత?




గేమ్ జోన్‌లో ఆడుకుంటున్న చిన్నారులు



గుజరాత్ ఘటన ఎఫెక్ట్

- బెంగళూరులో హోటల్స్, గేమ్‌జోన్లలో అధికారుల పరిశీలన
- నిబంధనలు పాటించని మూడు గేమ్‌జోన్లకు తాళం





బనశంకరి: గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో ఉన్న గేమ్‌జోన్‌లో అగ్నిప్రమాదం సంభవించి చోటు చేసుకున్న మారణహోమం నేపథ్యంలో అలాంటి ఘటనలు తావివ్వకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు బీబీఎంపీ అధికారులు అప్రమత్తం అయ్యారు. బెంగళూరు నగరవ్యాప్తంగా ఉండే గేమ్ జోన్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి అగ్నిప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బీబీఎంపీ అధికారులను ఆదేశించారు. దీంతో గేమ్‌జోన్‌తో పాటు ప్రజలు అధికసంఖ్యలో సందర్శించే సినిమా థియేటర్లు, పబ్ అండ్ రెస్టారెంట్, మాల్స్, హోటల్స్ తదితర ప్రాంతాల్లో సురక్షత నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నారా? లేదా? అని అధికారులు పరిశీలిస్తున్నారు.

పరిశీలన చేపట్టే స్థలాలు

పబ్, రెస్టారెంట్, హోటల్, స్టార్‌హోటల్, షాపింగ్ మాల్, సూపర్ మార్కెట్, తయారీ కేంద్రాలు, బోర్డింగ్, లాడ్జింగ్, కల్యాణమంటపాలు, పీజీలు, నర్సింగ్‌హోమ్స్, డయాగ్నస్టిక్స్ ల్యాబ్స్, గార్మెంట్స్, కర్మాగారాలు, పెట్రోల్‌బంక్, సినిమా థియేటర్లు, జాతరలు, సర్కస్ నిర్వహించే ప్రాంతాలు.

మూడు గేమ్‌జోన్లకు తాళం...

బెంగళూరు నగరంలో అగ్నిసురక్షతా నిబంధనలు పాటించని గేమ్‌జోన్లను తాత్కాలికంగా నిలిపివేయాలని బీబీఎంపీ సూచించింది. బెంగళూరులో మొత్తం 29 గేమ్‌జోన్లను పరిశీలించారు. ఇందులో మూడు గేమ్‌జోన్లలో విద్యుత్‌దీప వ్యవస్థ సక్రమంగా లేదు. సురక్షత చర్యలు చేపట్టలేదు. ప్రత్యేకంగా అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకోలేదు. ఈ కారణాలతో మూడు గేమ్‌జోన్లను తాత్కాలికంగా నిలిపివేశారు. అవసరమైన భద్రతా చర్యలను చేపట్టిన అనంతరం మళ్లీ ప్రారంభించేందుకు అవకాశం కల్పిస్తామని బీబీఎంపీ ఆరోగ్య విభాగ ప్రత్యేక కమిషనర్ సురల్కర్‌వికాస్‌కిశోర్ తెలిపారు. గేమ్‌జోన్లతోపాటు పాటు ఇతర స్థలాల్లో అగ్ని ప్రమాద నివారణ చర్యలు పరిశీలన చేపడుతున్నామని ఆయన తెలిపారు. నిబంధనలు పాటించకపోతే సురక్షతాచర్యలు తీసుకోవాలని నోటీసులు జారీచేస్తున్నామని, సరిదిద్దిన అనంతరం ప్రజలు సందర్శనకు అవకాశం కల్పిస్తామని సురల్కర్‌వికాస్ కిశోర్ తెలిపారు.

బెంగళూరు నగరంలో గేమ్‌జోన్స్	
వలయాలు	గేమ్‌జోన్స్
దక్షిణ వలయ	3
పశ్చిమ వలయ	5
తూర్పు వలయ	5
బొమ్మనహళ్లి	3
మహదేవపుర	4
యలహంక	6
ఆర్ఆర్.నగర	3
మొత్తం	29

ఎవరు పరిశీలిస్తారు...

బీబీఎంపీ వలయ స్థాయిలో బృందాలు ఏర్పాటుచేశారు. ఇందులో వలయ ఆరోగ్యవైద్యాధికారి, సీనియర్ ఆరోగ్య అధికారులు, ఆరోగ్య పర్యవేక్షణాధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఉంటారు.



గేమ్‌జోన్‌ను పరిశీలిస్తున్న బీబీఎంపీ అధికారులు

రెండురోజుల్లో నివేదిక అందించాలి

బీబీఎంపీ వలయాలవారీగా పాలికె అధికారులు పైన ఉన్న జాబితాలోని ప్రాంతాలను పరిశీలించాలి. అగ్ని ప్రమాదాల నివారణకు ఏర్పాట్లు ఉన్నాయా ? వాటికి అనుమతులు ఉన్నాయా? భద్రతా పరంగా ఎలాంటి ఏర్పాట్లు చేశారా, ప్రమాదాలు జరిగితే ప్రాణాలు దక్కించుకునేందుకు ఏర్పాట్లు ఉన్నాయా అనేది పరిశీలించాలి. ఈ అంశాలపై ఈనెల 31 తేదీలోగా నివేదిక అందించాలి.

2న కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో హైకమాండ్ భేటీ

దొడ్డబళ్లాపురం: విధానపరిషత్‌లో ఖాళీ అవుతున్న 11 స్థానాలకు జూన్ 17న ఎన్నికలు జరగనున్నాయి. ఎమ్మెల్యేల ఓట్ల ద్వారా ఎమ్మెల్సీలను ఎన్నుకునే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏడు స్థానాలు దక్కనున్నాయి. అయితే టికెట్ ఆశిస్తున్న వారిసంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. దీంతో ఆశావహులను బుజ్జగించి, ఎన్నికలు సాఫీగా జరిగేలా చూడడానికి జూన్ 2న నగరంలోని ప్రైవేటు హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కార్యదర్శి తుకారాం తెలిపారు. ఈ సభలో ఎన్నికలకు సంబంధించిన అన్ని విషయాలు చర్చించనున్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన జరిగే సభలో కర్ణాటక కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలా, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హాజరవుతారు.

చంద్రశేఖర్ ఆత్మహత్య కేసుపై సిట్ ఏర్పాటు

బనశంకరి: వాల్మీకి మండలి అధికారి చంద్రశేఖర్ ఆత్మహత్య కేసు దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఐదుమంది సీనియర్ పోలీస్ అధికారులతో ఎస్ఐటీ బృందం ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సిట్ నివేదిక ఆధారంగా మంత్రి నాగేంద్రపై చర్యలు తీసుకోనున్నారు.

రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు



దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. కొన్ని రోజులుగా వర్షాలు ఆగిపోయిన నేపథ్యంలో మళ్లీ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. దక్షిణకన్నడ, ఉడుపి, కొడగు, చిక్కమగళూరు, ఉత్తరకన్నడ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. అదేవిధంగా బెంగళూరు చుట్టుపక్కల కూడా వర్షాలు కురుస్తాయి. దక్షిణ కర్ణాటకలో జూన్ 3న భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని సమాచారం.

ప్రజ్వల్ అరెస్ట్‌తో ఉత్కంఠకు తెర



ఎంపీ ప్రజ్వల్‌ను అరెస్ట్ చేసి సీఐడీ కార్యాలయానికి తరలిస్తున్న దృశ్యం

సాక్షి, బెంగళూరు: మహిళలపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటూ 34 రోజులుగా పరారీలో ఉన్న హాసన్ ఎంపీ ప్రజ్వల్ ఎట్టకేలకు కటకటాల వెనక్కు వెళ్లడంతో ఇన్నాళ్లు నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. జర్మనీ నుంచి గురువారం అర్ధరాత్రి కెంపేగౌడ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రజ్వల్‌ను సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా ప్రజ్వల్ కేసు విషయంలో ఎప్పుడు ఏం జరిగిందనే విషయంపై వివరాలు...

- ఏప్రిల్ 21 – హాసన్‌లో పెన్‌డ్రైవ్ వార్తలు కలకలం
- ఏప్రిల్ 22 – పెన్‌డ్రైవ్‌లోని కొన్ని వీడియోలు మొబైళ్లు, వాట్సాప్‌లో ప్రత్యక్షం
- ఏప్రిల్ 23 – హాసన్ సైబర్ పోలీసు స్టేషన్‌లో నవీన్‌పై జేడీఎస్ పార్టీ ఫిర్యాదు
- ఏప్రిల్ 26 – హొళెనరసీపురలోని హరదనహళ్లిలో ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఓటు హక్కు వినియోగం
- ఏప్రిల్ 26 – కేఆర్ నగరలో బంధువుల మృతి నేపథ్యంలో అక్కడికి వెళ్లి అర్ధరాత్రి అటు నుంచి అటే విదేశాలకు ప్రయాణం
- ఏప్రిల్ 27 – లైంగిక వేధింపులకు సంబంధించి మహిళా కమిషన్ ముఖ్యమంత్రికి ఫిర్యాదు.. సాయంత్రం ఈ కేసు విచారణపై సిట్‌కు ఆదేశం
- ఏప్రిల్ 28 – హొళెనరసీపుర టౌన్ పోలీసు స్టేషన్‌లో లైంగిక దాడి కేసు నమోదు
- ఏప్రిల్ 29 – విచారణకు హాజరవ్వాలని ప్రజ్వల్‌కు సిట్ నోటీసులు
- మే 1– అత్యాచారం కేసులో విచారణకు వచ్చేందుకు ఏడు రోజుల సమయం కోరిన ప్రజ్వల్
- మే 1 – ప్రజ్వల్ పాస్‌పోర్టును రద్దు చేయాలని కోరుతూ ప్రధానమంత్రికి సీఎం లేఖ
- మే 7 – ఇంటర్‌పోల్ నుంచి ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా బ్లూకార్నర్ నోటీసు
- మే 15 – జర్మనీ నుంచి విమానం టికెట్ బుక్ చేసి ఆ తర్వాత రద్దు
- మే 22 – ప్రజ్వల్ పాస్‌పోర్టు రద్దు కోసం రెండోసారి కేంద్రానికి లేఖ
- మే 23 – విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ప్రజ్వల్‌కు షోకాజ్ నోటీసు
- మే 27 – విదేశాల్లో వీడియో ద్వారా ప్రజ్వల్ ప్రత్యక్షం..
- మే 30 – అర్ధరాత్రి జర్మనీ నుంచి కెంపేగౌడ ఎయిర్ పోర్టుకు వచ్చిన ప్రజ్వల్

ప్రశ్నల జాబితా సిద్ధం చేసిన సిట్

బనశంకరి: ఎంపీ ప్రజ్వల్‌కు శుక్రవారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఎస్ఐటీ అధికారులు తీవ్ర విచారణ చేపట్టారు. విమానాశ్రయంలో న్యాయప్రక్రియ అనంతరం ఐదుమంది మహిళా పోలీస్ అధికారుల భద్రతతో సీఐడీ కార్యాలయానికి తరలించి తండ్రి హెచ్‌డీ.రేవణ్ణకు ఇచ్చిన గదిలో ప్రజ్వల్‌రేవణ్ణను ఉంచారు. ఎస్ఐటీ కార్యాలయంలో గురువారం రాత్రి గడిపిన ప్రజ్వల్‌రేవణ్ణ శుక్రవారం ఉదయం 8 గంటలకు బౌరింగ్ ఆసుపత్రికి తరలించారు. బీపీ, మధుమేహం, మూత్ర, రక్త పరీక్షలు డాక్టర్లు నిర్వహించారు. అనంతరం ఎస్ఐటీ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు. విదేశాలనుంచి తీసుకువచ్చిన లగేజీ, బ్యాగులు మొబైల్స్ స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు తరలించారు. ముందుగా సీనియర్ అధికారులు సమక్షంలో మూడు అత్యాచార కేసులకు సంబంధించి విచారణ చేపట్టి వాంగ్మూలం నమోదు చేశారు. అనంతరం 42వ ఏసీఎంఎంకోర్టులో హాజరు పరిచారు. ఆరు రోజుల కస్టడీకి కోర్టు ఆదేశించింది. శనివారం ప్రాథమిక దశ విచారణ చేపట్టనుండగా ఎస్పీ జగదీశ్, ఇతర అధికారుల బృందం ప్రశ్నలు జాబితా సిద్ధం చేశారు. కాగా ప్రజ్వల్‌రేవణ్ణను చూడటానికి బెంగళూరు ఏసీఎంఎంకోర్టు వద్దకు భారీగా అభిమానులు, జేడీఎస్ కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో తోపులాట జరిగింది.



వైద్యపరీక్షల కోసం ప్రజ్వల్‌ను తీసుకొచ్చిన బౌరింగ్ ఆస్పత్రి వద్ద పోలీసు బందోబస్తు

పురుషత్వ పరీక్షకు సిట్ నిర్ణయం

తాను అత్యాచారానికి పాల్పడలేదని ప్రజ్వల్ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసే అవకాశం ఉండటంతో ఆయనకు పురుషత్వ పరీక్ష నిర్వహించాలని సిట్ నిర్ణయించింది. హాసన నివాసంలో సేకరించిన బెడ్, దిండు ఇతర వస్తువులను డీఎన్ఏ, ప్రజ్వల్ డీఎన్ఏకు మ్యాచ్ చేస్తారు. మూడుదశల్లో ప్రజ్వల్ రేవణ్ణకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. గతంలో అనేకమంది అత్యాచార కేసుల్లో పురుషత్వ పరీక్ష చేపట్టారు. స్వామి నిత్యానంద, మురుఘాస్వామీజీ, ఆశారాంబాపూజీ తదితరులకు పురుషత్వపరీక్షలు నిర్వహించారు.

కూలిన పైకప్పు, ఇద్దరు చిన్నారుల మృత్యువాత



కూలిన పైకప్పు, మృతులు రుద్రయ్య, గీతా (ఫైల్)

యశవంతపుర: ఇంటి పైకప్పు కూలి అక్క, తమ్ముడు మృతి చెందిన ఘటన బాగలకోట జిల్లా ఇళకల్ తాలూకా కందగల్ల గ్రామంలో జరిగింది. గీత (14), ఆమె సోదరుడు రుద్రయ్య (10) ఇంటిలో ఉండగా ఒక్కసారిగా పైకప్పు కుప్ప కూలింది. దీంతో వీరిద్దరు శిథిలాల్లో చిక్కుకుపోయారు. శుక్రవారం నుంచి పాఠశాల తెరవటంతో మొదటి రోజు బడికి వెళ్లాలని తల్లిదండ్రులు చెప్పి పనులకు వెళ్లారు. అయితే మొదటి రోజు ఎవరు రారని చెప్పి ఇద్దరు ఇంటిలో మొబైల్ చూసుకుంటున్నారు. ఒక్కసారిగా పైకప్పు కూలిపోవడంతో ఇద్దరు ఊపిరి ఆడక మృతి చెందారు. బడికి వెళ్లి ఉంటే ఇద్దరు ప్రాణాలతో ఉండే వారని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

ఈతకెళ్లి ముగ్గురు చిన్నారులు..

హాసన జిల్లా ఆలూరు తాలూకా కదాళు సమీపంలోని ముత్తిగె గ్రామంలో చెరువులో మునిగి ముగ్గురు మృతి చెందారు. తాలూకాలోని నరసీపుర గ్రామానికి చెందిన దీక్షిత్ (10), నిత్యశ్రీ (12), కుసుమ(6)లు పశువులను చెరువు వద్ద కట్టేసి ఈతకు దిగి నీట మునిగి మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

దొంగలను దుడ్డుకర్రతో ఎదురించిన వృద్ధురాలు

బాగేపల్లి : దోపిడీకి వచ్చి గన్ చూపించి బెదిరించిన నలుగురు దుండగులను వృద్ధురాలైన ఇంటి యజమానురాలు ధైర్యంగా ఎదుర్కొంది. ప్రాణాలకు తెగించి చేతిలో దుడ్డుకర్ర పెట్టుకొని పెద్దగా కేకలు వేస్తూ ఎదురించింది. దీంతో దొంగలు పలాయనం చిత్తగించారు. ఈ ఘటన బాగేపల్లి తాలూకా తొళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పాతాపాళ్య పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి(70) తొళ్లపల్లి గ్రామ సమీపంలో పెట్రోల్‌బంక్, బార్‌ను నిర్వహిస్తున్నారు. నేపాల్‌కు చెందిన దంపతులను ఇద్దరిని మూడు నెలల క్రితం పనికి పెట్టుకున్నారు. ఇంటి ఎదురుగా వారికి గది ఏర్పాటు చేశారు. నేపాల్ దంపతులు 4 రోజుల క్రితం సొంత ఊరికి వెళ్లారు. అప్పటి వరకు తమకు తెలిసిన వారు పనిచేస్తారని చెప్పి ఇద్దరు దంపతులను ఇంటిలో ఉంచి వెళ్లారు. బుధవారం రాత్రి గోపాల్‌రెడ్డి పెట్రోల్ బంక్‌నుంచి నగదు తీసుకొని ఇంటికి వచ్చాడు. 8.30గంటల సమయంలో గోపాల్‌రెడ్డి పోర్టికోలో విశ్రాంతి తీసుకుంటుండగా ముసుగులు ధరించిన నలుగురు వ్యక్తులు ఇంటిలోకి వచ్చి గన్ చూపించి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చంపేస్తామని హెచ్చరించారు. గమనించిన గోపాల్‌రెడ్డి భార్య దుడ్డు కర్ర తీసుకొని గట్టిగా కేకలు వేస్తూ బయటకు రావడంతో దొంగలు ఉడాయించారు. అయినా వృద్ధ దంపతులు దుండగులను వెంటాడే ప్రయత్నం చేశారు. కాగా పని కోసం వచ్చి ఇంటి ఎదుట గదిలో నివాసం ఉంటున్న ఇద్దరు దంపతులు బయటకు రాలేదు. మేమే పోలీసులకు ఫోన్ చేస్తాం .. మీరు బయటకు రావద్దని గోపాల్‌రెడ్డికి సూచించారు. పోలీసులు వచ్చి వివరాలు సేకరిస్తున్న సమయంలో పని కోసం వచ్చిన దంపతులు కనిపించకుండా పోయారు. దీంతో పోలీసులపై వారిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా పోలీసులు గోపాల్‌రెడ్డి ఇంటి ఆవరణలోని సీసీకెమెరాను పరిశీలించారు. అనంతరం గాలింపు చేపట్టి ఇద్దరు నేపాలీవాసులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.



ఇంటి నుంచి బయటకు వస్తున్న ముసుగు దొంగ (సీసీ కెమెరాలోని దృశ్యం)



రథోత్సవం.. భక్తజన సంద్రం

కొప్పళ జిల్లా హులిగి గ్రామంలో హులిగమ్మ దేవి జాతర సందర్భంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేల మంది భక్తులు తరలివచ్చారు.

క్లుప్తంగా

గెస్ట్ టీచర్లను కొనసాగించరూ..


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి ఉపాధ్యాయులను 2024–25వ విద్యా సంవత్సరంలో కొనసాగించాలని జనవేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు నాగరాజ్ మాట్లాడారు. 2023–24వ విద్యా సంవత్సరంలో అతిథి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించామని, తిరిగి ఆ పోస్టులనే తమకు కేటాయించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

మండీలను ఏపీఎంసీకి తరలించండి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలోని ప్రధాన కూడలి తీన్ కందిల్, మచ్చిమార్కెట్ల వద్ద ఉన్న పండ్ల మండీలను ఏపీఎంసీకి తరలించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సంచాలకుడు అంబాజీ రావ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి శివానంద పాటిల్ ఐదు నెలల క్రితం పండ్ల మండీల కోసం ఏపీఎంసీలో 16 దుకాణాలు కేటాయించినా అక్కడకు వెళ్లడం లేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయని, అందువల్ల ఇకనైనా మండీలను తరలించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అధిక ఫీజుల వసూలు తగదు


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా డొనేషన్లు, ఫీజులు వసూలు చేయడం తగదని సీపీఐ ఎంఎల్(రెడ్ స్టార్) నేత అమరేష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి ఆయన మాట్లాడారు. మధ్య తరగతి పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో చదవాలంటే రూ.లక్షల్లో డొనేషన్లు, వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా జిల్లా, తాలూకా విద్యాశాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడాన్ని ఖండించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: జూన్ 3న జరగనున్న ఈశాన్య కర్ణాటక పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటు హక్కుపై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు గణేష్, శాకీర్, నందిత, వెంకటేష్ నాయక్‌లున్నారు.

మూగజీవాలకు విముక్తి


పశువులను తరలిస్తున్న దృశ్యం

మైసూరు : కసాయి ఖానాకు తరలిస్తున్న మూగ జీవాలకు పోలీసులు విముక్తి కల్పించారు. మైసూరు జిల్లా హుణసూరు తాలూకా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రత్నాపుర, బుద్దిన్, రత్నపురి అల్తాఫ్ శాబుద్దిన్ అనే వ్యక్తులు దాదాపు 40కిపైగా పశువులను మూడు వాహనాల్లో కుక్కి రవాణా చేస్తున్నారు. పోలీసులకు పక్కా సమాచారం అందడంతో దాడి చేసి వాహనాలను అడ్డుకున్నారు. పశువులను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- 19 రౌండ్ల కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- లెక్కింపు కేంద్రం, నగరంలో గట్టి బందోబస్తు
- ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా వెల్లడి


బళ్లారిలో మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఏఎస్పీ తదితరులు

సాక్షి,బళ్లారి: గత నెల 7వ తేదీన జరిగిన బళ్లారి లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపును ఈనెల 4వ తేదీన జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్‌వైఎంఈసీలోని స్ట్రాంగ్ రూంల్లో ఈవీఎంలు భద్రంగా ఉంచామని, జూన్ 4న ఉదయం 8 గంటల లోపు ఈవీఎంలు ఉంచిన గదులను తెరిచి లెక్కింపు చేపడతామన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తామన్నారు. బళ్లారి లోక్‌సభలోని 8 నియోజకవర్గాల పరిధిలోని అన్ని ఈవీఎంలను ఒకే చోట ఆర్‌వైఎంఈసీలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఉంచామన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏజెంట్లకు, అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. ఇప్పటికే ఓట్ల లెక్కింపులో పాల్గొనే పాత్రికేయులతో సహా అందరికీ ఎంట్రీ పాసులు మంజూరు చేశామన్నారు. పాసులు ఉన్న వారికి మాత్రమే లోపలకు అనుమతి ఇస్తామన్నారు.

పాస్ ఉన్నవారికే అనుమతి

ఎన్నికల కమిషన్ నుంచి వెలువడిన పాస్‌లు తప్పనిసరిగా తీసుకుని ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి వెళ్లాల్సి ఉంటుందన్నారు. నిబంధనలను ఎవరూ ఉల్లంఘించకూడదన్నారు. బళ్లారి లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఓట్లు లెక్కింపును 19 రౌండ్లలో పూర్తి చేస్తామన్నారు. 14 టేబుల్స్ ఏర్పాటు చేశామని, ఒక రౌండ్‌కు 14 ఈవీఎంల ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం లోపు దాదాపుగా ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలు వెలువడే అవకాశం ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గెలిచిన అభ్యర్థులు ఎవరైనా ఊరేగింపులు, బాణసంచా పేల్చడం వంటివి చేయరాదని సూచించారు. ఏఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎస్పీతో పాటు ఇద్దరు ఏఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 15 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 25 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 40 మంది ఏఎస్ఐలు, 150 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 250 మంది కానిస్టేబుల్స్, 4 కేఆర్పీ, 4 డీఏఆర్ బృందాలు బందోబస్తులో పాల్గొంటాయన్నారు.

పరిషత్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఈనెల 3వ తేదీన జరగనున్న విధాన పరిషత్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లాధికారి పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 24,183 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. వీరిలో పురుషులు 14,981, మహిళా ఓటర్లు 9,198 మంది ఉన్నారని, ఇతర ఓటర్లు నలుగురు ఉన్నట్లు తెలిపారు.

కౌంటింగ్ సజావుగా నిర్వహించండి


కోలారులో మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రంపాషా

కోలారు: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్నందున అధికారులు, సిబ్బంది ఎలాంటి గందరగోళానికి తావు లేని విధంగా సజావుగా కౌంటింగ్ పూర్తి చేయాలని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌పై అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు సలహా, సూచనలు అందించారు. కౌంటింగ్ ప్రక్రియ ఈ నెల 4న డిగ్రీ కళాశాలలో ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు హాజరు కావాలన్నారు. ఉపహారం ముగించిన తరువాత 7 గంటల కల్లా కౌంటింగ్ నిర్వహించే గదుల్లోకి చేరుకోవాలని సూచించారు.

లెక్కింపు పూర్తయ్యే వరకు బయటకు రావద్దు

కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు సిబ్బంది కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు రాకూడదన్నారు. పార్టీల, అభ్యర్థుల ఏజెంట్లు అడిగే సందేహాలను ఓపికతో పరిష్కరించాలన్నారు. వారితో సౌజన్యంతో వ్యవహరించాలన్నారు. ఎస్పీ ఎం నారాయణ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది తమ వాహనాలను నిర్దేశిత స్థలంలో పార్క్ చేసి లోపలికి వెళ్లాలని సూచించారు. డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ శంకర్ వణిక్యాల్ మాట్లాడుతూ సర్వీస్ ఓట్లను క్రమబద్ధంగా ఉంటేనే పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉప విభాగ అధికారిణి వెంకటలక్ష్మి, జెడ్పీ ఉప కార్యదర్శి శివకుమార్, ఏఆర్‌ఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


కోలారులో సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది





● **ఉత్సాహంగా బడికి**

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం అన్ని పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. వినూత్నంగా ఉపాధ్యాయులు చిన్నారులకు స్వాగతం పలికారు. ధార్వాడలో బడికి వచ్చిన చిన్నారులకు గులాబీ పూలు ఇచ్చి ఆశీర్వదిస్తున్న టీచర్లు. హావేరిలో మై ఫస్ట్ డే స్కూల్ పోస్టర్ వద్ద విద్యార్థి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి


వాక్‌థాన్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు

బనశంకరి: పొగాకు ఉత్పత్తులు సేవనం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో జాగృతం చేయాలని బీబీఎంపీ ఆరోగ్యవిభాగ ప్రత్యేక కమిషనర్ సురళ్కర్ వికాస్ కిశోర్ తెలిపారు. శుక్రవారం బృహత్ బెంగళూరు మహానగర పాలికె, ఇతర సంఘ సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వాకథాన్‌ను ఫ్రీడం పార్కు వద్ద సురళ్కర్ వికాస్ కిశోర్ ప్రారంభించి మాట్లాడారు. పొగాకు సేవనం ప్రాణాంతకమని, పిల్లలు చెడు అలవాట్లకు లోనుకాకుండా ఆరోగ్యకర సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వాకథాన్ ఫ్రీడంపార్కు నుంచి టౌన్‌హాల్ వరకు నిర్వహించారు. వివిధ కాలేజీలకు చెందిన 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలికె, ఇతర సంస్థలు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆరోగ్యాధికారిణి డాక్టర్ మదని, పొగాకు నియంత్రణ కార్యక్రమ అధికారి కుమార్ ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం హానికరం


ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జి, అధికారులు

కోలారు: ప్రపంచ పొగాకు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రి నుంచి జాగృతి జాతాను నిర్వహించారు. జిల్లా న్యాయ సేవల ప్రాధికార అధ్యక్షుడు, సెషన్స్ న్యాయమూర్తి సునీల్ ఎస్.హొసమని జాగృతి జాతాను ప్రారంభించారు. పొగాకు సేవనం వల్ల అనేక దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. యువత పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని పూర్తిగా వదిలేయాలన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు పొగాకు ఉత్పత్తులను సేవించడం వల్ల మన ఆరోగ్యంపై ఎలాంటి చెడు ప్రభావం చూపుతుందో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. జాతాలో జిల్లా సర్వేక్షణాధికారి డాక్టర్ చారిణి, జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మునేగౌడ, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ ఏవీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ తరగతులు ప్రారంభం


కంప్యూటర్ శిక్షణ సంస్థ సిబ్బందితో ఎస్పీ నారాయణ

కోలారు: పోలీస్ శాఖ సిబ్బంది పిల్లల కోసం జిల్లాలోని అన్ని తాలూకాల్లో కంప్యూటర్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎం నారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని పోలీస్ వాణిజ్య కంప్యూటర్ శిక్షణా పాఠశాలలో పోలీస్ సిబ్బంది పిల్లల కోసం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. దీని వల్ల పోలీస్ సిబ్బంది పిల్లల విద్యా ప్రగతికి ఈ కంప్యూటర్ శిక్షణా సంస్థలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సదా సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది పిల్లల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. మారుతున్న ప్రపంచంలో ఏ ఉద్యోగానికైనా కంప్యూటర్ విద్య ఎంతో అవసరం అన్నారు. పోలీస్ కంప్యూటర్ సంస్థలో శిక్షణ పొందిన వారు ఎన్నో ఉన్నత స్థానాలను అలంకరించారన్నారు. ఇదే సమయంలో నగర పోలీస్ వాణిజ్య, కంప్యూటర్ శిక్షణ సంస్థకు కంప్యూటర్లను విరాళంగా అందించిన ఎం బిటల్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ సిబ్బంది శరత్, అలగప్పన్, జయంత్, రోటేరియన్ సరితా కుమారిలను సన్మానించారు.

పొగాకు సేవనం ప్రమాదకరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి సచిన్ తదితరులు

గౌరిబిదనూరు: పొగాకు సేవించడం ఆరోగ్యానికి హానికరమని, పాఠశాలల సమీపంలో పొగాకు విక్రయం నిషేధమని జడ్జి పిఎం సచిన్ తెలిపారు. శుక్రవారం ఆచార్య కళాశాల ఆవరణంలో తాలూకా న్యాయ సేవా సమితి, వకీళ్ల సంఘం, ఆరోగ్య శాఖ, నగరసభ సంయుక్తంగా వరల్డ్ నో టొబాకో డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొగాకు సేవనం వల్ల ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. వైద్యురాలు లావణ్య మాట్లాడుతూ... పొగాకు తీసుకోవడం వల్ల నోటి క్యాన్సర్, క్షయ వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఏటా మే నెల 31న వరల్డ్ నో టొబాకో డే ఆచరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వకీళ్ల సంఘం అధ్యక్షుడు రామదాసు, లక్ష్మీనారాయణ,వి గోపాల్, జగదీశ్, ఆచార్య కళాశాల ప్రిన్సిపాల్ రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ల్యాప్‌టాప్‌ల పంపిణీ


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న దృశ్యం

సాక్షి బెంగళూరు: రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు 56 మందికి సీఎస్ఆర్ యోజన కింద కర్ణాటక బ్యాంకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లను పంపిణీ చేసింది. బుధవారం కాలేజీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కర్ణాటక బ్యాంకు ప్రబంధకుడు బి.నాగరాజ ఉపాధ్యాయ, గోకుల విద్యా సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్ సీతారామ్‌లు ల్యాప్‌ట్యాప్‌లను అందించారు. నాగరాజు మాట్లాడుతూ తమకు రామయ్యతో 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఈ అనుబంధంతోనే ల్యాప్‌ట్యాప్‌లను ఇచ్చినట్లు చెప్పారు. ఎంఆర్ సీతారామ్ మాట్లాడుతూ కర్ణాటక బ్యాంకు ఇచ్చిన ల్యాప్‌ట్యాప్‌లు విద్యార్థులకుఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో గోకుల విద్యా సంస్థల ముఖ్య కార్యనిర్వాహకులు బీఎస్ రామప్రసాద్, కర్ణాటక బ్యాంకు వ్యవస్థాపకులు శశిధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఆర్ నాయుడు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్‌తో పోలీసులు

కేజీఎఫ్: రాబర్ట్‌సన్‌పేట పోలీసులు రూ.5 లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం తాలూకాకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. క్యాసంబళ్లికి వెళ్లే దారిలో గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు కుప్పం తాలూకా అనిగనూరుకు చెందిన వెంకటాచలపతి, విజిలాపురకు చెందిన హంసగిరి, కెంచనబల్లకు చెందిన నిఖిల్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 6.3 కిలోల గంజాయిని, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి నిందితులను జ్యుడిషియల్ కస్టడీకి పంపారు.

కోలారు వార్తలు...

నడిరోడ్డుపై యువకుల వీరంగం

- బీర్ బాటిళ్లు, రోడ్డు డివైడర్లతో ఫైటింగ్


కొట్టుకుంటున్న యువకులు

శ్రీనివాసపురం: పట్టణంలోని హాప్‌కామ్స్ ముందు కొంతమంది యువకులు బీర్‌బాటిళ్లు, రోడ్డు డివైడర్లతో కొట్టుకుని వీరంగం సృష్టించారు. కోలారు గాంధీనగర, శ్రీనివాసపుర తాలూకాలోని మోగిలహళ్లి గ్రామ యువకుల మధ్య చిన్న విషయానికి గొడవ ప్రారంభమై కొట్టుకునేదాకా వెళ్లింది. పరస్పరం బీరు బాటిళ్లు, రోడ్డు డివైడర్లతో కొట్టుకున్నారు. ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని శ్రీనివాసపుర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హరీష్, మంజునాథ్ అనే యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

స్కౌట్స్ గైడ్స్ కమిషనర్‌కు సన్మానం


సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: కోలారు రోటరీ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో సంస్థలో గత 45 ఏళ్ల నుంచి సుదీర్ఘ సేవలు అందించిన కేఆర్ సురేష్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. రోటరీ రాష్ట్ర గవర్నర్ ఉదయభాస్కర్, జిల్లా కార్యదర్శి రొటేరియన్ గురునాగేష్, రోటరీ అధ్యక్షుడు ప్రకాష్, రామచంద్రేగౌడ, రామచంద్రప్ప, హరణి రవీంద్రనాథ్, సీఎంఆర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నోరూరిస్తున్న పనస కాయలు


చెట్టుకు విరగ కాసిన పనస కాయలు


మంచి ఆకృతిలో ఉన్న పనస కాయలు

- ఉత్తమ దిగుబడితో పాటు జోరుగా విక్రయాలు
- మంచి లాభాలు ఆశిస్తున్న రైతులు, వ్యాపారులు

కోలారు: పనస సీజన్ ప్రారంభమై ఈ సారి ఉత్తమ దిగుబడితో మంచి లాభాలు వస్తాయనే ఆశతో రైతులు, వ్యాపారులు ఉన్నారు. మార్కెట్‌లోకి మామిడితో పాటు పనస కాయలు కూడా జోరుగా వస్తున్నాయి. ఈ సారి మామిడి దిగుబడి చాలా తక్కువగా ఉండి ధరలు కూడా అధికంగా ఉంది. మామిడి పంట రైతులను నిరాశ పరిచినా పనస మాత్రం ఉత్తమ దిగుబడితో పాటు మంచి లాభాలు అందిస్తుందని అంచనా. మామిడి లాగా పనసను వాణిజ్య పంటగా పండించరు. దిగుబడిని దృష్టిలో పెడితే ఇది ఇతర పండ్ల కంటే అధిక లాభదాయకం కాదు. 5 కిలోల నుంచి 25 కిలోల వరకు బరువు ఉండే ఇవి తాలూకాలోని సరిహద్దు ప్రాంతాలైన కెంపాపుర, తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన కామసముద్రం ఫిర్కాల్లో పండుతుంది. ఫిర్కా కేంద్రాల నుంచి కూడా సీజన్‌లో పనస కాయలు వస్తాయి.

స్థిరంగా పనస ధర

కామసముద్రం గ్రామ చుట్టుపక్కల వందలాది ఏళ్ల క్రితం నాటిన పనస చెట్లు ఉండగా కెంపాపుర గ్రామ సమీపంలో కూడా పెద్ద సంఖ్యలో పనస చెట్లు ఉన్నాయి. ఇతర పండ్ల ధరలు హెచ్చుతగ్గులు అవుతున్నా పనస పండు మాత్రం తన ధరను కోల్పోలేదని, ఇక్కడి మట్టి గుణం పనస పండు అధిక రుచిగా ఉండడానికి కారణమైందని రైతులు అంటున్నారు. నగరంలోని ఎంజీ మార్కెట్‌లో పనస పండ్ల రాశులు ఇప్పటికే దర్శనమిస్తున్నాయి. స్థానిక వ్యాపారులు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా పనసపండ్లను తెచ్చి విక్రయిస్తున్నారు. తాలూకాలో మామిడి తోటల్లాగా పనస తోటలు తక్కువ. తమ తోటలో పెంచి పనస చెట్లను కాయ దశలోనే రైతులు వ్యాపారులకు విక్రయిస్తారు. పెద్ద సైజు పనస కాయలు రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. 60 నుంచి 70 పనస కాయల రాశిని వ్యాపారులు రూ.5 వేలకు టోకుగా కొని బయట విక్రయిస్తారు.

సిబ్బందితో సత్సంబంధాలు అవసరం


మాట్లాడుతున్న బసవరాజ్

కోలారు: ఉన్నతాధికారులు సిబ్బందితో చక్కగా పని చేయించుకున్నప్పుడే రవాణా సంస్థ ముందడుగు వేస్తుందని కేఎస్ఆర్టీసీ డివిజనల్ కంట్రోలర్ వి.బసవరాజ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండులో విధులు నిర్వహించిన నివృత్తి పొందిన డిపో మేనేజర్ అప్పిరెడ్డి, ట్రాఫిక్ కంట్రోలర్ వైవీ రమేష్ కుమార్‌ను అభినందించి మాట్లాడారు. రవాణా శాఖలో డ్రైవర్లు, కండక్టర్ల సేవలు శ్లాఘనీయం, వారితోనే సంస్థ మనుగడ సాగుతోందన్నారు. ప్రయాణికులతో సౌజన్యంగా మెలిగినప్పుడే నివృత్త జీవితం తృప్తికరంగా ఉంటుందన్నారు. డీటీఓ జయ శాంతకుమార్, బస్టాండు అధికారి శివకుమార్, శ్రీనివాసమూర్తి, హెచ్ఎస్ శ్రీనివాసగౌడ, మానప్ప, జయచంద్ర, అబ్బణి, సొణ్ణప్ప, వక్కలేరి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొగ తాగితే ప్రాణానికి ముప్పు


జాగృతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తుమకూరు: ధూమపానం ప్రమాదకరమని, వాటికి దూరంగా ఉండాలని తుమకూరు నగరంలో శుక్రవారం వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా జాగృతి ర్యాలీ నిర్వహించారు. నగరంలోని టౌన్‌హాల్ సర్కిల్ నుంచి జాగృతి జాతా నిర్వహించారు. జాతాను న్యాయమూర్తి నూరున్నిసా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...పొగ తాగితే అనారోగ్య సమస్యలు వస్తాయని, దీర్ఘకాలంగా వ్యాధులతో బాధపడాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

ఆస్పత్రిలో చేరిన శామనూరు

యశవంతపుర: దావణగెరె ఎమ్మెల్యే శామనూరు శివశంకరప్ప అనారోగ్యానికి గురయ్యారు. హుటాహుటిన కుటుంబ సభ్యులు దావణగెరె హైటెక్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం కొంత మెరుగుపడినట్లు వైద్యులు తెలిపారు. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇప్పటి వరకు రూ.1100 కోట్ల నగదు స్వాధీనం

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఐటీ శాఖ ఏకంగా రూ.1,100 కోట్ల నగదు, ఆభరణాలు స్వాధీనం చేసుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఐటీ శాఖ రూ.390 కోట్లు స్వాధీనం చేసుకోగా 2024 ఏడాదికి పోల్చుకుంటే 182 శాతం పెరిగింది. ఎన్నికల కమిషన్ మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించాక ఆనాటి నుండి ఐటీ శాఖ కార్యాచరణ జరిపింది. ఈ ప్రకారం కర్ణాటక రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని సమాచారం.

రోడ్ల మరమ్మతులు షురూ


కరేకల్లహళ్లి రైల్వే అండర్‌పాస్‌లో రోడ్డు గుంతను పూడ్చుతున్న దృశ్యం

గౌరిబిదనూరు: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలో రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. కృష్ణభవన్ రోడ్డు, బజార్ రోడ్డు, ప్రైవేటు బస్టాండు, కరేకల్లహళ్లిలో రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం ఉదయం కమిషనర్ గీత, కరేకల్లహళ్ళి రైల్వే అండర్ పాస్ వద్ద శుక్రవారం గుంతలు పూడ్చే పనులను నగరసభ సభ్యురాలు పద్మావతమ్మతో కలిసి పరిశీలించారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మహేశ్

గౌరిబిదనూరు: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని తహసీల్దార్ మహేశ్ పత్రి ఎరువుల విక్రయదారులకు సూచించారు. గత ఏడాదితో కరువు కారణంగా రైతులు పూర్తిగా నష్టపోయారని, ఈ ఏడాది తొలకరి కొంత ఆశాజనకంగా ఉందన్నారు. సకాలంలో విత్తనాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో సహాయ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్ఎం మోహన్, రసాయనిక ఎరువుల విక్రయదారుల సంఘం అధ్యక్షుడు నంజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య

మైసూరు: చిన్నపాటి వివాదం హత్యకు దారితీసిన ఘటన మైసూరు నగరంలో చోటుచేసుకుంది. నగరంలోని ఉదయగిరిలోని శాంతి నగరలో హత్య జరిగింది. అర్బాజ్ ఖాన్ (18)ను దారుణంగా హత్య చేశారు. వివరాలు... శాంతినగరలో అర్బాజ్ ఖాన్.. శాదిల్, శహబాజ్, షోయబ్, సాహిల్‌లతో గొడవ ఉంది. శుక్రవారం ఉదయం ఆ నలుగురు ఆగ్రహంతో మారణాయుధాలు తీసుకుని అర్బాజ్ ఖాన్‌ను దారుణంగా నరికి చంపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



మండ్య: మండ్య జిల్లాలో కేఆర్ పేటెలోని హేమగిరి బీజీఎస్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో శుక్రవారం చిన్నారుల అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ చిన్నారి సరస్వతి వేషధారణ అలరించింది. పెద్ద సంఖ్యలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చారిత్రక, పర్యాటక నగరి కలబురిగి

- శతాబ్దాల చరిత్ర కలిగిన అరుదైన కట్టడాలు
- ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు

బనశంకరి: ఉత్తర కర్ణాటకలోని కలబురిగి జిల్లా కేంద్రాన్ని గుల్బర్గా అని పిలుస్తారు. ఇది చారిత్రక ప్రదేశంతో పాటు ఈ చుట్టుపక్కప్రాంతాల్లో ఇదే అతి పెద్దనగరం. దీంతో కలబురిగి రాష్ట్రంలో ప్రత్యేకమైన స్థానం ఉంది. ఇది కర్ణాటక రాజధాని బెంగళూరుకు సుమారు 620 కిలోమీటర్లు దూరంలో ఉండగా హైదరాబాద్‌కు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. గుల్బర్గాలో ప్రధానంగా పురాతన ఆలయాలు, చారిత్రక కట్టడాలు కూడా ఉన్నాయి. దీంతో వీకెండ్‌లో కలబురిగికి వెళ్లడానికి ప్లాన్‌చేస్తే సరిపోతుంది. ప్రశాంతంగా చూడాలంటే రెండు రోజుల్లో వెళ్లవచ్చు.

బ్రహ్మనీయుల రాజ్యం..

కలబురిగిలోని కోటతో పాటు జామామసీదు సైతం బ్రహ్మనీయుల కాలంలో నిర్మించిన అరుదైన నిర్మాణాలు ఇప్పటికీ అద్భుతంగా ఉంటాయి. దీంతో వీటిని చూడటానికి పర్యాటకులు విచ్చేస్తారు. కలబురిగి నగరంలో అనేక భవనాలను యునెస్కో 2014లో మానుమెంట్స్ అండ్ ఫోర్ట్స్ ఆఫ్ ది డెక్కన్ సుల్తానేట్ పేరిట ప్రపంచ వారసత్వ సంపద ప్రదేశాల్లో తాత్కాలిక జాబితాలో చేర్చింది. దీంతో ఈ నగరానికి ఘనమైన చరిత్ర ఉంది.

ఖ్వాజా బండే నవాజ్‌దర్గా...

కలబురిగిలో ప్రముఖ సందర్శనీయ స్థలాల్లో ఖ్వాజా బండే నవాజ్‌దర్గా ఒకటి. ప్రసిద్ధ సూఫీ ఆధ్యాత్మికవేత్త ఖ్వాజా బండే సమాధి ఉంది. అలాగే ఇక్కడ ఉర్దూ, అరబిక్, పర్షియన్ భాషలకు చెందిన వేలాది పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయి. ఈ భవనం పర్షియన్, ఇండో-సార్సెనిక్, అరబిక్ నిర్మాణశైలిని కలిగిఉంది.

ప్రశాంతమైన బుద్ధవిహార్....

గుల్బర్గా యూనివర్శిటీకీ సమీపంలో ఉన్న బుద్ధ విహార్ సైతం మంచి సందర్శనీయ స్థలం. ఇది ప్రశాంతమైన వాతావరణంలో ఉండటంతో సందర్శకులకు మనశ్శాంతి లభిస్తుంది. టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా చేతుల మీదుగా ప్రారంభమైన బుద్ధవిహార్ అహింస, శాంతికి చిహ్నంగా మారింది. దీంతో ఇది పుణ్యక్షేత్రంగా మారింది. బుద్ధవిహార్ ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మూసి ఉంటుంది.

గుల్బర్గా కోట చూడాల్సిందే...

గుల్బర్గాలో తప్పక చూడాల్సిన ప్రదేశాల్లో గుల్బర్గా కోట ఒకటి. దీనిని బ్రహ్మనీయుల కాలంలో అల్లాఉద్దీన్‌హసన్ బహ్మన్‌షా అనే సుల్తాన్ నిర్మించారు. పర్షియన్, భారతీయ శైలిలో నిర్మించారు. కాలక్రమేణా ఈ కోట అనేక మంది పాలకుల చేతులు మారి చివరికి టూరిస్ట్ ప్రదేశంగా మారింది. 15 టవర్లు వంటి నిర్మాణాలతో ఈ కోట ఇప్పటికీ చెక్కు చెదరలేదు. దీంతో కలబురిగిలో కోటను తప్పనిసరిగా చూడాల్సిన ప్రదేశాల్లో ఒకటిగా మారింది.

జమా మసీదు....

గుల్బర్గాకోటలోని ఉన్న జామామసీదు సైతం చూడాల్సిన ప్రదేశం. దీనిని బహమనీ సుల్తానులు నిర్మించారు. అప్పట్లో గుల్బర్గా వారి రాజ్యంగా ఉన్న నేపథ్యంలో దానిని గుర్తించేందుకు ఈ మసీదును కట్టించారు. అప్పట్లో దక్షిణ భారత్‌లో నిర్మించిన మసీదుల్లో ఇది ఒకటిగా నిలిచింది. మసీదు నిర్మాణశైలి చాలా సహజంగా ఉన్నప్పటికీ అద్భుతమైన ప్రణాళికలతో నిర్మించారు. ఈ మసీదు నిర్మాణ కొలతలతో భారత్‌లో మరో మసీదు లేదంటే అతిశయోక్తి కాదు. అలాగే ఇక్కడ హఫ్త్‌గుంబాజ్ సమాధులు కూడా చాలా ప్రాచుర్యం.


శరణ బసవేశ్వర దేవస్థానం వద్ద భక్తుల రద్దీ (ఫైల్)

శరణ బసవేశ్వరాలయం....


కలబుర్గినగరంలో శరణబసవేశ్వర గుడి కూడా సందర్శించాల్సిన పుణ్యక్షేత్రం. ఇది లింగాయత్ ఆరాధ్య గురువు బసవేశ్వరుడి నిలయంగా మారింది. దీంతో నిత్యం ఇక్కడికి ఎంతో మంది భక్తులు ఇక్కడికి విచ్చేస్తారు. 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ రాతి ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది.

హఫ్త్‌గుంబాద్‌టూంబ్స్...

కలబుర్గిలోగల హఫ్త్‌గుంబాద్‌టూంబ్స్ కూడా చూడాల్సిన ప్రదేశం. ఇవన్నీ బహమనీయుల సమాధులు. 14, 15 శతాబ్దాల్లో నిర్మించిన ఈ ఏడు సమాధులు ఇండో-ఇస్లామిక్ నిర్మాణశైలిలో ఉంటాయి.


కలబురిగి కోట ప్రవేశద్వారం


ప్రశాంతతకు నిలయమైన బుద్ధవిహార్


పురాతన జమామసీదు


కలబురిగి కోటలో అతిపెద్ద ఫిరంగి

పాల పొడి సరఫరా చేస్తామని టోకరా

మైసూరు: పాల పొడిని సరఫరా చేస్తామని చెప్పి ఓ వ్యక్తి రూ. 14 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటన మైసూరు నగరంలోని నజరాబాద్‌లో జరిగింది. నగరంలోని సిద్ధార్థ నగరంలో ఉన్న శ్రీ సత్య సాయి గోకులం ప్రొడక్ట్‌కు చెందిన యజమాని ప్రకాశ్ బాధితుడు. ఇతను ఆన్‌లైన్ ద్వారా హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలకు పాలపొడిని సరఫరా చేసే కాంట్రాక్ట్ తీసుకున్నాడు. నాగరాజు అనే వ్యక్తిని ప్రకాశ్ సంప్రదించాడు. డీల్ కుదరడంతో అతని ఖాతాకు రూ. 14 లక్షలు బదిలీ చేశాడు. అనంతరం ఎన్నిసార్లు ఫోన్ చేసినా నాగరాజు స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గోమాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్ : నిషేధిత గోమాంసం విక్రయిస్తున్న వ్యక్తిని మైసూరు నగరంలోని మండి పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 320 కిలోల గోవు మాంసం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మన్సూర్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు.

చిన్నారులకు ఘన స్వాగతం



మైసూరు: శుక్రవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో మైసూరు తాలూకాలోని వరుణ సమీపంలోని మెల్లహళ్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠాలను పచ్చటి తోరణాలతో అలంకరించి చిన్నారులకు గులాబీలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం చిన్నారులకు యూనిఫామ్, పుస్తకాలను అందజేశారు. చిన్నారులు కూడా ఉత్సాహంగా కనిపించారు.

మాల్‌పై నుంచి దూకి యువకుడు ఆత్మహత్య

బనశంకరి: మాల్‌పై నుంచి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మైకో లేఔట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. శుక్రవారం నగరంలోని బన్నేరుఘట్ట రోడ్డు వేగాసిటీ మాల్ పైనుంచి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం ఏపీఎంసీ మార్కెట్‌లో ఎప్పటిలాగే లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘం నేతలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ...జూన్ 1 నుంచి ఉదయం 11 గంటలకు మార్కెట్ లావాదేవీలు జరిగేలా ప్రకటన చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మునపటి లాగే ఉదయం 7 గంటలకు మార్కెట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పుడు చేసిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు మరళు కుంటె రామాంజినప్ప, కార్యదర్శి గోపాల్, కుప్పళ్లి శ్రీనివాస్ అశ్వత్థప్ప, మునికృష్ణప్ప, జనార్దన్, నారాయణస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కాంట్రాక్టర్ ఆత్మహత్య

యశవంతపుర: కేఆర్ఐడీఎల్ కాంట్రాక్టర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దావణగెరెలో జరిగింది. బకాయిలు పేరుకుపోవడంతో జీవితంపై విరక్తి చెందిన సంతేబెన్నూరుకు చెందిన కాంట్రాక్టర్ పీఎస్ గౌడర్ (48) డెత్‌నోట్ రాసి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బకాయిలు పేరుకుపోవడం, ఇంటిలో తమ్ముళ్ల ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డెత్‌నోట్‌లో పేర్కొన్నాడు. దాదాపు రూ. 80 లక్షల వరకు ఆయనకు ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉంది. దావణగెరె ఎస్పీ ఉమా ప్రశాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.


పీఎస్ గౌడర్ (ఫైల్)

శాఖపరమైన విచారణకు ఆదేశం

కాంట్రాక్టర్ పీఎస్ గౌడర్ ఆత్మహత్యపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఆదేశించారు. ఈ మేరకు మంత్రి తన ఎక్స్‌లో పోస్టు చేశారు. కేఆర్‌డీఎల్ సంస్థలో ఆరోపణలకు సంబంధించి అధికారులతో కమిటీని వేసి విచారణ చేయాలని ఆదేశించారు.

భవానీకి సిట్ రెండో నోటీసు

బనశంకరి: మహిళ కిడ్నాప్ కేసులో విచారణకు గైర్హాజరవుతున్న భవానీ రేవణ్ణకు సిట్ రెండోసారి నోటీసు జారీ చేసింది. మే 2న కేఆర్.నగర పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విచారణకు హాజరుకావాలని మే 15న మొదటిసారి సిట్ నోటీస్ జారీ చేసింది. ఈ నోటీసుకు సమాధానంగా కేసులో విచారణ అవసరమైతే హొళెనరసీపుర చెన్నాంబిక నివాసంలో ఉంటున్నానని తెలిపారు. కేసులో మీ విచారణ అవసరం కాగా జూన్ 1 తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల అవధిలో మీరు తెలిపిన అడ్రస్‌కు విచారణ అధికారులు వస్తారని, మీరు విచారణకు హాజరుకావాలని నోటీస్‌లో సిట్ అధికారులు పేర్కొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పీఎన్ రవీంద్ర

చిక్కబళ్లాపురం: పొగాకు సేవనం ప్రమాదకరమని, కోరి అనారోగ్యాన్ని ఎవరూ తెచ్చుకోకూడదని కలెక్టర్ పీఎన్ రవీంద్ర అన్నారు. శుక్రవారం నగరంలోని కేవీ క్యాంపస్‌లో ఆవరణంలోని సర్ ఎం విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ శిక్షణ కేంద్రంలో ఆయన వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. నేటి యువత తంబాకు వంటి ఉత్పత్తులకు బానిసలవుతున్నారని, దేశంలో 28 శాతం మంది తంబాకు బానిసలయ్యారన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠిరోగ నియంత్రణ అధికారి డాక్టర్ శివకుమార్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ప్రకాశ్, జిల్లా కుటుంబ కళ్యాణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఆరోగ్య శిక్షణ అధికారి హరీశ్, ట్రైనింగ్‌సెంటర్ ప్రిన్సిపాల్ రాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన స్వాగతం



తుమకూరు: సుదీర్ఘ సెలవుల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు సాదర స్వాగతం పలికారు. తుమకూరు నగరంలోని శిరగేట్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల పునః ప్రారంభ కార్యక్రమానికి ఏకంగా జిల్లా అధికారి శుభ కల్యాణ్ వచ్చి విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో డీడీపీఐ రంగధామయ్య, బీఈఓ సూర్యకళ, డైట్ ప్రిన్సిపల్ ఓబులయ్య, ప్రధానోపాధ్యాయుడు శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

తోరణాలు కట్టి.. గులాబీలు ఇచ్చి..



తుమకూరులోని మరళూరులో పీఎంఈ ప్రభుత్వ పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా పాఠశాలను శుక్రవారం పచ్చటి తోరణాలతో అలంకరించారు. అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు గులాబీ పూలు, స్వీట్లు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వాణి తరాణి,సుజాత, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

యశవంతపుర: రాష్ట్ర ప్రభుత్వం నలుగురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. డాక్టర్ షాలిని రజనీశ్‌కు బెంగళూరు ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలను అప్పగించారు. ఉమాశంకర్‌కు బెంగళూరు నగరాభివృద్ధి శాఖ ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శిగా, గౌరవ్‌గుప్తాకు ఇంధనశాఖ ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శిగా, రశ్మి మహేశ్‌కు కర్ణాటక మేల్మనవి న్యాయమండలి అధ్యక్ష బాధ్యత్యలను అదనంగా అప్పగిస్తూ ఆదేశాలను జారీ చేసింది.

ప్రజ్వల్‌పై అసత్య ప్రచారం చేయొద్దు


మాట్లాడుతున్న న్యాయవాది అరుణ్

బనశంకరి: లైంగిక దాడికేసులో అరెస్టయిన ప్రజ్వల్ రేవణ్ణపై మీడియా అసత్య ప్రచారం చేయరాదని న్యాయవాది అరుణ్ విజ్ఞప్తి చేశారు. సిట్ అదుపులో ఉన్న ప్రజ్వల్‌ను న్యాయవాది అరుణ్ భేటీ అయిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆయనపై అసత్య ఆరోపణలు చేయొద్దని, ప్రజల్ విచారణకు సహకరిస్తానని పేర్కొన్నారని అన్నారు.

బ్యారికేడ్లు అడ్డుపెట్టి హంగామా

బనశంకరి: లైంగికదాడి కేసులో ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు వైద్యపరీక్షలు నిమిత్తం శుక్రవారం సిట్ బౌరింగ్ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి చుట్టుపక్కల భద్రత కట్టుదిట్టం చేశారు. ఆసుపత్రి అత్యవసర నిఘా కేంద్రం వద్ద బ్యారికేడ్లు అమర్చారు. దీంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర చికిత్స నిమిత్తం పీణ్యా నుంచి ఆటోలో వచ్చిన రోగిని ఆసుపత్రి గేటు వద్ద భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఆసుపత్రి గేట్ వద్ద వాహనం నిలపాలి ఇక్కడ నుంచి ముందుకు వాహనం వదిలేది లేదని సెక్యూరిటీ తెలిపారు. కడుపునొప్పితో నడవడం సాధ్యం కాదని రోగి కన్నీరు పెట్టినప్పటికీ ఆటోను అనుమతించలేదు. కాలికి దెబ్బతగిన వృద్ధుడు ఆసుపత్రి వద్దకు రావడంతో అతడిని భద్రతా సిబ్బంది అడ్డుకుని వెనక్కి పంపించారు. దీంతో రోగులు, వారి బంధువులు శాపనార్థాలు పెడుతూ వెళ్లారు.

తగలబడిన తాగునీటి పైప్‌లు



మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా హుల్లహళ్లి గ్రామంలో జలజీవన్ మిషన్ కింద తీసుకుని వచ్చిన పైప్‌లకు నిప్పంటుకున్న ఘటన చోటుచేసుకుంది. దీంతో రూ. 10 లక్షల విలువైన పైప్‌లు కాలిబూడిదయ్యాయి. గ్రామంలోని జేఎస్ఎస్ కళాశాల వెనుక భాగంలో ఉన్న టీచర్ కాలనీలో పైప్‌లను ఉంచారు. అయితే అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే పైప్‌లు కాలిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

హోసూరు వార్తలు..

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనంలో జాతరకెళ్లి తిరిగి వస్తున్న సమయంలో అదుపుతప్పి కింద పడడంతో కళాశాల విద్యార్థిని ఘటనా స్థలంలోనే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మత్తూరు పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... ధర్మపురి జిల్లా కారిమంగలం సమీపంలోని పెరియంబట్టి గ్రామానికి చెందిన జయసుధ (19). ధర్మపురిలోని ప్రైవేట్ కళాశాలలో బిఎస్సీ నర్సింగ్ చదువుతోంది. అదే కళాశాలలో చదువుతున్న పెన్నాగరం ప్రాంతానికి చెందిన గౌతమ్ (23)తో కలిసి గురువారం క్రిష్ణగిరి సమీపంలోని కప్పలవాడి వద్ద జరిగే ఆలయ జాతరకు బైక్‌లో వెళ్లారు. జాతర ముగించుకొని తిరిగి వస్తుండగా శివంబట్టి వద్ద అకస్మాత్తుగా బైక్ అదుపు తప్పి కింద పడడంతో ప్రమాదం జరిగింది. జయసుధ ఘటనా స్థలంలోనే మృతి చెందగా గౌతమ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని మత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

కారును అడ్డగించి రూ.25 లక్షల దోపిడీ

క్రిష్ణగిరి: రూ. 25 లక్షలు తీసుకొస్తే రూ. 30 లక్షలు అందజేస్తామని ఆశచూపి డబ్బు లాక్కెళ్లిన ముఠా కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వివరాలు...కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు చెందిన మనో (42), లింగరాజ్ (40)లను ఆన్‌లైన్ ద్వారా సంప్రదించిన హోసూరు ప్రాంత వ్యక్తి వ్యాపార నిమిత్తం రూ. 25 లక్షలు తీసుకొస్తే వెంటనే రూ. 30 లక్షలు అందజేస్తామని నగదును తీసుకొని హోసూరు సమీపంలోని సూళగిరి ప్రాంతానికి రావాలని తెలిపాడు. అతని మాటలు నమ్మిన మనో, లింగరాజ్‌లు రూ. 25 లక్షల నగదును తీసుకొని సూళగిరి తాలూకా సామలపల్లం సమీపంలోని గుమ్మనూరు వద్దకెళ్లారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన ఐదుగురు ముఠా సభ్యులు వారిని అడ్డగించి వారి వద్ద ఉన్న రూ. 25 లక్షలు లాక్కొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. హోసూరు డీఎస్పీ బాబు ప్రశాంత్ సైతం ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.

అభివృద్ధి పనుల పరిశీలన

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా మత్తూరు పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కలెక్టర్ శరయు పరిశీలించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మత్తూరు గ్రామపంచాయతీలోని నాగంపట్టి, మత్తూరు, కలర్‌పతి, వాలిపట్టి, గెరిగేపల్లి, వీరాచ్చికుప్పం తదితర గ్రామాల్లో రూ. 98 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు, ఓవర్‌ట్యాంక్ ఏర్పాటు, స్మార్ట్ తరగతి గదుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులను కలెక్టర్ నేరుగా పరిశీలించి మాట్లాడుతూ... నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీడీవో ఉమాశంకర్, అధికారులు శివప్రకాష్, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఉద్యోగికి లక్షల టోపీ

హోసూరు: సైబర్ మోసగాళ్లు అమాయకులను వంచిస్తూనే ఉన్నారు. ఓ ప్రైవేట్ ఉద్యోగి నుంచి రూ. 5.76 లక్షలను దోచుకున్నారు. బాధితుడు బాగలూరు రోడ్డు ప్రాంతానికి చెందిన రమేశ్. ఇతని సెల్‌కు ఫిబ్రవరిలో ఓ సందేశం వచ్చింది. తాము సూచించిన కంపెనీలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని అందులో ఉంది. దీంతో వారు ఇచ్చిన నెంబర్‌ను సంప్రదించాడు. అనంతరం వారు చెప్పిన ఖాతాలకు రూ. 5.76 లక్షలు పంపాడు. అప్పటి నుంచి సైబర్ నేరగాడి ఫోన్ స్విచాఫ్ కావడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

హోసూరు: విద్యార్థినిని లైంగికంగా వేధించడాన్ని నిలదీసిన ఆమె అక్కను హత్య చేస్తానని బెదిరించిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు... క్రిష్ణగిరి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 13 ఏళ్ల విద్యార్థిని అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. కొద్ది రోజులుగా బాలిక తల్లి అనారోగ్యానికి గురికావడంతో క్రిష్ణగిరి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. తోడుగా బాలిక ఉంటోంది. బాలిక తరచూ క్యాంటీన్‌కు వెళ్లి వస్తుండేది. ఈ సమయంలో క్రిష్ణగిరి రైల్వే కాలనీకి చెందిన మనోజ్ (19)తో పరిచయం కలిగింది. బాలిక సెల్‌నంబర్ తీసుకొని రోజూ లైంగికంగా వేధిస్తుండటంతో విషయం అక్కకు చెప్పింది. ఆమె మనోజ్‌ను నిలదీయగా అతను హత్య చేస్తానని బెదిరించాడు. క్రిష్ణగిరి మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం


ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని బోడిచిపల్లి గ్రామంలో వెలసిన గ్రామదేవత పిలేకిమారియమ్మ పల్లకీ ఉత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేకం, అలంకరణ, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామదేవతల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఊరేగించారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బోడిచిపల్లి, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఈసీ తీరు ప్రజాస్వామ్య ప్రక్రియకే అవమానం

నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు

సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎలక్షన్ కమిషన్ తీరు ప్రజాస్వామ్య ప్రక్రియకే అవమానమని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. ఏపీ ఎన్నికల కమిషన్ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల చెల్లుబాటుపై సొంత నిర్ణయం తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల బరిలో ఉన్న అనేకమంది అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లు జరిగేలా ఎన్నికల కమిషన్ తీరు ఉందన్నారు. ఇప్పటికైనా నిబంధనల ప్రకారం వ్యవహరించి నిష్పక్షపాతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని వరప్రసాదరావు కోరారు.

బాబు, లోకేశ్ ప్రోత్సాహంతోనే పీఆర్కేపై గోబెల్స్ ప్రచారం

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్



మాట్లాడుతున్న హనుమంత్‌నాయక్

మాచర్ల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలు గత ఐదేళ్లుగా ప్రజలకు చేసిన అభివృద్ధిని గురించి హర్షించే వారే తప్ప, విమర్శించేవారు లేరని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ చెప్పారు. పల్నాడు జిల్లా మాచర్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవలేమన్న భయంతోనే పచ్చ మూకలు రాష్ట్రంలో అల్లర్లు, దాడులు చేశాయని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌ల ప్రోత్సాహంతోనే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పుస్తకం విడుదల చేసి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేశ్‌కు దమ్ముంటే పీఆర్కేపై చేసిన ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాజకీయ సన్యాసం స్వీకరిస్తారా.. అని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేశ్‌ల ప్రోద్బలంతోనే పీఆర్కేపై పోలీసులు అనేక అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సభావత్ రవినాయక్, వైఎస్సార్‌సీపీ గిరిజన నాయకులు రమావత్ మాధ్యనాయక్, కేతావత్ శ్రీనునాయక్, నూన్సావత్ రంగా నాయక్, కేతావత్ రఘునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త చరిత్రను సృష్టించిన సీఎం జగన్ ఐదేళ్ల పాలన

గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్

సాక్షి, అమరావతి : సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలన కొత్త చరిత్రను సృష్టించిందని, రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా పాలన సాగిందని గిరిజన ప్రజా సమాఖ్య(జీపీఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2019 ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలను ఐదేళ్లలో అమలు చేసి చూపించారని కొనియాడారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుని విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా నవరత్నాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ పద్ధతిలో లక్షల కోట్ల రూపాయలను ప్రజల బ్యాంకు ఖాతాలకు జమ చేశారని పేర్కొన్నారు. తన వల్ల మేలు జరిగిందని భావిస్తేనే ఓటు వేయాలని కోరిన దమ్మున్న నేతగా చరిత్ర సృష్టించారని తెలిపారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుతో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

కొత్త విత్తనాలు వేద్దాం

పెట్టుబడి, ఉత్పత్తి నష్టాలను అధిగమిద్దాం • ఖరీఫ్‌లో 37 లక్షల ఎకరాల్లో వరి సాగు



టీసీజీఎస్–1694 రకం వేరుశనగ పైరు

సాక్షి, అమరావతి: వరి సాగులో విత్తన మార్పిడిని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు నూతన విత్తనాల సాగును ప్రోత్సహించాలని భావిస్తోంది. ఈ మేరకు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో వరి ఖరీఫ్ సీజన్‌లో 37 లక్షల ఎకరాల్లో, రబీలో 20 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఖరీఫ్‌లో 20 లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మూడు దశాబ్దాల క్రితం అభివృద్ధి చేసిన వంగడాలనే నేటికీ సాగు చేస్తున్నారు. వీటిలో ప్రధానంగా బీపీటీ 5204తో పాటు ఎంటీయూ 7029, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలు ఎక్కువగా పండిస్తున్నారు. దశాబ్దాలుగా సాగవుతుండడంతో చీడపీడలను తట్టుకోలేకపోతున్నాయి. తుఫాన్లతోపాటు కొద్దిపాటి వర్షాలను సైతం తట్టుకోలేక పంటచేలు నేలచూపులు చూస్తున్నాయి. భారీ వర్షాలొస్తే ముంపు బారిన పడుతున్నాయి. వీటికి సరైన ప్రత్యామ్నాయం లేక, కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలపై అవగాహన లేక రైతన్నలు వీటిపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

అందుబాటులో ప్రత్యామ్నాయ రకాలు

శాస్త్రవేత్తల సుదీర్ఘ పరిశోధనల అనంతరం ఎంటీయూ 7029, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 రకం వరి విత్తనాన్ని అందుబాటులోకి తెచ్చారు. గింజ రాలకపోవడంతోపాటు తెగుళ్లను సమర్థంగా తట్టుకుని మిల్లర్లకు నూక శాతం లేని రకంగా ఈ కొత్త వరి వంగడం ప్రాచుర్యం పొందింది. ఇక బీపీటీ 5204 రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1271, ఎన్‌డీఎల్‌ఆర్ 7 రకాలు అందుబాటులోకి వచ్చాయి. తెగుళ్లు, పురుగులను తట్టుకునే సామర్థ్యంతో అభివృద్ధి చేసిన ఈ వంగడాలు గింజ రాలకుండా అధిక దిగుబడులు ఇస్తున్నట్లు శాస్త్రవేత్తలు ధృవీకరించారు. ఆర్‌జీఎల్ 2537 రకం వరికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1232 రకాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇది సన్న గింజ రకం కావడంతోపాటు అధిక దిగుబడినిస్తుంది.

వేరుశనగలో కే–6కు ప్రత్యామ్నాయం

ఖరీఫ్‌లో సాగు చేసే నూనె గింజల్లో అత్యధిక విస్తీర్ణం (15 లక్షల ఎకరాలు)లో సాగయ్యే వేరుశనగలో కే–6 రకాన్నే దాదాపు మూడు దశాబ్దాలుగా పండిస్తున్నారు. తెగుళ్లు, చీడపీడలతో పాటు బెట్ట పరిస్థితులను తట్టుకోలేక, ఆశించిన దిగుబడులు రాకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. కే–6కు ప్రత్యామ్నాయంగా టీసీజీఎస్ 1694, కదిరి లేపాక్షి రకాలను అందుబాటులోకి తెచ్చారు. బెట్టనే కాకుండా తెగుళ్లను కూడా సమర్థంగా తట్టుకునే ఈ రకాలు అధిక దిగుబడినిస్తున్నాయని శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు.

దశలవారీగా విస్తరణ..

వ్యవసాయ శాఖాధికారులు, డీఏఏటీఏ, కేవీకే శాస్త్రవేత్తలు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో జిల్లా స్థాయిలో నిర్వహించిన సదస్సులతో కొత్త విత్తనాల సాగుపై వ్యవసాయ శాఖ పక్కాగా కార్యాచరణ సిద్ధం చేసింది. దశలవారీగా కొత్త రకాల సాగును విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. 2024–25 సీజన్‌లో 10 శాతం, 2025–26 సీజన్‌లో 15 శాతం, 2026–27లో 25 శాతం విస్తీర్ణంలో విత్తన మార్పిడి చేయనున్నారు. తరువాత సంవత్సరాల్లో ఇదే విధానం కొనసాగుతుంది. బ్రీడర్ విత్తనాన్ని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉత్పత్తి చేసింది. ప్రభుత్వ క్షేత్రాలు/ఏపీ సీడ్స్ ఎంపిక చేసిన రైతుల క్షేత్రాల్లో బ్రీడర్ సీడ్ నుంచి మూల విత్తనాన్ని పండిస్తారు. ఏపీ సీడ్స్ ఎంపిక చేసిన రైతుల క్షేత్రాల్లో మూల విత్తనాన్ని నాటి సర్టిఫైడ్ సీడ్‌ను పండిస్తారు. వీటిని ఏపీ విత్తన ధ్రువీకరణ అథారిటీ ధ్రువీకరిస్తుంది. బ్రీడర్, ఫౌండేషన్ సీడ్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ముందుగా వీటి సాగుకు ప్రాధాన్యతనిస్తారు. పూర్తిస్థాయిలో విత్తనం అందుబాటులోకి తెచ్చిన తర్వాత సబ్సిడీపై రైతులకు సరఫరా చేసి దశల వారీగా సాగు విస్తీర్ణం పెరిగేలా ప్రోత్సహిస్తారు.

ప్రత్యామ్నాయ రకాల విస్తరణే లక్ష్యం

రాష్ట్రంలో కొన్ని రకాల వంగడాలు దాదాపు 20–30 ఏళ్లకుపైగా సాగులో ఉన్నాయి. కనీసం 10–15 ఏళ్ల పాటు సాగు చేసిన వంగడాలను క్రమేపీ తగ్గించాలి. వాటి స్థానంలో ఇటీవల కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలను సాగులోకి తేవాల్సిన అవసరం ఉంది. వచ్చే మూడేళ్లలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో కనీసం 50 శాతం విస్తీర్ణంలో పాత వంగడాల స్థానంలో శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన కొత్త రకాల సాగును ప్రోత్సహించేలా కార్యాచరణ సిద్ధం చేశాం.



–చేవూరు హరికిరణ్,
స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

ఆర్బీకేల ద్వారా అవగాహన

రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో రైతుల వారీగా సమావేశాలు నిర్వహించి తొలుత అవగాహన కల్పించనున్నారు. కొత్త రకాల ప్రత్యేకతను అందరికీ అర్థమయ్యే రీతిలో వాల్ పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తారు. ఆర్బీకే ఛానల్ ద్వారా శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతుల సందేశాలతో కూడిన వీడియోల ద్వారా వీటి సాగును ప్రోత్సహిస్తారు. చిన్న చిన్న వీడియో, ఆడియో సందేశాలను రూపొందించి పంటల వారీగా ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపుల ద్వారా రైతులకు చేరవేసి వాటిపై అవగాహన కల్పిస్తారు.

సీఎం కార్యదర్శి కె.ధనంజయరెడ్డి పదవీ విరమణ



ధనంజయరెడ్డి అభినందన సభలో సీనియర్ ఐఏఎస్ అధికారులు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.ధనంజయరెడ్డి శుక్రవారం సాయంత్రం పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను సీఎం కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ధనంజయరెడ్డి నిర్వహించే బాధ్యతలకు అంతర్గత ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సీఎస్ సూచించారు.

ధనంజయరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

సివిల్ సర్వీసెస్ అధికారిగా కె.ధనంజయ రెడ్డి అనునిత్యం అంకితభావంతో విధులు నిర్వర్తించారని, స్ఫూర్తిదాయక సేవలందించారని పలువురు ఉన్నతాధికారులు కొనియాడారు. ధనంజయరెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా సీనియర్ ఐఏఎస్ అధికారులు, సహచరులు ఆయన్ను విజయవాడలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ అధికారులు మాట్లాడుతూ.. రాయచోటిలో సామాన్య కుటుంబంలో జన్మించిన ధనంజయరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) అదనపు కమిషనర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం కలెక్టర్‌గా, అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యదర్శిగా విస్తృత సేవలు అందించారన్నారు. ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వర్తిస్తారని, ప్రణాళికాబద్ధంగా పనిచేసి మంచి ఫలితాలు సాధించే అధికారిగా పేరొందారని తెలిపారు. 1988లోనే చెన్నముక్కపల్లె సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడమే కాకుండా గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుతూ సివిల్స్ పరీక్షల్లో విజయం సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. 1992లో ఢిల్లీలో సివిల్ సర్వీసెస్ అధికారిగా తన పయనాన్ని ప్రారంభించి, ఇప్పటివరకు పాలనాదక్షుడిగా ఖ్యాతి గడించారని తెలిపారు. ధనంజయరెడ్డితో కలిసి పనిచేసిన అనుభూతులను అధికారులు పంచుకున్నారు.

తెలంగాణలో టీడీపీ నామ్‌కే వాస్తేనే!

- దుకాణం సర్దేయడమే బెటర్ అనే యోచనలో అధినేత?
- తెలంగాణ టీడీపీ నేతలతో భేటీలో పార్టీ బలోపేతంపై నోరు మెదపని వైనం
- ఏపీలో అధికారం పైనా క్లారిటీ ఇవ్వని చంద్రబాబు

సాక్షి, హైదరాబాద్: తన శిష్యుడు రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్న తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మూసేయడమే మంచిదనే అభిప్రాయంతో ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఉన్నట్లు టీటీడీపీ వర్గాలే భావిస్తున్నాయి. ఏపీలో అధికారంలోకి వస్తున్నాం అనే మాటలే తప్ప... తెలంగాణలో పార్టీకి అధ్యక్షుడిని నియమిద్దామనే మాట కూడా బాబు నోట వెలువడలేదు. విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ వచ్చిన చంద్రబాబు శుక్రవారం సాయంత్రం తన నివాసంలో తెలంగాణ నాయకులతో సమావేశమయ్యారు. తెలంగాణలో శాసనసభ ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకుంటారని భావించి వివిధ జిల్లాల నుంచి వచ్చిన టీడీపీ అభిమానులకు నిరాశే ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల ముందు టీటీడీపీ అధ్యక్షుడిగా పార్టీకి రాజీనామా చేసిన కాసాని జ్ఞానేశ్వర్ బీఆర్‌ఎస్‌లో చేరగా, అప్పటి నుంచి తెలంగాణ పార్టీకి దిక్కూ దివాణా లేకుండా పోయింది.

పార్టీ రద్దయ్యే ప్రమాదం పొంచి ఉన్నా..

ఎన్నికల్లో కనీసం పోటీ చేయకపోవడంతో ప్రాంతీయ పార్టీగా తెలంగాణలో గుర్తింపు కూడా రద్దయ్యే పరిస్థితి నెలకొంది. శాసనసభ ఎన్నికలలో తన శిష్యుడు రేవంత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరించిన చంద్రబాబు పార్లమెంటు ఎన్నికల్లో కూడా అభ్యర్థులను పోటీకి పెట్టలేదు. ఇప్పుడు కూడా రేవంత్ సర్కార్‌కు అండగా నిలవాలనే విధంగానే పార్టీ యంత్రాంగానికి ఉద్బోధ చేశారు. జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొనాలని, అదే రోజు పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరేసి, ప్రభుత్వానికి మద్దతు తెలపాలని శుక్రవారం తనను కలిసిన పార్టీ వర్గాలకు హితబోధ చేశారు.

అక్కడ ఫలితాలొచ్చాక చూద్దాం..

ఏపీలో జరిగిన ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు వేచి చూడాలని చెప్పిన ఆయన అక్కడ తెలుగుదేశం అధికారంలోకి వస్తుందనే ధీమాను కూడా పార్టీ యంత్రాంగం ముందు వ్యక్తం చేయకపోవడం నాయకులను ఆశ్చర్యానికి గురిచేసింది. జూన్ 4 తరువాత వెలువడే ఏపీ ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణలో పార్టీ గురించి ఆలోచిస్తామని చంద్రబాబు పరోక్షంగా పార్టీ నాయకులకు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో ఫొటోలు దిగారు. సమావేశంలో పార్టీ నాయకులు బక్కని నర్సింములు, అర్వింద్ కుమార్ గౌడ్, కాట్రగడ్డ ప్రసూన, పి.సాయిబాబా, సాంబశివరావు, కోటేశ్వర్‌రావు, నల్లెల్ల కిషోర్ పాల్గొన్నారు.

గిరిజనుల జీవనశైలిని చూసొద్దాం రండి..

శ్రీశైలంలో ఆకట్టుకుంటున్న 'చెంచులక్ష్మి' ట్రైబల్ మ్యూజియం

- గిరిజన తెగల సంస్కృతి, చరిత్రను తెలియజేసేలా ప్రతిమలు
- చెంచులతోపాటు మరికొన్ని కొండ జాతుల విశేషాలు



నృత్యం చేస్తున్న బంజారా మహిళల ప్రతిమలు



కుండలో వంట చేస్తున్న గిరిజన మహిళ



అవజాం కొడుతున్న కొండరెడ్డి



నాదస్వరంతో సర్పపూజ చేస్తున్న గిరిజనుడు



చెంచులక్ష్మి ప్రతిమ



శివునికి సోది చెప్పిన కొరవంజి ప్రతిమ

పెద్దదోర్నాల: విద్యార్థులు వేసవి సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు. నిత్యం పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టే పిల్లలు సెలవుల్లో విజ్ఞానం పెంచుకోవడానికి విహారయాత్రలు చేసేందుకు ఇష్టపడతారు. అలాగే ఉద్యోగులు, వివిధ వృత్తులలో ఉన్నవారు సైతం వేసవికాలంలో కాస్తంత విశ్రాంతి, మానసికానందం కోసం పర్యాటక ప్రదేశాలు చూసేందుకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రకాశం జిల్లాకు సరిహద్దులో ఉన్న ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలోని చెంచులక్ష్మి ట్రైబల్ మ్యూజియంలో చెంచుల జీవిత విశేషాలను తెలుసుకునేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నారు. ఐటీడీఏ ఏర్పాటుచేసిన ఈ ట్రైబల్ మ్యూజియంలో చెంచులతోపాటు అడవి బిడ్డలైన శోలాములు, కోంధులు, గోండులు, నాయకపోడులు, యానాదులు మొదలైన వారందరి చరిత్ర, సంస్కృతిని తెలియజేసేలా ప్రతిమలు ఉన్నాయి.

ట్రైబల్ మ్యూజియంలో ఇవీ ప్రత్యేకతలు...

- ▲ ప్రధాన ద్వారం నుంచి లోపలికి అడుగుపెట్టగానే ఎదురుగా ఒక పుట్ట, దానిముందు పామును ఆడిస్తున్నట్టుగా ఒక చెంచు గిరిజనుడి ప్రతిమ కనిపిస్తాయి. నాదస్వరంతో సర్పాన్ని ఆడిస్తున్న తీరు చెంచులకు వాటితో గల అనుబంధం, భక్తి, విశ్వాసాలను తెలియజేస్తుంది.
- ▲ రెండో గదిలో ఢంకా బజాయిస్తున్న చెంచు, ఆ చుట్టూ గోడలకు అవజాల, మద్దెల, మృదంగం, తుడుము, విడక, తప్పెట, డోలు, డోల్‌కాడ్, మువ్వలదండు, పిల్లనగ్రోవి, కికిరి, పికిరి, డిర్జిం గోవరాయ్, గుమ్మలం, పత్ర మొదలైన గిరిజన తెగల వారి సంగీత వాయిద్యాలు ఉన్నాయి. మల్లికార్జున స్వామికి ఇష్టమైన వీటిని మహాశివ రాత్రి ఉత్సవాల్లో వివిధ తెగలకు చెందిన గిరిజనులు వాయిస్తుంటారు.
- ▲ మూడో గదిలో చెంచుగుచ్చ ఏర్పాటుచేశారు. చెంచుల ఆభరణాలు, ఆయుధాలు, ఇతర వస్తు సామగ్రి ఇందులో చూడవచ్చు.
- ▲ ఐదో గదిలో రవితార, చిడతలు పట్టి శివకథలను చెబుతున్న దేవచెంచుల బొమ్మ ఉంది. శివపూజ చేసే దేవ చెంచులే కష్టాలకోర్చి శ్రీశైలాన్ని రక్షించినట్లు తెలుస్తోంది. శ్రీశైలంలో ఉన్న చెంచులంతా ఈ దేవ చెంచుల జాతికి చెందినవారే. వీరు వాడే పెరుబాకు, కొడవలి, గొరక, వంకటి తెడ్డు, రోకలి, తేనెబుట్ట, గుండురాయి ఈ గదిలో ఉన్నాయి.
- ▲ తొమ్మిదో గదిలో సోది చెప్పే ఎరుకలసాని కొరవంజి కనపడుతుంది. ఈమె భ్రమరాంబ మల్లికార్జునుల పెళ్లి సంగతి, శ్రీశైలం పెద్ద పట్టణంగా విస్తరించి 12 ఆమడల పట్టణం అవుతుందని సోది చెప్పినట్టు పెద్దలు చెబుతారు. ఈ గదిలో ఎరుకల, యానాదులు ఉపయోగించే వివిధ రకాల వాయిద్య పరికరాలు కూడా ఉన్నాయి. వీటితోపాటు ఎన్నో విశేషాలతో కూడిన ప్రతిమలు సందర్శకులను ఆకట్టుకుంటాయి.

కేసీఆర్‌పై ఏబీఎన్ తప్పుడు కథనాలు

- ఆంధ్రజ్యోతి రాధాకృష్ణపై బీఆర్‌ఎస్ ఫిర్యాదు
- మద్యం కేసులో కేసీఆర్ అరెస్టు.. అంటూ ఏబీఎన్‌లో వార్తలు
- కోర్టు వాదనలే వక్రీకరించిన ఏబీఎన్
- ఈటీవీ సహా 16 చానళ్లపై వివిధ పోలీసు స్టేషన్లలోనూ ఫిర్యాదులు


సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణంలో సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న కేసులో నిరాధార వార్తలతో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు వ్యక్తిత్వాన్ని దిగజార్చేందుకు పూనుకున్నారని ఆరోపిస్తూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్‌తోపాటు మరో ఎనిమిది మందిపై పార్టీ నేతలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో పాటు అవే తరహా వార్తలు ప్రసారం చేసిన ఈటీవీతోపాటు మొత్తం 16 టీవీ, యూట్యూబ్ చానళ్లపై కూడా వివిధ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై ఫిలిమ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో, ఇతర చానళ్లపై బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా మే 28న జరిగిన వాదనల్లో కేసీఆర్ పాత్రను ఆమె ఈడీకి వివరించారని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి స్క్రోలింగ్‌లు, వార్తలు ప్రసారం చేసిందని పేర్కొన్నారు. 'మార్గదర్శి మా నాన్న.. మద్యం కేసులో కేసీఆర్ అరెస్టు' అనే శీర్షికతో ప్రసారం చేసిన వార్తలో.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నాన్న మార్గదర్శకత్వంలో కూతురు పనిచేస్తున్నట్లు ఈడీ తేల్చిందంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్ ప్రసారం చేసిందని వివరించారు. వార్త ప్రసారం అవుతున్న విషయాన్ని తెలుసుకున్న కవిత న్యాయవాది మోహిత్‌రావు.. కోర్టులో జరిగిన వాస్తవ విషయాలపై ప్రకటన విడుదల చేశారన్నారు. ఈ కేసులో మరో నిందితుడు మాగుంట రాఘవ చేసిన వ్యాఖ్యలను కవిత, కేసీఆర్‌కు ఆపాదిస్తూ ఏబీఎన్ వార్తను ప్రసారం చేసిందన్నారు. కేసీఆర్, కవిత, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగా ఉద్దేశపూర్వకంగా అసత్యాలతో కథనాన్ని సృష్టించారని ఆరోపించారు. మరో వైపు న్యాయ విచారణ అంశాలను కూడా ఏబీఎన్ విలేకరులు తప్పుడు వ్యాఖ్యానాలతో తప్పుదోవ పట్టించారని తెలిపారు. తప్పుడు కథనాలతో కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబం, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టను దెబ్బతీశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణ, డైరెక్టర్ భానుకృష్ణ, ఈడీ పి.వెంకటకృష్ణ, సంస్థ ఢిల్లీ ప్రతినిధి కృష్ణ, ఇతర సిబ్బంది సువర్ణ కుమార్, కస్తూరి శ్రీనివాస్, నవీన్‌తో పాటు మొత్తం 9 మందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ

ఈ–కామర్స్, బీఎఫ్ఎస్ఐ, హాస్పిటాలిటీలదే జోరు

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది తొలి 4 నెలల్లో 31 శాతం పెరిగిన జాబ్ పోస్టింగ్స్

- ఉద్యోగ అవకాశాల వృద్ధిలో ముందువరుసలో హైదరాబాద్.. ఆ తర్వాత బెంగళూరు, చెన్నై
- జాబ్స్ అండ్ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ అప్నా.కో అధ్యయనంలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్ : ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో విభిన్నరంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగైనట్టుగా వివిధ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాదితో పోల్చితే మొదటి 4 నెలల్లో 31 శాతం జాబ్ పోస్టింగ్స్ పెరిగినట్టు వెల్లడైంది. ఉద్యోగ అవకాశాల వృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల్లో మంచి అవకాశాలు లభిస్తున్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా ఆర్థికరంగం తిరిగి పుంజుకోవడంతోపాటు, జాబ్ సెక్టార్‌ల పురోగతితో జాబ్ మార్కెట్ పుంజుకుంటున్నదని జాబ్స్ అండ్ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ అప్నా.కో తాజా అధ్యయనం వెల్లడించింది.

- ▲ ఈ–కామర్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), హాస్పిటాలిటీలదే జోరు అని అప్నా.కో నివేదిక వెల్లడించింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఈ–కామర్స్ 21 శాతం, బీఎఫ్ఎస్ఐ 17 శాతం, హాస్పిటాలిటీ రంగాల్లో 13 శాతం మేర ఉద్యోగ అవకాశాలు పెరిగినట్టు తెలిపింది.
- ▲ సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, బ్రాండ్, మార్కెటింగ్, కస్టమర్ సపోర్ట్ డొమైన్‌లలో వృత్తి నిపుణులకు డిమాండ్ గణనీయంగా పెరిగినట్టుగా పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ రంగాల్లో 23 శాతం వృద్ధి నమోదైనట్టుగా, ఆయా రంగాల్లో జాబ్ పోస్టింగ్‌ల విషయంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ముందువరుసలో నిలుస్తున్నట్టుగా తెలిపింది.
- ▲ లక్నవూ, కోయంబత్తూరు, గ్వాలియర్ వంటి రెండో, మూడో శ్రేణి నగరాల్లోనూ డిజిటలైషన్ అమలు చేస్తుండడంతో ఆయా నగరాల్లోనూ జాబ్‌పోస్టింగ్స్ పెరుగుతున్నాయని చెప్పింది.
- ▲ తమ కంపెనీకి సంబంధించినంత వరకు చూసినా గతేడాదితో పోల్చితే ఈ ఏడాది కొత్తగా ఉద్యోగార్థుల (ఫ్రెష్ అప్లికెంట్స్) నుంచి 'జాబ్‌అప్లికేషన్లు' 21 శాతం పెరిగినట్టు, వారిలో మహిళలే 18 శాతం ఉన్నట్టుగా ఈ సంస్థ తెలిపింది. గతేడాదితో పోల్చితే 2024లో జనవరి–ఏప్రిల్‌ల మధ్య జాబ్ అప్లికేషన్స్ 15 శాతం పెరుగుదల నమోదైనట్టు (1.7 కోట్లు పెరుగుదల) అప్నా.కో ఈ నివేదికలో పేర్కొంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ మూకల దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు
- చిత్తూరు మండలంలో ఘటన



తీవ్రంగా గాయపడ్డ గురుమూర్తి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ మూకలు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చిత్తూరు మండలం 36 గొల్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామంలో రాత్రి గంగ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో కలశం మారిందనే సాకు చూపి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పచ్చ మూకలు దాడికి దిగాయి. పథకం ప్రకారం ముందస్తుగా తెచ్చుకున్న ఇనుప రాడ్లు, కొయ్యలతో విచక్షణారహితంగా కొట్టారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గురుమూర్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని గ్రామస్తులు చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురుమూర్తి కారును టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. దాడుల్లో చిత్తూరు నగరానికి చెందిన కొందరు యువకులు కూడా పాల్గొన్నారు. టీడీపీ మూకలు ముందస్తుగానే దాడులకు పథకం రచించారని గ్రామస్తులు చెబుతున్నారు.

మహిళలు ఇంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలరు. అంతకన్నా సమర్థతంగా తమ సత్తా ఏంటో నిరూపించగలరు. అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ తండ్రి అమ్మాలనుకున్న కంపెనీ బాధ్యతలను చేపట్టి కార్పొరేట్ దిగ్గజాలకు దీటుగా ఏడు వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని నిలబెట్టిన మహిళ జయంతి చౌహాన్. ఎవరీమే..? అనేవారికి ఆమె ప్రతిభే ఆమెను పరిచయం చేస్తుంది.

బాధ్యతను సవాల్‌గా తీసుకుంది


జయంతి చౌహాన్

రెండేళ్ల క్రితం వరకు జయంతి చౌహాన్ తనకు నచ్చిన రంగమైన ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన ఓ అంతర్జాతీయ కంపెనీని విజయవంతంగా నడిపిస్తూ ఉండేది. ఆమె తండ్రి భారతీయ బహుళజాతి కంపెనీ అయిన బిస్లరీకి రమేష్ చౌహాన్ చైర్మన్. కూతురిని మొదట ఈ వ్యాపార రంగంలోకి రమ్మని అడిగాడు. కానీ, వ్యాపార రంగంలో ఆసక్తి లేక ఆమె నిరాకరించింది. రమేష్ చౌహాన్ వయసు పై బడుతుండటం, ఎవరి మద్దతూ లేకపోవడంతో కంపెనీని అమ్మాలని పెద్ద పెద్ద కార్పోరేట్ కంపెనీల యజమానులతో చర్చలు జరిపారు. 2022లో చేసిన చర్చలు సఫలం అయ్యాయి. కానీ, డీల్ అమలు కాలేదు. ఆ సమయంలో జయంతి చౌహాన్ తన తండ్రి కంపెనీకి నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చింది. బిస్లరీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కంపెనీలో పెద్ద మార్పు కనిపించింది.

ఫ్యాషన్ ఐకాన్

ఢిల్లీ, ముంబయ్ నగరాలలో జయంతి బాల్యం గడిచింది. ఆ తర్వాత ఫ్యాషన్ రంగం అంటే ఉన్న ఇష్టంతో ఆమె అమెరికాలోని లాస్ ఏంజిల్స్ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి స్టైలింగ్‌లో పట్టా పొందింది. లండన్ కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్‌లో ఫొటోగ్రఫీ, ఫ్యాషన్ స్టైలింగ్‌లో తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. తనదైన స్టైల్ మార్క్‌తో ఫ్యాషన్ ఐకాన్‌గా గుర్తింపు పొందింది. స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ నుంచి అరబిక్‌లో బిఏ కూడా చేసింది.

కొత్త పానీయాల పరిచయం

బిస్లరీ కంపెనీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తనదైన మార్క్‌ను చూపింది. వాటర్ కంపెనీ నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్‌ను పరిచయం చేసింది. ఈ కొత్త ఉత్పత్తులు సంస్థకు మరింత లాభదాయకంగా మారాయి. డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రచారం కూడా ఉత్పత్తి వృద్ధిని పెంచింది. శీతల పానీయాల పరిశ్రమలోని దిగ్గజ కంపెనీలకు బిస్లరీ ప్రవేశం ఓ సవాల్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు భావించేంతగా కృషి జరిగింది. దీంతో టాటా గ్రూప్‌తో డీల్ కుదిరి, మినరల్ వాటర్ బ్రాండ్‌లలో పెట్టుబడులు పెట్టింది. ఇతర కార్పోరేట్ కంపెనీలతో జయంతి చౌహాన్‌కు చెందిన బిస్లరీ ఇంటర్నేషనల్ పోటీ పడుతోంది. జయంతి తన 42 ఏళ్ల వయసులో వైస్ చైర్‌పర్సన్ హోదాతో కంపెనీని దిగ్విజయంగా నడిపిస్తోంది. సేల్స్, మార్కెటింగ్ బృందానికి కూడా నాయకత్వం వహిస్తోంది. వ్యాపార రంగంలో తన నైపుణ్యాలను చూపలేనేమో అని సందేహించి తొలుత వెనకడుగు వేసినా, తండ్రి మీద ప్రేమతో తీసుకున్న బాధ్యతను మరింత దిగ్విజయంగా నడిపిస్తూ కార్పోరేట్ దిగ్గజాలకే ఔరా అనిపిస్తోంది. 'సమస్య మనదే, సవాల్ కూడా మనదే' అని నవ్వుతూ సమాధానమిచ్చే జయంతి లాంటి వ్యక్తులు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తారు.

ఓన్లీ ఉమెన్

వ్యాపారానికి సామాజిక బాధ్యత తోడైతే ఎలా ఉంటుందో చెప్పకనే చెబుతుంది చెన్నైకి చెందిన పంప్‌కిన్ టేల్స్. ఆల్-ఉమెన్ టీమ్ రెస్టారెంట్‌గా ప్రత్యేకతను సాధించిన 'పంప్‌కిన్ టేల్స్' అమ్మాయిలలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించే బడి. చల్లగా చూసే అమ్మ ఒడి. 'పంప్‌కిన్ ఉపాధి ఇవ్వడమే కాదు. ఉత్సాహాన్ని ఇస్తుంది. కొత్త విషయాలు ఎన్నో నేర్చుకునేలా సహాయపడుతుంది' అంటారు ఉద్యోగులు.

వీరి వీరి గుమ్మడి విజయానికి చూపే దారి ఇది


భువనేశ్వరి, రాజేశ్వరి, చింది వరదరాజులు

ఉద్యోగం కోసం తాను ఉంటున్న డార్జిలింగ్ నుంచి గోవాకు వెళ్లాలనుకున్న అనూష మింజ్ విధివశాత్తు చెన్నైకి వచ్చింది. అక్కడి వాతావరణం ఆమెకు బాగా నచ్చింది.

'నా కొలీగ్స్‌తో ఎన్నో విషయాలు చర్చించే అవకాశం దొరికింది' అంటుంది అనూష.

'మహిళలు కేఫ్‌లను నిర్వహించలేరు'లాంటి అపోహలకు అడ్డుకట్ట వేయడం కోసం చింది వరదరాజులు, జె.భువనేశ్వరి, ఆర్. రాజేశ్వరి అనే మహిళలు 2017లో 'పంప్‌కిన్ టేల్స్'ను ప్రారంభించారు. రెస్టారెంట్, బేకరి, కేటరింగ్ విభాగాల్లో మంచి పేరు తెచ్చుకుంది... పంప్‌కిన్ టేల్స్.

టేబుల్స్‌ను సెట్ చేయడం నుంచి కస్టమర్‌లతో ఇంటరాక్ట్ కావడం, ఆర్డర్లు తీసుకోవడం, టేక్ అవేలను రెడీ చేయడం వరకు ఎన్నో పనులు చేస్తుంది ఈ ఆల్-ఉమెన్ టీమ్.

'ఉద్యోగంలో చేరే సమయంలో రెస్టారెంట్‌లో పనికి సంబంధించి వారిలో ప్రాథమిక జ్ఞానం ఉంటుంది. ఆ తరువాత టేబుల్ సెట్ చేయడం నుంచి కమ్యూనికేషన్స్ స్కిల్స్ మెరుగుపరుచుకోవడం వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. ఆ వెంటనే వారిలో ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది' అంటారు కంపెనీ డైరెక్టర్లు భువనేశ్వరి, రాజేశ్వరి.

ఉదాహరణకు 'పంప్‌కిన్' వందమందికి పైగా మహిళల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోంది. రెస్టారెంట్ ప్రారంభమైనప్పుడు షిల్లాంగ్‌కు చెందిన మోనిక వెయిటర్‌గా చేరింది. ఇప్పుడు ఆమె రెస్టారెంట్‌కు సంబంధించిన సమస్త విషయాలలో ప్రావీణ్యం సాధించింది.

'ఎవరి మీదా ఆధారపడకుండా సొంత కాళ్ల మీద నిలబడుతున్నందుకు గర్వంగా ఉంది. మా అమ్మాయి చెన్నైలో పనిచేస్తోంది. నెల నెలా నాకు డబ్బులు పంపిస్తుంది అని నా గురించి అమ్మ గర్వంగా చెప్పుకుంటుంది' అంటుంది మోనిక.

మోనిక ఏదో ఒకరోజు ఎక్కడో ఒకచోట సొంతంగా రెస్టారెంట్ ప్రారంభించవచ్చు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించవచ్చు. స్థూలంగా చెప్పాలంటే 'పంప్‌కిన్ టేల్స్' అనేది అనే ఉపాధి కేంద్రమే కాదు, ఉజ్వల భవిష్యత్‌కు ఉపయోగపడే కేంద్రం కూడా.

బ్యూటిప్స్

మృదువైన చేతులు.. పాదాల కోసం...



- టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు వేసి అందులో తగిన మోతాదులో పాలు లేదా పెరుగు వేసి మరీ గట్టిగా కాకుండా జారుడుగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ని చేతులకు, పాదాలకు పట్టించి పదిహేను - ఇరవై నిమిషాల పాటు ఉంచాలి. ఆ తరవాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చర్మం నుంచి శనగపిండి ప్యాక్‌ను వదిలించిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే చేతులు, పాదాల చర్మం మదువుగా మారుతుంది.
- చేతులు, పాదాల చర్మం గరుకుగా మారినప్పుడు... టీ స్పూన్ నిమ్మరసంలో టీ స్పూన్ చక్కెర కలిపి (చక్కెర పూర్తిగా కరగాల్సిన అవసరం లేదు. గరుకుగానే ఉండాలి), ఆ మిశ్రమాన్ని చేతులకు, పాదాలు పట్టించి పది నిమిషాల తర్వాత వేళ్లతో మర్దన చేయాలి. ఇలా చేస్తే మృతకణాలు తొలగిపోతాయి, చేతులు, పాదాల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. పొడి చర్మం వాళ్లు ఈ ప్యాక్‌లో నాలుగు చుక్కల కొబ్బరి నూనె లేదా బాదం నూనె కలుపుకోవాలి.
- రెండు స్పూన్‌ల నిమ్మరసం లేదా కమలాపండు రసంలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ గ్లిజరిన్, టీ స్పూన్ పన్నీరు కలిపి ఈ మిశ్రమాన్ని చేతులకు, పాదాలకు పట్టించాలి. ఇది రెగ్యులర్ ప్యాక్. చలికాలంలో రోజూ వేసుకోవచ్చు. ఎండాకాలంలో వారంలో రెండుసార్లు సరిపోతుంది.
- చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... కలబంద గుజ్జులో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మ రసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.

సమ్‌థింగ్ స్పెషల్

నీలిరంగు చీరలోన జపాన్‌లో ఒక సందమామ



'రోమ్‌లో రోమన్‌లా ఉండాలి' అంటారు కొందరు. 'అయినా సరే, నేను నాలాగే ఉంటాను' అంటారు కొందరు. రెండో కోవకు చెందిన డిజిటల్ క్రియేటర్, ఎంటర్‌ప్రెన్యూర్ మహిశర్మ వీడియో వైరల్ అయింది. గోల్డెన్ బార్డర్స్ బ్లూ శారీ ధరించి జపాన్‌లోని టోక్యో వీధుల్లో చిద్విలాసంగా నడుస్తున్న ఆమె వీడియో ప్రపంచ వ్యాప్తంగా వ్యూయర్స్ దృష్టిని ఆకర్షించింది. 'ఐ వోర్ ఏ శారీ ఇన్ జపాన్ రియాక్షన్స్ ఆర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో ఏడు మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. వీడియోలో ఆబాలగోపాలం మహిశర్మను ఆశ్చర్యంగా చూస్తున్న, సెల్ఫీలు తీసుకుంటున్న దృశ్యాలు కనిపిస్తాయి.

విడాకుల మహోత్సవం



'మా అమ్మాయి పెళ్లి' అని చెప్పడానికి సంతోషించే తల్లిదండ్రులు విడాకుల విషయం చెప్పడానికి మాత్రం ఇబ్బంది పడతారు. అయితే ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగి అనిల్ కుమార్ మాత్రం 'నరకప్రాయమైన సంసారం కంటే విడాకులే సో బెటర్' అంటున్నాడు.

అనిల్ అల్లుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అత్తింటి వాళ్లు అదనపు కట్నం కోసం రకరకాల బాధలకు గురి చేస్తుంటే తట్టుకోలేక అనిల్ కుమార్తె ఉర్వీ భర్త నుంచి విడాకులు తీసుకుంది. బ్యాండ్ బాజాలతో నిర్వహించిన ఉర్వీ విడాకుల మహోత్సవం వీడియో సామాజిక మాధ్యమాల్లో అందరి దృష్టిని ఆకర్షించింది.

ధన్య ప్రయత్నం

ఈ కేఫ్ చాలా 'స్పెషల్'

'మిట్టి' అంటే మట్టి. ఈ మట్టి మీద పుట్టిన అందరికీ ఈ మట్టి మీద ఉన్న అన్ని ఉపాధుల్లో హక్కు ఉంది. కాని దివ్యాంగులకు చాలా చోట్ల డోర్లు క్లోజ్ అయి ఉంటాయి. అందుకే 24 ఏళ్ల అలినా ఆలమ్ దివ్యాంగుల కోసమే నడిచే, వారే యజమానులుగా మారే కేఫ్‌లను 'మిట్టి కేఫ్' పేరుతో స్థాపించింది. ఇప్పటికి 4000 మంది దివ్యాంగులు ఉపాధి పొందారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు జడ్జీనే ఈ ప్రయత్నాన్ని మెచ్చుకుని సుప్రీంకోర్టు ప్రాంగణంలో మిట్టి కేఫ్‌కు చోటు ఇచ్చారు.



అలినా ఆలమ్ తన టీనేజ్‌లో కోల్‌కటాలోని నానమ్మ దగ్గర పెరిగింది. నానమ్మకు వెన్ను సమస్య వచ్చినప్పటి నుంచి ఆమెకు కదలడం, సొంత పనులు చేసుకోవడం చాలా కష్టమవడం గమనించింది. అది అలినా ఆలమ్ మనసులో ముద్ర పడింది. బెంగళూరుకు చదువుకోవడానికి వచ్చాక చదువులు, ర్యాంకులు అన్నీ అవయవాలు సక్రమంగా ఉన్నవారిని అందలం ఎక్కించేలా ఉన్నాయి కాని ఏ ఉపాధి రంగమూ దివ్యాంగులకు మేము పని ఇస్తాం అనడం కనిపించలేదు. దివ్యాంగులు ఆత్మాభిమానంతో జీవించాలంటే వారికి సానుభూతి కంటే ఉపాధి కల్పించడమే చాలా ముఖ్యం అనుకుంది. 'నేనే దివ్యాంగులకు పని ఇస్తాను' అని నిశ్చయించుకుంది. 'నీ దగ్గర ఏముందని వారికి పని ఇస్తావు?' అని ఫ్రెండ్స్ అడిగారు. 'సంకల్పం ఉంది' అని చెప్పింది అలినా.

2017లో మొదటి కేఫ్

దివ్యాంగులకు పని ఇవ్వడమే కాదు... ఆ పని నలుగురి కంటా పడేలా చేయాలి... వారితో నలుగురూ మాట్లాడేలా ఉండాలి... ఈ ప్రయత్నాన్ని చూసి నలుగురూ తమ తమ రంగాల్లో అలాంటి వారికి పని ఇచ్చేలా ఉండాలి అనేది అలినా ఆలోచన. ఇందుకు 'కేఫ్' తెరవడం సరైనదనిపించింది. అప్పటికి చదువుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న అలినా ఇలాంటి ప్రయత్నానికి అండగా నిలిచే సేవాసంస్థ దేశ్‌పాండే ఫౌండేషన్‌ను కలిసి ఆలోచన చెప్పింది. నిధులు తీసుకుని ఉత్తర కర్నాటకలోని హుబ్లీలో తొలి 'మిట్టి కేఫ్' తెరిచింది. అందుకు ఊరిలో ప్రతి వీధి తిరిగి దివ్యాంగులకు ఉద్యోగం, ఉపాధి అని చెప్పింది. కొందరు సందేహంగా చూశారు. కొందరు అపనమ్మకంతోనే వచ్చారు. నడక వీలుకాని వారు, బధిరులు, అంధులు, మరుగుజ్జులు, గూని బాధితులు... వీరు వచ్చి ఉత్సాహంగా పనిలో జాయిన్ అయ్యారు. మిట్టి కేఫ్‌లో టీ, కాఫీ, శాండ్ విచ్, సాదా సీదా భోజనం దొరికేలా మెనూ తయారు చేసింది అలినా. ఆ మెల్లగా అయినా సరిగ్గా చేయడం నేర్చుకున్నారు. వారికే మొత్తం నిర్వహణ, ఆదాయ పంపకం అప్పజెప్పి మరో మిట్టి కేఫ్ కోసం సాగిపోయింది అలినా.

ఆహ్వానించే ప్రయత్నం

ఒక పని సఫలం కావాలంటే సరిగ్గా వివరించే ప్రయత్నం చెయ్యాలి... ఉద్దేశం పరిశుభ్రంగా ఉండాలి. అలినా ఆలోచన, ఆచరణలో చిత్తశుద్ధి ఉన్నాయి. అందుకే కార్పొరేట్ సంస్థలు, ఎయిర్‌పోర్ట్‌ల యాజమాన్యాలు అందరూ ఆమెను ఆహ్వానించారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్, ముంబై ఎయిర్‌పోర్ట్‌లతో పాటు పెద్ద పెద్ద ఆస్పత్రులలో కూడా మిట్టి కేఫ్‌లు ఏర్పాటయ్యాయి.

'ఇప్పటికి దేశంలో 41 చోట్ల మిట్టి కేఫ్‌లు ఉన్నాయి. ఇవి ఇంకా పెరుగుతాయి. సుప్రీంకోర్టు ప్రాంగణంలో కూడా మాకు చోటు దక్కడం గొప్ప విషయం' అంటుంది అలినా. ఈ కేఫ్‌ల ద్వారా ఇప్పటికి 4000 మంది దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వు వచ్చింది. ఆత్మాభిమానం తొణికిసలాడింది.

వెతికి, శిక్షణ ఇచ్చి

'కేఫ్ పని అయినా శిక్షణ అవసరం. అందుకే నేను దేశంలోని కొన్ని ఎన్‌జీఓలను కాంటాక్ట్ చేసి ఆయా ప్రాంతాల్లోని దివ్యాంగులను గుర్తించేలా చేశాను. అంతే కాదు ఇళ్ల నుంచి తరిమేస్తే రోడ్ల మీద భిక్షాటన చేస్తున్న దివ్యాంగులను కూడా గుర్తించాను. ఒక పట్టణంలో ఒక సమూహం సిద్ధంగా ఉంది అని అర్థమయ్యాక వారికి అక్కడి వ్యక్తుల చేత రెండు నెలల పాటు ట్రయినింగ్ ఇప్పించి మిట్టి కేఫ్‌లు స్థాపిస్తున్నాను. అందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఒకసారి కేఫ్ స్థాపించాక దాని మీద అధికారం ఆ దివ్యాంగులదే' అంటుంది అలినా.

'మా మిట్టి కేఫ్ స్టాఫ్ మిగిలిన రెస్టరెంట్ల స్టాఫ్ అంత వేగంగా పని చేయకపోవచ్చు. చెప్పింది మెల్లగా అర్థం చేసుకోవచ్చు. కాని వారు పని గొప్పగా చేస్తారు. మీరు మెచ్చుకునేలా చేస్తారు' అంటుంది అలినా. వీరు అమ్మే 'కుల్హాద్ చాయ్'కి మంచి డిమాండ్ ఉంది. అన్నట్టు ఇక్కడ మెనూ బ్రెయిలీలో కూడా ఉంటుంది.

ఇలాంటి కేఫ్‌ను ప్రతి ఊరికి ఆహ్వానించండి.



టిప్



పటిక కరిగించిన నీటితో తల స్నానంచేస్తే ఎక్కువగా చెమట పట్టేసమస్య తగ్గడంతోపాటు చుండ్రుబాధ కూడా తగ్గుతుంది.

• కొలెస్ట్రాల్
ఎంత అవసరం? ఎంతకు మించరాదు?



ఆధునిక కాలంలో మనం అనుసరించే జీవనశైలి వల్ల, తినే ఆహారం వల్ల రకరకాల జబ్బులను కొని తెచ్చుకునే వారి సంఖ్య పెరిగిపోతోంది. ముఖ్యంగా గుండె జబ్బులతో బాధపడే వారి సంఖ్య అంతకంతకూ హెచ్చుతూనే ఉంది. హృదయ సంబంధ వ్యాధులకు ప్రధానంగా ఆహార పదార్థాలతోపాటు కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువ ఉండటమూ ఒక కారణం. ఇంతకూ కొలెస్ట్రాల్ శరీరానికి అవసరమేనా? ఇది ఎంత ఉండాలి, ఎంతకంటే ఎక్కువ ఉంటే ప్రమాదం అనే విషయాల గురించి తెలుసుకుందాం.

చెడు కొలెస్ట్రాల్ ఉంటే..?

శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువైతే ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయి. రక్తపోటు, ఊబకాయం, గుండె పోటు, నడుము నొప్పులు, కీళ్ల నొప్పులు, వెన్ను నొప్పులు, కిడ్నీ, మెదడుకు సంబంధించిన సమస్యలు ఎక్కువవుతాయి. మరి మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

అన్ని విషయాల్లో మంచి, చెడూ ఉన్నట్లే.. కొవ్వుల్లోనూ మనకు మేలు చేసేవి, చెడు చేసేవి ఉన్నాయి. చెడు కొవ్వుల్ని ఎల్‌డీఎల్ అని, మంచి కొవ్వుల్ని హెచ్‌డీఎల్ అని పిలుస్తారు. మన రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తక్కువగా/అదుపులో ఉండాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటాం. మరి మన వంట్లో ఉన్న చెడు కొలెస్ట్రాల్ తగ్గడానికి ఏం తినాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందామా?

చెడు కొవ్వు తగ్గడానికి...

● ఉప్పు తగిన మోతాదులో తీసుకోవాలి ● ఎల్‌డీఎల్ అనే చెడు కొవ్వులు.. డెసిలీటర్‌కు 70 మిల్లీ గ్రాములకు మించకూడదు ● మధుమేహం ఉన్నవాళ్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే ఔషధాలు తీసుకోవడం తప్పనిసరి. అపోహలను పక్కనపెట్టి వైద్యుల సూచనలను తప్పక పాటించాలి ● మంచి కొలెస్ట్రాల్ . డెసిలీటర్‌కు 40 మిల్లీగ్రాములు ఉండేలా చూసుకోవాలి ● ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూసుకోవాలి. ఊబకాయం బారిన పడకుండా జాగ్రత్త పడాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి ● తిండిని అదుపులో ఉంచుకోవాలి.

శరీరంలో కొవ్వు పెరగడంలో ఎల్‌డిఎల్‌ది ప్రధాన బాధ్యత. ఇప్పటికే గుండె జబ్బు ఉన్నవారిలో ఎల్‌డిఎల్ స్థాయి 70 మిల్లీ గ్రాము/డిఎల్ కంటే తక్కువ ఉండాలని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి.

హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్ దీనినే మంచి కొలెస్ట్రాల్ అని అంటారు. హెచ్‌డిఎల్ రక్తనాళాల్లోని కొలెస్ట్రాల్‌ను తొలగించి, కాలేయానికి పంపిస్తుంది. ఇక్కడ కొలెస్ట్రాల్ విచ్ఛిన్నం అవుతుంది. హెచ్‌డిఎల్ స్థాయి తక్కువగా ఉందంటే, గుండె రక్తనాళాల వ్యాధి ప్రమాదం పెరుగుతున్నట్లు భావించాలి. గుండెపోటుకు బలమైన కారణం ఎల్‌డిఎల్ పెరగడం కన్నా హెచ్‌డిఎల్ తగ్గడమే. హెచ్‌డిఎల్ పురుషుల్లో 40 ఎంజి/ డిఎల్, మహిళల్లో 50 ఎంజి/డిఎల్ ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

- అల్లం వెల్లుల్లి మిశ్రమాన్ని ప్రతిరోజు వంటల్లో ఉపయోగించడం వల్ల కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించుకోవచ్చు.
- అలాగే గ్రీన్ టీ రోజు తాగడం వల్ల కూడా చెడ్డ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతోపాటు హెచ్‌డీఎల్ స్థాయిని కూడా పెంచుకునే వీలుంది.
- ఇక ధనియాలు.. ఈ గింజల్లో ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఏ, బీటా కెరోటిన్, విటమిన్ సి వంటివి ఉండటం వల్ల కొలెస్ట్రాల్ ప్రభావం తగ్గుతుంది. వీటిని రోజు నేరుగా తినడం అలవాటు చేసుకుంటే మంచిది.
- మెంతులు కూడా కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. వీటిని నేరుగా తినలేము. ఎందుకంటే ఇవి రుచికి చిరు చేదుగా అనిపిస్తాయి. అందువల్ల నానబెట్టుకుని తింటే మంచిది.
- ఇక చివరిగా ఉసిరి. ఇది కొలెస్ట్రాల్ సమస్యకు చక్కని పరిష్కారంగా నిపుణులు సూచిస్తున్నారు. అయితే ఏదైనా సమస్య రాకముందే ఇలాంటివి అలవాటు చేసుకుంటే మంచిదని.. చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చని కూడా చెబుతున్నారు.
- మాంసాహారం పూర్తిగా మానేయాలి. శాకాహారంలో వేపుడు కూరలు తినరాదు. వీటి బదులు ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం మంచిది. అలాగే కొబ్బరి, వేరుశనగలు, నువ్వులు వంటివి తీసుకోవడం వల్ల వీటిలో ఫైబర్‌తోపాటు ఆరోగ్యకరమైన కొవ్వు ఉంటుంది. ఇది మన శరీర నిర్మాణానికి అవసరం.
- వరి, గోధుమ బదులు తృణ ధాన్యాలు, సిరి ధాన్యాలు తింటే కూడా చెడు కొలెస్ట్రాల్ బాగా తగ్గుతుంది.
- అలాగే పళ్ళు, పచ్చి కూరలు తురుముకొని పెరుగులో వేసుకుని తినండి. కీర దోస కాయలు, కారట్, బీట్రూట్, దోసకాయలు, బూడిద గుమ్మడి, సొరకాయ వంటివి తురుముకొని లేదా మిక్సర్ లో వేసి పెరుగులో కలిపి తీసుకుంటే మంచిది.
- పాలకు బదులు పెరుగు, మజ్జిగ తీసుకోండి. పంచదార పూర్తిగా మానేసి తాటి బెల్లం, బెల్లం లేదా తేనె కొద్ది మోతాదులో తీసుకోండి.
- రోజూ ఉదయం మొలకలు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం సలాడ్, పండ్లు తీసుకోండి. ఇలా 30 రోజులు చేయండి. ఉదయం రెండు కిలోమీటర్ల నడక, ప్రాణాయామం చేయాలి.

డ్రై ఫ్రూట్స్ ఎన్ని... ఎలా... తింటున్నారు?

డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే.. షుగర్స్, క్యాలరీలు కూడా ఉంటాయి. కాబట్టి వీటిని 20 గ్రాముల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే నేరుగా తినడం కూడా మంచిది కాదు. కాబట్టి.. డ్రై ఫ్రూట్స్ తినే విధానం, ఏ నట్స్ ఎంత పరిమాణంలో తినాలో తెలుసుకుందాం.

డ్రై ఫ్రూట్స్! ఇవి ఆరోగ్యానికి మంచిదని చాలా మంది సూచిస్తారు. ప్రొటీన్స్, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ ఇవన్నీ ఆరోగ్యం మెరుగ్గా ఉండటానికి కావాల్సినవి. వీటన్నింటిని పొందడానికి డ్రై ఫ్రూట్స్ ఒక ఆప్షన్. అయితే ఇవి ఆరోగ్యానికి మంచిది కదా అని.. ఇష్టమొచ్చినట్టు తినకూడదు. దేనికైనా ఒక పరిమితి ఉంటుంది. అయితే ఎంత పరిమాణంలో తినాలి. ఏ డ్రై ఫ్రూట్స్ ఎన్ని తింటే ఆరోగ్యకరం? డ్రైఫ్రూట్స్‌ను తినడానికి ముందు ఎందుకు నానబెట్టాలి? లాభాలేంటి..?



బాదం... బాదం పప్పులో మోనో శ్యాచురేటెడ్ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండెకి, మెదడుకి, చర్మ ఆరోగ్యానికి మంచిది. అలాగే ఆల్మండ్స్ లో విటమిన్ ఈ, మెగ్నీషియం, పొటాషియం ఉంటాయి. ఇవి రక్తప్రసరణ సక్రమంగా ఉండటానికి సహాయపడతాయి. అలాగే రక్త ప్రసరణ సజావుగా సాగడానికి సహకరిస్తాయి. రోజుకి 4 నుంచి 7 బాదం పప్పులు తినడం వల్ల అన్ని రకాల ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

వాల్ నట్స్... వాల్ నట్స్ పైన ఉండే పెంకు తీయగానే.. ఉండే పప్పు అంత రుచిగా ఉండదు. కానీ.. 90 శాతం యాంటీ ఆక్సిడెంట్స్, ఫెనోలిక్ యాసిడ్స్, టాన్నిన్స్, ఫ్లేవనాయిడ్స్ ఈ స్కిన్ లోనే ఉంటాయట. గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షించడంలో ఇవి చాలా సమర్థంగా పని చేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటిని రోజుకి 3 నుంచి 4 తీసుకోవచ్చు.

కర్జూరం... ఇందులో ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడే న్యూట్రియంట్స్, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. అలాగే ఫ్రక్టోజ్ ఇందులో రిచ్ గా ఉంటుంది. మెటబాలిజం స్థాయి చురుగ్గా ఉండటానికి కర్జూరం ఉపయోగపడుతుంది. వీటిని రోజుకి మీడియం సైజులో ఉండే 1 లేదా రెండు తీసుకుంటే సరిపోతుంది.

పిస్తా... పిస్తా వెల్‌నెస్ కి చిహ్నం. ఇవి బలానికి, ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయి. ఇందులో మిగిలిన డ్రైఫ్రూట్స్ లో కంటే ప్రొటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. వీటిని రోజుకి 20 గ్రాముల కంటే ఎక్కువ తీసుకోకూడదు.

జీడిపప్పు... కమ్మటి రుచిలో ఉండే జీడిపప్పును రెగ్యులర్ గా తినడం వల్ల పిత్తాశయంలో రాళ్లు ఏర్పడకుండా నివారించవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. రోజుకు నాలుగు జీడిపప్పులను తినడం ఆరోగ్యకరమని ఈ అధ్యయనాలు చెబుతున్నాయి.

ఎండుద్రాక్ష... ఎండుద్రాక్షను ఎక్కువ మోతాదులో తిన్నా ఎలాంటి సమస్యా లేదు. ఇందులో విటమిన్ బి, పొటాషియం, ఐరన్ పుష్కలంగా లభిస్తాయి. కాబట్టి రోజుకి గుప్పెడు ఎండుద్రాక్ష తినవచ్చు. అయితే మహిళలు రోజుకి ఒకటిన్నర కప్పు, మగవాళ్లు 2 కప్పుల ఎండుద్రాక్ష తినాలని నిపుణులు సూచిస్తున్నారు.

కాలిన గాయాలకు సత్వర సాంత్వన



వంటింట్లో వేడి వేడి పాత్రలు చేతికి పొరబాటున తగలడం వల్ల కాలిన చోట బొబ్బలు వచ్చి మంట అనిపిస్తుంది. ఈ సమస్య త్వరగా తగ్గాలంటే ఏం చేయాలంటే...

బ్లాక్ టీ: ఈ బ్యాగులను డీప్ ఫ్రిజ్‌లో కాసేపు ఉంచాలి. ఈ బ్యాగులను కాలిన గాయాల మీద ఉంచాలి. బ్లాక్ టీలో ఉండే టానిక్ యాసిడ్ చర్మానికి సాంత్వన అందిస్తుంది. నొప్పి, మంటను తగ్గిస్తుంది.

తేనె: రాత్రిపూట పడుకునే ముందు కాలిన గాయం మీద తేనెను రాయడం వల్ల ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.

పాలు: కాలినచోట పాలు రాస్తే గాయాలు త్వరగా తగ్గుతాయి. అలానే బాగా మంటగా అనిపించినప్పుడు ఫ్రిజ్‌లో పెట్టిన పాలలో దూదిని ముంచి గాయాల మీద పరచాలి. ఇలా చేయడం వల్ల చాలా వేగంగా సాంత్వన చేకూరుతుంది.

మెత్తగా నూరిన పుదీనా ఆకుల గుజ్జుని కాలినచోట పూతలా రాయాలి. తరవాత చల్లని నీళ్లను చల్లి.. పుదీనా పూతను తొలగిస్తే మంట తగ్గుతుంది.

కాలిన చర్మం తెల్లగా అయితే...

నేరేడు చెట్ల ఆకులు తీసుకొని ముక్కలు చేసి బాణలిలో వేసి స్టవ్ మీద పెట్టి నల్లగా బూడిదలాగా అయిన తరువాత జల్లించాలి. దీనిలో నల్లనువ్వుల నూనె వేసి మెత్తగా నూరాలి. సీసాలో భద్రపరచాలి. రోజూ రెండు పూటలా గాయాల మీద లోపలికి ఇంకి పోయేటట్లు పూస్తుంటే తెల్ల మచ్చలు త్వరలోనే చర్మపురంగులో కలిసిపోతాయి.

మీకు తెలుసా?

జ్వరం ఒక వ్యాధి కాదు!



మనం జ్వరాన్ని ఓ వ్యాధిగా చూస్తాం. కాబట్టే జ్వరం రాగానే దాన్ని తగ్గించే మాత్రలు వేసుకోవాలని పొరపడుతూ ఉంటాం. నిజానికి జ్వరం అనేది వ్యాధి కాదు...అది వ్యాధిలో కనిపించే ఓ లక్షణం మాత్రమే! కాబట్టి అలా కనిపించే లక్షణానికి చికిత్స చేయటం మాని అందుకు మూల కారణాన్ని కనిపెట్టి దాన్ని సరిదిద్దే చికిత్స తీసుకోవాలి. ఇందు కోసం తప్పనిసరిగా వైద్యుల్ని ఆశ్రయించాల్సిందే! జ్వరం తగ్గుతూ పెరుగుతున్నా, విడవకుండా రెండు రోజుల కు మించి వేధిస్తున్నా నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ని కలిసి పరీక్షలు చేయించుకుని జ్వరాన్ని కలిగించిన వ్యాధి గురించి తెలుసుకోవాలి. అలా కాకుండా తాత్సారం చేస్తే జ్వర కారక వ్యాధి క్రిములు అంతర్గత అవయవాల మీద దాడిచేసి ఆరోగ్యపరంగా తీవ్ర నష్టం కలిగించవచ్చు

రక్తశుద్ధికి...

● టేబుల్ స్పూన్ నెయ్యి లో పది మిరియాలు వేసి చిన్న మంట మీద వేయించి తర్వాత వడపోసి, మిరియాలు తీసివేయాలి. వీటిని ఆహారంలో మొదటి ముద్దలో కలిపి తినాలి, 40 రోజులపాటు ఇలా చేస్తుంటే రక్తం శుద్ధి అవుతుంది. దీనివల్ల చర్మ వ్యాధులు అన్నీ హరించి వేస్తాయి ● 'ప్లాస్టిక్ వాటర్ బాటిల్ లో, నీళ్ల తాగడం ఆపి కేవలం రాగి పాత్రలో నీళ్ల మాత్రమే తాగండి ● మీకు వచ్చే అన్ని రోగాలు, కొద్ది రోజులలో మటుమాయమవుతాయి.

సినిమా

స్ఫూర్తిదాయక పోరాటం



• కీర్తి సురేష్

రెగ్యులర్ కమర్షియల్ క్యారెక్టర్స్ మాత్రమే కాకుండా... వీలైనప్పుడల్లా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో పవర్‌ఫుల్ క్యారెక్టర్స్ కూడా చేస్తుంటారు హీరోయిన్ కీర్తి సురేష్. 'మహానటి', 'పెంగ్విన్', 'మిస్ ఇండియా' వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో నటించి, ప్రేక్షకులను మెప్పించారు కీర్తి. తాజాగా ఆమె నటించిన ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'రఘు తాత'. కీర్తి సురేష్ లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు సుమన్ కుమార్ దర్శకత్వం వహించారు. 'సలార్, కేజీఎఫ్' వంటి సినిమాలను నిర్మించిన హోంబలే ఫిలింస్ నిర్మించిన తొలి తమిళ సినిమా ఇది. ఈ సినిమాను ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. ''ఈ సినిమా కథ ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేస్తుంది... నవ్విస్తుంది... స్ఫూర్తి కలిగిస్తుంది'' అని పేర్కొన్నారు కీర్తి సురేష్. ఒక సామాజిక అంశంతో ఓ మహిళ చేసే స్ఫూర్తిదాయక పోరాటం నేపథ్యంలో 'రఘు తాత' ఉంటుందని టాక్. తెలుగు, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం రిలీజ్ కానుందట.

విలేజ్... సెట్... గో...



• రామ్‌చరణ్

గెట్... సెట్... గో అంటారు. అయితే రామ్‌చరణ్ విలేజ్... సెట్... గో అంటూ పల్లెటూరికి వెళ్లనున్నారు. విలేజ్‌లో స్పోర్ట్స్ ఆడేందుకు రెడీ అవుతున్నారు రామ్‌చరణ్. ఆయన హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ విలేజ్ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారు. కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రల్లో నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అన్నదమ్ముల్లా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేయనున్నారట. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ ఫిల్మ్ చిత్రీకరణకు రంగం సిద్ధమౌతోంది. ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో విలేజ్ సెట్‌ను రెడీ చేయిస్తున్నారు మేకర్స్. ఈ సెట్ పూర్తి కాగానే ఈ సినిమా చిత్రీకరణ మొదలవుతుంది. మేజర్ షూటింగ్ ఈ విలేజ్ సెట్‌లోనే ప్లాన్ చేశారట. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో రిలీజ్ కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలా ఉంటే... దర్శకుడు బుచ్చిబాబు తండ్రి గురువారం మరణించారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా చిత్రీకరణ కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

ఇక ఆరంభం



• ప్రియాంకా చోప్రా

ఆస్ట్రేలియాలో సముద్రపు దొంగగా మారిపోయారు ప్రియాంకా చోప్రా. న్యూజిల్యాండ్ యాక్టర్ కర్ల్ అర్బన్, ప్రియాంకా చోప్రా లీడ్ రోల్స్‌లో నటిస్తున్న హాలీవుడ్ ఫిల్మ్ 'ది బ్లఫ్'. ఫ్రాంక్ ఈ ఫ్లవర్స్–జో బల్లారిని ద్వయం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పనులు ఆరంభం అయ్యాయని తెలియజేస్తూ, తన ఇన్‌స్టా స్టేటస్‌లో 'ఇట్ బిగిన్స్' అంటూ 'ది బ్లఫ్' సినిమా స్క్రిప్ట్ చదువుతున్నట్లు ఓ పేజీని షేర్ చేశారు ప్రియాంకా చోప్రా. ఈ చిత్రంలో కానర్ అనే పాత్రలో కర్ల్, ఎర్సెల్ అనే పాత్రలో ప్రియాంకా చోప్రా నటిస్తున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఈ సినిమా చిత్రీకరణలోనే ఉన్నారు ప్రియాంకా చోప్రా. ఇక 19వ శతాబ్దంలో ఎర్సెల్ అనే ఓ సముద్రపు దొంగ జీవితం నేపథ్యంతో 'ది బ్లఫ్' సినిమా కథనం సాగుతుంది. కొన్ని కారణాల వల్ల ఎర్సెల్ అనే యువతి సముద్రపు దొంగతనాలు మానేసి, సాధారణ జీవితం గడుపుతుంటుంది. కానీ ఎర్సెల్ సముద్రపు దొంగగా ఉన్న సమయంలో చేసిన పనులు, ఆమె ప్రస్తుత జీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయి? ఆ సమస్యల నుంచి ఎర్సెల్ ఎలా బయటపడింది? అనే అంశాల నేపథ్యంలో 'ది బ్లఫ్' కథనం సాగుతుందని హాలీవుడ్ టాక్. ఇక ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్‌లో నటించిన మరో హాలీవుడ్ ఫిల్మ్ 'హెడ్స్ ఆఫ్ స్టేట్' రిలీజ్‌కు రెడీ అవుతోంది.

సుభద్రలా ఉండలేను! - కృతీ శెట్టి

"మనమే' మూవీ పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ప్రతి సన్నివేశంలో వినోదం ఉంటుంది. అలాగే వండర్‌ఫుల్ కిడ్, పేరెంట్ ఎమోషన్స్ ఉన్నాయి. అది గ్లోబల్ ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా మొత్తం మా ముగ్గురి పాత్రల (శర్వా, కృతి, విక్రమాదిత్య) చుట్టూ తిరుగుతుంది.. అందుకే 'మనమే' అనే టైటిల్ పెట్టాం" అని హీరోయిన్ కృతీ శెట్టి అన్నారు. శర్వానంద్, కృతీ శెట్టి జంటగా నటించిన తాజా చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విక్రమాదిత్య కీలక పాత్ర చేశాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై రామ్‌సీ స్టూడియోస్ ప్రొడక్షన్‌లో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కృతీ శెట్టి పంచుకున్న విశేషాలు...



● 'మనమే'లో నా పాత్ర పేరు సుభద్ర. ఇప్పటివరకూ నేను చేసిన క్యారెక్టర్స్‌కి ఇది వైవిధ్యంగా ఉంటుంది. నేను క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేశాను. కానీ, తొలిసారి 'మనమే'లో చాలా స్ట్రిక్ట్‌గా ఉండే పాత్ర చేశాను. నిజ జీవితంలో నాకు పెద్దగా కోపం రాదు.. గట్టిగా అరవను. చాలా కామ్‌గా ఉంటాను. చెప్పాలంటే సుభద్రలా స్ట్రిక్ట్‌గా ఉండలేను. అందుకే ఈ పాత్ర చేయడం నాకు పూర్తిగా కొత్తగా అనిపించింది. ఈ పాత్ర కోసం డైరెక్టర్ శ్రీరామ్‌గారి విజన్‌ని ఫాలో అయ్యాను.

● నా తొలి మూవీ 'ఉప్పెన'లో బేబమ్మ పాత్రకి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. అయితే ఆ తర్వాత ఆ స్థాయిలో గుర్తింపు రాలేదు. 'ఉప్పెన' రస్టిక్ లవ్ స్టోరీ. 'మనమే' రొమాంటిక్ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. నేను చేసిన సుభద్ర పాత్రలో చాలా భావోద్వేగాలున్నాయి. అది ప్రేక్షకులకి నచ్చుతుందనే ఆశిస్తున్నాను. సినిమా సక్సెస్, ఫెయిల్యూర్ మన చేతుల్లో ఉండదు. నా వరకూ పాత్రకి న్యాయం చేస్తాను. మన చేతిలో లేని విషయాల గురించి ఎక్కువగా ఆలోచించి, ఆందోళన చెందకూడదని ఈ ప్రయాణంలో నేర్చుకున్నాను.

● ప్రస్తుతం తమిళంలో మూడు సినిమాలు, మలయాళంలో ఒక సినిమా చేస్తున్నాను. ఆ కమిట్‌మెంట్స్ వల్లే తెలుగులో గ్యాప్ వస్తోంది. పైగా రొటీన్ పాత్రలు కాకుండా వైవిధ్యంగా ఉన్నవి మాత్రమే చేయాలనుకుంటున్నాను. 'బాహుబలి' చిత్రంలో అనుష్కగారిలా నాకు మహారాణి పాత్ర చేయడం ఇష్టం. అలాగే యాక్షన్, మార్షల్ ఆర్ట్స్ బ్యాక్‌డ్రాప్ రోల్స్ కూడా చేయాలని ఉంది. నాకు వీలు కుదిరినప్పుడు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుంటాను.

జై బోలో కృష్ణ



• అశోక్ గల్లా

సూపర్ స్టార్ కృష్ణ మనవడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో వారణాసి మానస హీరోయిన్. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. శుక్రవారం సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని 'దేవకి నందన వాసుదేవ' మూవీ నుంచి 'జై బోలో కృష్ణ...' అంటూ సాగే రెండో పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి రఘురామ్ సాహిత్యం అందించగా, స్వరాగ్ కీర్తన్ పాడారు. యష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ''భక్తి అంశాలతో కూడిన ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తన బ్యాచ్‌తో కలిసి కృష్ణుడి జన్మాష్టమిని సెలబ్రేట్ చేసుకునే సందర్భంలో 'జై బోలో కృష్ణ...' పాట వస్తుంది. ఈ సినిమా రిలీజ్ డేట్‌ని త్వరలో ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

అప్పుడు నేనూ నవ్వేదాన్ని!



• జాన్వీ కపూర్

క్రికెట్ ప్రాక్టీస్‌లో తనకైన గాయాలను గురించి ట్రోల్ చేసిన ఓ నెటిజన్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు హీరోయిన్ జాన్వీ కపూర్. క్రికెట్ నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. ఈ చిత్రంలో మహేంద్ర పాత్రలో రాజ్‌కుమార్ రావు, మహిమా పాత్రలో జాన్వీ కపూర్ నటించారు. ఈ సినిమా కోసం క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు జాన్వీ. తాను క్రికెట్ ప్రాక్టీస్ చేసిన వీడియోను ఆమె ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేశారు. క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు తనకు గాయాలైనట్లుగా కూడా ఆమె పేర్కొన్నారు. 'టెన్నిస్ బాల్‌తో ఆడితేనే ఇన్ని గాయాలు అయ్యాయా?' అంటూ ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఈ కామెంట్‌పై జాన్వీ కపూర్ స్పందించారు. ''టెన్నిస్ బాల్‌తో ఆడితే గాయాలు ఎలా అవుతాయి? ముందు క్రికెట్ బాల్‌తోనే ఆడాను. అప్పుడు గాయాలు అయ్యాయి. అందుకే టెన్నిస్ బాల్‌తో ఆడాల్సి వచ్చింది. నా భుజాలకు ఉన్న బ్యాండేజీలను చూస్తే మీకు ఆ విషయం అర్థం అవుతుంది. దెబ్బలు తగిలిన తర్వాత ఆడిన వీడియోనే ఇది. ట్రోల్ చేసే ముందు మీరు వీడియో మొత్తం చూసి ఉంటే అప్పుడు మీరు వేసిన జోక్‌కు నేను నవ్వి ఉండేదాన్ని'' అని వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు జాన్వీ కపూర్. ఇక 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' శుక్రవారం (మే 31) విడుదలైంది.

తెలంగాణ తేజం



• రాకేశ్, కేసీఆర్

'జబర్దస్త్' ఫేమ్ రాకింగ్ రాకేశ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్). 'గరుడవేగ' అంజి దర్శకత్వం వహించారు. చరణ్ అర్జున్ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'తెలంగాణ తేజం..' అంటూ సాగే పాటను బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. గోరేటి వెంకన్న రచించిన ఈ పాటని మను, కల్పన, గోరేటి వెంకన్న పాడారు. ''తెలంగాణ తేజం..' పాట అందరిలో ఉత్తేజాన్ని కలిగిస్తుంది'' అన్నారు రాకింగ్ రాకేశ్. ఈ పాట ఆవిష్కరణలో ఎంపీ దీవకొండ దామోదర్ రావు, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్

శనివారం
1-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	76	73,961
నిఫ్టీ ▲	42	22,530

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్డాక్	16,540	▽	196
డోజోన్స్	38,305	▲	193
ఎఫ్టీఎస్ఈ 100	8,275	▲	44
డాక్స్	18,498	▲	1
షాంఘై	3,087	▽	5
నికాయ్	38,488	▲	434

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో


ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	72,115	▽	298
బంగారం (99.5 స్వచ్ఛత)	71,826	▽	297
వెండి (కేజీ)	92,673	▽	1,445

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.85	83.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.76	107.31
€	యూరో	ఎస్‌బీఐ	89.01	91.37
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.39	53.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.23	56.17
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.59	63.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.34	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.81	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.36

అంచనాలకు మించి... వృద్ధి

- క్యూ4లో 7.8 శాతం పురోగతి
- 2023–24లో 8.2 శాతం పరుగు
- ప్రపంచంలో వేగంగా పురోగమిస్తున్న దేశంగా హోదా



భళా.. భారత్

ఎకానమీ దూకుడు

న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ అన్ని వర్గాల అంచనాలకు మించి మంచి ఫలితాన్ని సాధించింది. మార్చితో ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. మార్చి త్రైమాసికంలో ఈ పురోగతి 7.8 శాతంగా రికార్డు అయ్యింది. నాలుగో త్రైమాసికంలో 6.1–6.7 శాతం పరిధిలో వృద్ధి చెందుతుందని పలువురు ఆర్థికవేత్తలు అంచనావేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7.6–7.8 శాతం శ్రేణిలో ఉంటుందన్నది వారి అభిప్రాయం. ఆర్‌బీఐ వృద్ధి అంచనాసైతం 7 శాతంగా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ఫిబ్రవరినాటి తన రెండవ అడ్వాన్స్ అంచనాల్లో 2023–24 వృద్ధి రేటును 7.7 శాతంగా పేర్కొంది. ఈ అంచనాలు, విశ్లేషణలు అన్నింటికీ మించి తాజా ఫలితం వెలువడ్డం గమనార్హం. క్యూ4లో అంచనాలకు మించి (7.8 శాతం) భారీ ఫలితం రావడం మొత్తం ఎకానమీ వృద్ధి (8.2 శాతం) పురోగతికి కారణం. ఎన్ఎస్ఓ శుక్రవారం ఈ మేరకు తాజా గణాంకాలను వెలువరించింది.

5 ట్రిలియన్ డాలర్ల దిశగా అడుగులు

భారత ఆర్థిక వ్యవస్థ 2023–24 జూన్ త్రైమాసికంలో 8.2 శాతం, సెప్టెంబర్ త్రైమాసికంలో 8.1 శాతం, డిసెంబర్ త్రైమాసికంలో 8.6 శాతం పురోగతి సాధించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7 శాతంకాగా, అదే ఆర్థిక సంవత్సరం క్యూ4లో వృద్ధి రేటు 6.2 శాతం. చైనా ఎకానమీ 2024 మొదటి మూడు నెలల్లో 5.3 శాతం పురోగమించడం గమనార్హం. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఎకానమీ ముందుందని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీనితోపాటు భారత్ ఎకానమీ 3.5 ట్రిలియన్ డాలర్ల జోన్‌లో స్థిరపడగా, 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధనకు ముందడుగు పడింది.

ద్రవ్యలోటు కట్టడి

ఆర్థిక వ్యవస్థ గణాంకాలు అంచనాలకు మించి పురోగమించిన నేపథ్యంలో ఎకానమీకి మరో సానుకూల అంశం... ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు పరిస్థితి మెరుగుపడ్డం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 5.8 శాతంగా (జీడీపీ విలువలతో పోల్చి) ద్రవ్యలోటు ఉండాలని కేంద్ర బడ్జెట్ నిర్దేశిస్తుండగా, ఈ అంకెలు మరింత మెరుగ్గా 5.63 శాతంగా నమోదయ్యాయి. విలువల్లో రూ.17.34 లక్షల కోట్లుగా ఫిబ్రవరి 1 బడ్జెట్ అంచనావేస్తే, మరింత మెరుగ్గా రూ.16.53 లక్షల కోట్లుగా ఇది నమోదయినట్లు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ తాజా గణాంకాలు వెల్లడించాయి.

8.2% వృద్ధి ఎలా...

2011–12ను బేస్ ఇయర్‌గా తీసుకుంటూ.. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకు ని స్థిర ధరల వద్ద 2022–23 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ విలువ రూ.160.71 లక్షల కోట్లు. 2023–24లో ఈ విలువ 173.82 లక్షల కోట్లకు ఎగసింది. అంటే ఇక్కడ వృద్ధి రేటు 8.2 శాతం. ఇక ద్రవ్యోల్బణాన్ని ప్రాతిపదికగా తీసుకోకుండా స్థిర ధరల వద్ద వృద్ధి రేటును చూస్తే... ఇది 9.6 శాతం పురోగమించి రూ.269.50 లక్షల కోట్ల నుంచి రూ.295.36 లక్షల కోట్లకు చేరింది.

7.8% పరుగు ఇలా..

ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని క్యూ4లో (2023 క్యూ4తో పోల్చి) ఎకానమీ విలువ రూ.43.84 లక్షల కోట్ల నుంచి రూ.47.24 లక్షల కోట్లకు ఎగసింది. అంటే వృద్ధి 7.8 శాతమన్నమాట. స్థిర ధరల వద్ద ఈ రేటు 9.9 శాతం పెరిగి రూ.71.23 లక్షల కోట్ల నుంచి రూ.78.28 లక్షల కోట్లకు ఎగసింది.

మార్చిలో మౌలిక రంగం 6.2 శాతం వృద్ధి



ఎనిమిది పారిశ్రామిక రంగాలతో కూడిన మౌలిక పరిశ్రమ మార్చిలో 6.2 శాతం పురోగమించింది. సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, విద్యుత్ రంగాల చక్కటి పనితీరు ఇందుకు దోహదపడింది. బొగ్గు, క్రూడ్ ఆయిల్, ఎరువులు, స్టీల్, సిమెంట్ రంగాలు కూడా కలిగిన ఈ గ్రూప్ 2024 మార్చితో 6 శాతం పురోగమించగా, 2023 ఏప్రిల్‌లో 4.6 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో (ఐఐపీ) ఈ గ్రూప్ వెయిటేజ్ 40.27 శాతం.

2024లో వృద్ధి 6.8%: మూడీస్

భారత్ 2024లో 6.8 శాతం వృద్ధి రేటును సాధిస్తుందని రేటింగ్ దిగ్గజం మూడీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. 2025లో ఈ రేటు 6.5 శాతంగా ఉంటుందని విశ్లేషించింది. 2022లో ఎకానమీ 6.5 శాతం పురోగమిస్తే,,, 2023లో 7.7 శాతానికి ఎగసిందని తెలిపింది.



మోదీ ప్రభుత్వం 3.0లోనూ వృద్ధి వేగం కొనసాగుతుంది

ప్రపంచంలోని దిగ్గజ ఎకానమీలో భారత్ జీడీపీ వృద్ధి తీరు విశేషమైనది. మోదీ ప్రభుత్వం 3.0లోనూ ఇదే వృద్ధి వేగం కొనగుతుంది. 2023–24లో తయారీ రంగం 9.9 శాతం పురోగమించడం ప్రత్యేకమైన అంశం. 2014కి పూర్వం యూపీఏ ప్రభుత్వం హయాంలో అవినీతితో మొండి బకాయిల కుప్పగా మారిన బ్యాంకింగ్ రంగాన్ని వివిధ సంస్కరణలతో మోదీ ప్రభుత్వం టర్నెరౌండ్ చేసి, వృద్ధి బాటలో పరుగులు తీయిస్తోంది. 2014–23 మధ్య బ్యాంకులు రూ. 10 లక్షల కోట్ల మేర మొండిబాకీల రికవరీ జరిగింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 1,105 బ్యాంక్ ఫ్రాడ్ కేసులను దర్యాప్తు చేసి రూ. 64,920 కోట్ల మొత్తాన్ని అటాచ్ చేసింది.

– మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో నిర్మలా సీతారామన్

ఆర్బిక్యులర్ ఫార్మాలో టాటా క్యాపిటల్ పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ ఆర్బిక్యులర్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీస్‌లో టాటా క్యాపిటల్ హెల్త్‌కేర్ ఫండ్–2 పెట్టుబడి చేసింది. డీల్ విలువ రూ.167 కోట్లు. ఉత్పత్తుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగిస్తారని టాటా క్యాపిటల్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-6-2024 ఫామ్ ధర...	
విశాఖ	500–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	490–00
హైదరాబాద్	505–00

అయిదు రోజుల అమ్మకాలకు బ్రేక్

- ఎగ్జిట్ పోల్స్ వైపు ఇన్వెస్టర్ల చూపు
- స్వల్ప లాభాలతో గట్టెక్కిన సూచీలు

ముంబై: దేశీయ జీడీపీ గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు సానుకూలంగా స్పందించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. నేడు(శనివారం) ఎగ్జిట్ పోల్స్, వచ్చే మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అప్రమత్తత కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 76 పాయింట్లు పెరిగి 73,961 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 42 పాయింట్లు బలపడి 22,530 వద్ద నిలిచింది. దీంతో సూచీల అయిదురోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఇటీవల వరుస పతనంలో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన బ్యాంకులు, ఫైనాన్స్, మెటల్ ఇంధన, కన్జూమర్, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 593 పాయింట్లు బలపడి 74,479 వద్ద, నిఫ్టీ 165 పాయింట్లు పెరిగి 22,654 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. నెలాఖరున



డాలర్లకు డిమాండ్ పెరగడంతో దేశీయ కరెన్సీ ఆరంభ నష్టాలు కోల్పోయింది. అమెరికా బ్రోకరేజ్ సంస్థ జెఫ్ఫారీస్ 'బై' రేటింగ్‌తో అదానీ షేర్లు భారీగా పెరిగాయి.

డాలర్ మారకంలో 13 పైసలు బలహీనపడింది 83.42 స్థాయి వద్ద స్థిరపడింది.

భారత్‌కు 100 టన్నుల బంగారం

- బ్రిటన్ నుంచి దేశీ ఖజానాకు తరలించిన ఆర్‌బీఐ
- 1991 పసిడి తనఖా తర్వాత ఈ స్థాయిలో తరలింపు ఇదే ప్రథమం

ముంబై: బ్రిటన్ వాల్టుల్లో భద్రపర్చిన 100 టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్ దేశీ ఖజానాకు తరలించింది. 1991లో భారత్ విదేశీ మారక సంక్షోభాన్ని అధిగమించేందుకు పసిడిని తాకట్టు పెట్టిన అనంతరం ఇంత పెద్ద ఎత్తున బంగారాన్ని తరలించడం ఇదే ప్రథమం అని సంబంధిత వర్గాలు తెలిపాయి. బ్రిటన్ నుంచి బంగారం తరలింపు విషయంలో ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ, ఇతరత్రా ఏజెన్సీలు చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు, అత్యంత విలువైన



లావాదేవీ కావడంతో చాలా గోప్యత పాటించినట్లు వివరించాయి. రవాణా సౌలభ్యం తదితర అంశాలు పసిడి తరలింపునకు కారణమని పేర్కొన్నాయి. ప్రస్తుతం దేశీయంగా ముంబై, నాగ్‌పూర్‌లో పటిష్టమైన వాల్టుల్లో బంగారాన్ని నిల్వ చేస్తున్నారు. తాజా పరిణామంతో దేశీయంగా భద్రపర్చిన మొత్తం పసిడి పరిమాణం 408 టన్నులకు చేరింది. అధికారిక గణాంకాల ప్రకారం 2024 మార్చి ఆఖరు నాటికి భారత్ వద్ద మొత్తం 822 టన్నుల బంగారం ఉంది. ఇందులో సుమారు 413.79 టన్నులు విదేశీ వాల్టుల్లో ఉన్నాయి. గత కొన్నాళ్లుగా గణనీయంగా పసిడి కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో విదేశాల్లో దాన్ని నిల్వ చేయడాన్ని తగ్గించుకోవాలని భారత్ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

తగ్గనున్న వ్యయాలు..

ఆర్థిక అస్థిరతలను ఎదుర్కొనడానికి దేశాలు కొన్న బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ మొదలైన వాటి వాల్ట్‌లలో సురక్షితంగా నిల్వ చేస్తుంటాయి. ఇందుకు కొంత చెల్లిస్తుంటాయి. తాజాగా బంగారాన్ని మన దేశానికి తరలించి, ఇక్కడే నిల్వ చేయడం వల్ల విదేశీ కస్టోడియన్లకు చెల్లించాల్సిన స్టోరేజీ ఫీజుల భారాన్ని ఆర్‌బీఐ తగ్గించుకోగలుగుతుంది.

సాక్షి స్పోర్ట్స్



అరుంధతి రెడ్డి పునరాగమనం

దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టుతో ఈనెలలో జరిగే వన్డే, టెస్టు, టి20 సిరీస్‌లలో పాల్గొనే భారత జట్లను ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన పేస్ బౌలర్ అరుంధతి రెడ్డి మూడేళ్ల తర్వాత భారత జట్టులోకి పునరాగమనం చేసింది. 2018 నుంచి 2021 మధ్యకాలంలో భారత జట్టు తరఫున 26 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడిన అరుంధతి 18 వికెట్లు పడగొట్టింది. ఆ తర్వాత ఆమె జట్టులో స్థానం కోల్పోయింది. ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్‌లో, ఇంటర్ జోనల్ దేశవాళీ టోర్నీలో రాణించిన అరుంధతి మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చింది. అయితే ఈసారి అరుంధతిని కేవలం టి20 ఫార్మాట్‌లోనే కాకుండా టెస్టు, వన్డే ఫార్మాట్‌లలో కూడా భారత జట్టులోకి ఎంపిక చేశారు.

పోరాడి ఓడిన సహజ



సాంటో డొమింగో ఓపెన్ ఐటీఎఫ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో తెలంగాణ టెన్నిస్ ప్లేయర్ సహజ యామలపల్లి 3-6, 6-3, 6-7 (5/7)తో కేథరీన్ (అమెరికా) చేతిలో ఓటమి పాలైంది.

నిశాంత్ దేవ్‌కు పారిస్ 'టికెట్'

ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత బాక్సర్



బ్యాంకాక్: భారత బాక్సర్ నిశాంత్ దేవ్ పారిస్ విమానం ఎక్కనున్నాడు. ప్రతిష్టాత్మక విశ్వ క్రీడలకు అతను అర్హత సంపాదించాడు. మెగా ఈవెంట్‌కు ఆఖరి అర్హత టోర్నీ అయిన 'వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్'లో నిశాంత్ పురుషుల 71 కేజీల విభాగంలో సెమీఫైనల్ చేరడం ద్వారా బెర్త్ దక్కించుకున్నాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో అతను 5–0తో వాసిల్ సెబొటరి (మాల్డోవా)పై ఏకపక్ష విజయం సాధించాడు. మహిళల 60 కేజీల క్వార్టర్స్‌లో అంకుశిత 2–3తో అగ్నెస్ (స్వీడన్) చేతిలో ఓడి... అరుంధతి 1–4తో జెస్సికా (స్లొవేకియా) చేతిలో ఓడి ఒలింపిక్స్‌కు దూరమయ్యారు. పురుషుల 51 కేజీల ప్రిక్వార్టర్స్‌లో భారత స్టార్ బాక్సర్ అమిత్ పంఘాల్ 5–0తో కిమ్ ఇంక్యూ (కొరియా)పై గెలిచి 'పారిస్'కు అడుగు దూరంలో ఉన్నాడు. 57 కేజీల క్వార్టర్స్‌లో సచిన్ సివాచ్ 4–1తో శామ్యూల్ కిస్తోహరీ (ఫ్రాన్స్)పై గెలిచి సెమీస్ చేరాడు. ఈ వెయిట్ కేటగిరీలో మూడు బెర్త్‌లు మాత్రమే ఉండటంతో సచిన్ ఫైనల్ చేరాలి లేదంటే 'బాక్స్ ఆఫ్' బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాడు. పురుషుల 92 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత బాక్సర్ సంజీత్ 0–5తో అల్ఫోన్సో (అజర్‌బైజాన్) చేతిలో ఓడిపోయాడు.

సన్నాహక సమయం

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్

రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

న్యూయార్క్: టి20 వరల్డ్ కప్‌లో అసలు సమరానికి ముందు ఏకైక సన్నాహక మ్యాచ్ కోసం భారత జట్టు సిద్ధమైంది. నేడు జరిగే 'వామప్' పోరులో బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడుతుంది. లీగ్ దశలో తమ తొలి మూడు మ్యాచ్‌లు ఆడే నాసా కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలోనే రోహిత్ బృందం ఈ మ్యాచ్ ఆడనుంది. కొత్తగా నిర్మించిన ఈ స్టేడియం పిచ్‌తో పాటు అటు వాతావరణంపై కూడా ఒక అంచనాకు వచ్చేందుకు ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. స్థానిక కాలమానం ప్రకారం మ్యాచ్‌లు ఉదయం 10:30 గంటలకు ప్రారంభం అవుతాయి. అందువల్ల అలాంటి స్థితికి అలవాటు పడటం చాలా ముఖ్యం. ఈ నేపథ్యంలో ఏకైక వామప్ మ్యాచ్ కీలకం కానుంది. మ్యాచ్‌కు ముందు శుక్రవారం ఆటగాళ్లు చివరి నెట్ సెషన్‌లో పాల్గొన్నారు. అంతకుముందు రోహిత్ శర్మ ఈనెలలో జరిగే విఖ్యాత బాస్కెట్‌బాల్ లీగ్ ఎన్‌బీఏ ఫైనల్స్‌లో విన్నర్స్ జట్టుకు ఇచ్చే ట్రోఫీతో, టి20 వరల్డ్‌కప్‌తో ఫొటో సెషన్‌లో పాల్గొన్నాడు.

అందరూ బరిలోకి...

వామప్ మ్యాచ్ కావడంతో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఆటగాళ్లందరినీ పరీక్షించేందుకు భారత్‌కు అవకాశం ఉంది. 15 మంది సభ్యుల టీమ్‌లో విరాట్ కోహ్లి మాత్రం శుక్రవారం ఆలస్యంగా చేరాడు. అయితే అతను ఈ మ్యాచ్‌లో ఆడేది సందేహంగానే ఉంది. దాంతో కోహ్లి మినహా ఇతర కూర్పుపై టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టి పెట్టనుంది. ఐపీఎల్ కారణంగా అంతా మ్యాచ్ ప్రాక్టీస్‌లోనే ఉన్నారు. జట్టులోని సభ్యులంతా తమ టీమ్‌లలో రెగ్యులర్‌గా దాదాపు అన్ని మ్యాచ్‌లు ఆడారు.



టి20 ప్రపంచకప్, ఎన్‌బీఏ విన్నర్స్ ట్రోఫీలతో భారత కెప్టెన్ రోహిత్ శర్మ

ప్రధాన టోర్నీలో యశస్వి జైస్వాల్‌ను తుది జట్టులోకి తీసుకోవడం, బుమ్రాకు తోడుగా రెండో పేసర్‌గా ఎవరికి అవకాశం కల్పించాలనేదానిపై మేనేజ్‌మెంట్ ప్రధానంగా దృష్టి పెడుతోంది. రెండో పేసర్‌గా సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఒకరికే అవకాశం దక్కుతుంది. మరోవైపు బంగ్లాదేశ్ టీమ్ పరిస్థితి గొప్పగా లేదు. ఇటీవలే అనూహ్యంగా అమెరికా జట్టు చేతిలో 1–2తో బంగ్లాదేశ్ టి20 సిరీస్ కోల్పోయింది. పైగా ఈ టోర్నీలో బలమైన 'డి' గ్రూప్‌లో ఆ జట్టు ఉంది. ఈ నేపథ్యంలో ప్రాక్టీస్ మ్యాచ్‌తో కాస్త ఆత్మవిశ్వాసం ప్రోదిచేసుకోవడంపై బంగ్లాదేశ్ బృందం దృష్టి సారించింది.

> గతంలో ఎప్పుడూ ఇక్కడ ఆడలేదు కాబట్టి ముందుగా మేం పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. జూన్ 5న ఇక్కడ తొలి మ్యాచ్ ఆడే సమయానికి ఏదీ కొత్తగా అనిపించకుండా ఉండటం ముఖ్యం. డ్రాప్ ఇన్ పిచ్‌కు అలవాటు పడటం కూడా కీలకం. ఒక్కసారి లయ అందుకుంటే అంతా సజావుగా సాగిపోతుంది. కొత్త వేదిక చాలా బాగుంది. మైదానమంతా ఓపెన్‌గా ఉండటంతో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. న్యూయార్క్ వాసులు ఇక్కడ తొలిసారి జరుగుతున్న వరల్డ్‌కప్‌లో ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. అభిమానుల తరహాలోనే మేం కూడా మ్యాచ్‌ల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాం. టోర్నీ బాగా జరుగుతుందని ఆశిస్తున్నా. –రోహిత్ శర్మ, భారత కెప్టెన్

గాయత్రి-ట్రెసా జోడీ మరో సంచలనం

ప్రపంచ ఆరో ర్యాంకర్ జంటపై విజయం • సింగపూర్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి

సింగపూర్: భారత మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ భవిష్యత్‌కు భరోసా ఇస్తూ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో మరో సంచలనం సృష్టించింది. గురువారం ప్రపంచ రెండో ర్యాంక్ జంటను బోల్తా కొట్టించిన గాయత్రి–ట్రెసా శుక్రవారం ప్రపంచ ఆరో ర్యాంక్ జోడీని ఇంటిదారి పట్టించింది. 79 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 30వ ర్యాంక్ ద్వయం గాయత్రి–ట్రెసా 18–21, 21–19, 24–22తో కిమ్ సో యెంగ్–కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా) జోడీని ఓడించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ గెలుపుతో గత ఏడాది ఆసియా క్రీడల్లో ఈ కొరియా జోడీ చేతిలో ఎదురైన ఓటమికి భారత జోడీ బదులు తీర్చుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో నాలుగో సీడ్ నమి మత్సుయామా–చిహారు షిదా (జపాన్)లతో గాయత్రి–ట్రెసా తలపడతారు. కొరియా ద్వయంతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా ఓటమి అంచుల్లో నుంచి పుంజుకున్నారు. తొలి గేమ్ కోల్పోయి, రెండో గేమ్‌లో 12–18తో వెనుకబడిన గాయత్రి–ట్రెసా వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి ఆధిక్యాన్ని 17–18కి తగ్గించారు. ఆ తర్వాత కొరియా ద్వయం ఒక పాయింట్ సాధించగా... ఆ వెంటనే గాయత్రి–ట్రెసా వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి గేమ్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచారు. నిర్ణాయక మూడో గేమ్‌లో పూర్తి సమన్వయంతో ఆడిన గాయత్రి–ట్రెసా కీలకదశలో పాయింట్లు నెగ్గి మరో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నారు.



వైశాలి విజయం... హంపి పరాజయం

స్టావెంజర్: నార్వే చెస్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి తన జోరు కొనసాగిస్తోంది. నాలుగో రౌండ్ గేమ్‌లో వైశాలి 54 ఎత్తుల్లో పియా క్రామ్లింగ్ (స్వీడన్)పై గెలిచింది. ఆరుగురు గ్రాండ్‌మాస్టర్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్ తర్వాత వైశాలి 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారత నంబర్‌వన్ కోనేరు హంపి 55 ఎత్తుల్లో అనా ముజిచుక్ (ఉక్రెయిన్) చేతిలో ఓడిపోయింది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో వైశాలి తమ్ముడు, భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద నాలుగో రౌండ్‌లో 65 ఎత్తుల్లో హికారు నకమురా (అమెరికా) చేతిలో ఓడిపోయాడు.





స్వియాటెక్ సులువుగా...

- ప్రిక్వార్టర్స్‌లోకి టాప్ సీడ్
- మూడో సీడ్ కోకో గాఫ్ కూడా

పారిస్: రెండో రౌండ్‌లో ఓటమి అంచుల్లో నుంచి గట్టెక్కిన పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ మూడో రౌండ్‌లో మాత్రం అలవోకగా గెలిచింది. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరుసగా ఆరో ఏడాది ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ఇప్పటికే ఈ టోర్నీలో మూడుసార్లు విజేతగా నిలిచిన స్వియాటెక్ శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో 6–4, 6–2తో మేరీ బుజ్కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. టాప్ సీడ్ హోదాలో బరిలోకి దిగిన ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్ ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. 34 విన్నర్స్ కొట్టిన ఆమె కేవలం ఎనిమిది అనవసర తప్పిదాలు చేసింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–2, 6–4తో డయానా యెస్ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్)పై, ఐదో సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–1, 6–3తో చోల్ పాక్వెట్ (ఫ్రాన్స్)పై, ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6–4, 7–6 (7/5)తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు.

సినెర్ ముందంజ...

పురుషుల సింగిల్స్ విభాగంలో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ (ఇటలీ) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. సినెర్ మూడో రౌండ్‌లో 6–4, 6–4, 6–4తో కొటోవ్ (రష్యా)ను ఓడించాడు. ఆరో సీడ్ రుబ్లెవ్ (రష్యా) మాత్రం మూడో రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అర్నాల్డి (ఇటలీ) 7–6 (8/6), 6–2, 6–4తో రుబ్లెవ్‌ను ఇంటిదారి పట్టించాడు.

బాలాజీ జోడీ గెలుపు

పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)–మిగెల్ వరేలా (మెక్సికో) జోడీ రెండో రౌండ్‌కు చేరింది. తొలి రౌండ్‌లో బాలాజీ–వరేలా ద్వయం 6–3, 6–4తో రీస్ స్టాల్‌డెర్ (అమెరికా)–సెమ్ వీర్‌బీక్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 3–6, 6–7 (5/7)తో జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా)–సఫీయులిన్ (రష్యా) జంట చేతిలో ఓడిపోయింది.


మళ్లీ ఓడిన పాక్... ఇంగ్లండ్‌దే టి20 సిరీస్

లండన్: టి20 ప్రపంచకప్‌కు ముందు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్తాన్‌కు నిరాశే ఎదురైంది. నాలుగు టి20ల ద్వైపాక్షిక సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు వర్షార్పణం కాగా... రెండు మ్యాచ్‌ల్లోనూ ఆతిథ్య ఇంగ్లండ్ గెలిచి సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. చివరిదైన నాలుగో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. మొదట పాక్ 19.5 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. ఉస్మాన్ ఖాన్ (21 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ బాబర్ ఆజమ్ (22 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. వుడ్, ఆదిల్ రషీద్, లివింగ్‌స్టోన్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం ఇంగ్లండ్ 15.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి నెగ్గింది. సాల్ట్ (24 బంతుల్లో 45; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ బట్లర్ (21 బంతుల్లో 39; 7 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 6.2 ఓవర్లలోనే 82 పరుగులు జోడించారు. బెయిర్‌స్టో (16 బంతుల్లో 28 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు), జాక్స్ (18 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. రవూఫ్‌కు 3 వికెట్లు దక్కాయి.



క్లుప్తంగా...

సీపీటీ టెస్టుకు దరఖాస్తు చేసుకోండి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (సీపీటీ)కు దరఖాస్తు చేసుకోవాలని ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీ నుంచి 14వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, గ్రేడ్-1, 2 వీఆర్వోలు, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులతో పాటు 2014 మే 12 తర్వాత పలు విభాగాల్లో కారుణ్య నియామకాల్లో చేరిన వారు పరీక్షకు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు www.psc.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, త్వరలో పరీక్ష షెడ్యూల్‌ను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.34 లక్షలకు టోకరా

పోలీసులను ఆశ్రయించిన ఓ బ్యాంకు మహిళా ఉద్యోగి



మార్కాపురం: ఆన్‌లైన్ ట్రేడింగ్ ఉచ్చులో పడి ఓ బ్యాంకు మహిళా ఉద్యోగి రూ.34 లక్షలు పోగొట్టుకున్న ఘటన మార్కాపురం పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మార్కాపురం పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగికి నెలన్నర కిందట ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్ లింకు ద్వారా ఆమె యూపీఐ విధానంలో పలు దఫాలుగా రూ.34 లక్షల వరకు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడిగా పెట్టారు. ఇటీవల ఆమె తాను పెట్టిన పెట్టుబడి గురించి ఆరా తీశారు. అది ఫ్రాడ్ కంపెనీ అని తేలడంతో మోసపోయినట్లు గ్రహించారు. దీనిపై స్థానిక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మార్కాపురం పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని తెలియజేయండి..

గవర్నర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వినతిపత్రం



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై వివరాలు ప్రకటించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ సహచరులతో కలిసి శుక్రవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆర్బీఐ ద్వారా, వివిధ కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పుల వివరాలు మొత్తం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ద్వారా గవర్నర్ తెప్పించుకుని తమకు అవగాహన కల్పించాలని కోరినట్టు చెప్పారు. ఆయా అప్పులకు తోడు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిల వివరాలతో పాటు, ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టడం ద్వారా తెచ్చిన అప్పుల వివరాలు, ఎన్నికల అనంతరం కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్స్ వివరాలు, ప్రభుత్వ ఉద్యోగులు ఇతర ప్రావిడెంట్ ఫండ్స్ నుంచి, ఆర్థిక సంస్థల నుంచి తెచ్చిన అప్పుల వివరాలు, ప్రభుత్వ ఉద్యోగులకు టీఏ, డీఏ రూపంలో ఎంత బకాయిలు చెల్లించాలి, ఈ సంవత్సరం సంక్షేమ పథకాలకు ఇంకా ఎంత నిధులు చెల్లించాల్సి ఉంది.. తదితర వివరాలు కావాలని గవర్నర్‌ను కోరినట్టు తెలిపారు. నిధుల చెల్లింపులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న కేసుల వివరాలను కోరినట్టు తెలిపారు.

సహాయ నటిపై లైంగిక దాడి

నటుడి కారు డ్రైవర్, మరో ఐదుగురి అరెస్ట్

అన్నానగర్ (చెన్నై): చెన్నైలోని వలసరవాక్కంలో ఇంట్లోకి చొరబడి సహాయ నటిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ నటుడి కారు డ్రైవర్ సహ ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన 30 ఏళ్ల యువతి టీవీ సీరియల్స్‌లో సహాయ నటిగా నటిస్తోంది. భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె చెన్నై వలసరవాక్కంలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. ఆమె బంధువు పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లడంతో గురువారం ఆమె ఒక్కత్తే ఇంట్లో ఉంది. ఓ సినీ నటుడి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న మురుగేశన్ మరో ఐదుగురితో కలిసి గురువారం రాత్రి ఆమె ఇంట్లోకి చొరబడ్డాడు. ఇద్దరిని ఇంటి బయట కాపలా పెట్టి మురుగేశన్ సహాయ నటిపై లైంగిక దాడికి పాల్పడి పరారయ్యాడు. సహాయ నటి ఫిర్యాదు మేరకు వలసరవక్కం పోలీసులు కేసు నమోదు చేశారు. మురుగేశన్ (27)ను, అతనితో పాటు వచ్చిన కల్యాణకుమార్ (28), అరుణ్‌పాండి (23), మారియప్ప (23), పెరియనంబిరాజ్ (27), ముప్పిడాది (26)ని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

చల్లని రేయే వేడెక్కెనులే!

పట్టణీకరణ ప్రభావంతో పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు ● భారత నగరాల్లో 60 శాతం వేడి రాత్రులే



2050 నాటికి పట్టణాల్లో 80 కోట్ల మంది

పెరిగిన మానవ కార్యకలాపాలు, వాహన ఉద్గారాలు, పారిశ్రామిక ఉత్పత్తి అధిక స్థాయిలో గ్రీన్‌హౌస్ వాయువులకు దోహదం చేస్తున్నాయి. ఇవి పట్టణాల్లో పగటితో పాటు రాత్రిళ్ల వేడిమిని మరింత పెంచుతున్నాయి. ఇదిలా ఉంటే 2050 నాటికి దేశ జనాభాలో పట్టణ జనాభా 68 శాతానికి చేరుతుందని అధ్యయనం పేర్కొనడం మరింత ఆందోళన కలిగించే అంశం. వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (డబ్ల్యూఆర్ఐ) ఇండియా రాస్ సెంటర్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఏడుగురు 2050 నాటికి పట్టణ ప్రాంతాల్లో నివసిస్తారని అంచనా. ప్రస్తుతం దేశ జనాభాలో 36 శాతం అంటే దాదాపు 40 కోట్ల మంది పట్టణ ప్రాంతాల్లో ఉంటే.. ఇది 2050 నాటికి 80 కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. ఇది రాత్రి వేడిమి మరింత పెరగడానికి దోహదం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరాల్లోనూ పచ్చదనం పెంపు ద్వారా పగటి వేడిని నిరోధించవచ్చని, రాత్రిపూట వేడిని నిరోధించడానికి ఈ విధానం పనికిరాదని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. పట్టణాల్లో ఎక్కడ చూసినా భారీ భవంతులు, తారు, సిమెంట్ రోడ్లతో కాంక్రీట్ జంగిల్‌గా మారిపోవడం, చెరువులు కనుమరుగు కావడంతో రాత్రిపూట నగరాలు అస్సలు చల్లబడట్లేదని న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదిక సైతం వెల్లడించడం గమనార్హం.

రాత్రుళ్లు వేడెక్కుతున్న నగరాలు ఇవే..

నగరం	ఉష్ణోగ్రతలో పెరుగుదల (డిగ్రీల్లో..)
అహ్మదాబాద్	1.06
జైపూర్	1.02
రాజ్‌కోట్	0.94
ఢిల్లీ ఎన్‌సీఆర్	0.90
పూణే	0.90
లక్నో	0.89
ఆగ్రా	0.81
బెంగళూరు	0.81
నాసిక్	0.78
హైదరాబాద్	0.75

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా పెరుగుతున్న పట్టణీకరణ కారణంగా చల్లని రాత్రులు కరువవుతున్నాయి. రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దేశంలోని 140కి పైగా భారత నగరాల్లో 60 శాతానికి పైగా రాత్రులు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు భువనేశ్వర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బృందం జరిపిన తాజా అధ్యయనంలో తేలింది. నేచర్ సిటీస్ జర్నల్‌లో ప్రచురించిన ఈ అధ్యయనం ప్రకారం.. రాత్రిళ్ల పెరుగుతున్న వేడిమి వర్షపాతం, కాలుష్యంతో సహా వాతావరణంలోని ఇతర అంశాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అహ్మదాబాద్, జైపూర్, రాజ్‌కోట్ నగరాలు తీవ్ర పట్టణ ప్రభావ రాత్రులను అనుభవిస్తున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, పూణే ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దక్షిణాదిలో హైదరాబాద్, బెంగళూరు నగరాలకు కూడా వేడి రాత్రుల తాకిడి బాగానే ఉంది.

అర్బన్ హీట్ ఐలాండ్‌కు పట్టణీకరణే కారణం

అర్బన్ హీట్ ఐలాండ్‌కు విపరీతమైన పట్టణీకరణే ప్రధాన కారణంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకంటే పట్టణాల్లోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు గుర్తించారు. పట్టణీకరణలో భాగంగా కాంక్రీటు, తారు (రోడ్లు, పేవ్‌మెంట్లను నిర్మాణాలతో) ఉపరితలాలు పగటిపూట వేడిని గ్రహించి నిల్వ చేసి, సాయంత్రం ఆ వేడిమిని తిరిగి బయటకు విడుదల చేస్తాయి. తద్వారా రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్టు అధ్యయనం పేర్కొంది. గత రెండు దశాబ్దాలుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరగడానికి పట్టణీకరణ, స్థానిక వాతావరణ మార్పు ఎంతవరకు దోహదపడిందో తెలుసుకోవడానికి పరిశోధకులు ప్రయత్నించారు. 37.73 శాతం పట్టణీకరణ జరిగితే దశాబ్దానికి సగటున 0.2 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

వాయువ్య, ఈశాన్య భారతంలోనే..

దేశంలోని వాయువ్య, ఈశాన్య, దక్షిణ ప్రాంతాల్లోని నగరాల్లో రాత్రి ఉష్ణోగ్రతలలో ఎక్కువ పెరుగుదల కనిపించింది. వేగవంతమైన అభివృద్ధి, పట్టణాల విస్తరణ వేగంగా జరుగుతున్న తూర్పు, మధ్య భారతీయ నగరాల్లో కూడా రాత్రిపూట వేడి పెరుగుతోందని తేల్చారు. రాత్రి ఉష్ణోగ్రతలు ప్రతి దశాబ్దానికి సగటున 0.53 డిగ్రీలు పెరుగుతున్నట్టు అధ్యయనం పేర్కొంది. రాత్రి ఉష్ణోగ్రతల పెరుగుదల నగరాలకే పరిమితం కాలేదు.. దేశవ్యాప్తంగా ప్రతి దశాబ్దానికి సగటున 0.26 డిగ్రీలు పెరుగుతున్నట్లు గుర్తించారు. అంటే దేశం మొత్తం వేడెక్కుతున్న రేటు కంటే దాదాపు రెట్టింపు స్థాయిలో నగరాలు వేడెక్కుతున్నాయని నివేదిక సూచిస్తోంది.

కేజీబీవీల్లో 100 శాతం ప్రవేశాలు సాధించాలి

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో 100 శాతం సీట్లను భర్తీ చేయాలని సమగ్ర శిక్షా రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీవో)లను ఆదేశించారు. 2024-25లో చేపట్టాల్సిన కార్యాచరణపై శుక్రవారం విజయవాడలోని సాల్ట్ కార్యాలయంలో అన్ని జిల్లాల జీసీడీవోలతో సమావేశం నిర్వహించారు. కేజీబీవీల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై సివిల్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీడీ మాట్లాడుతూ.. 6, 11 తరగతుల్లో ప్రవేశాలను చేపట్టి, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం తరగతులు నిర్వహించాలన్నారు. సిబ్బంది హెడ్ క్వార్టర్లోనే ఉండి బాలికలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నాణ్యమైన విద్య, చక్కని భోజనం అందించే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదనరావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ పరీక్ష వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)ల్లో అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ (ఏటీవో) పోస్టులకు నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ బండి నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు ఏటీవో పోస్టులకు మార్చి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. అయితే పరిపాలనా కారణాలతో రాత పరీక్ష వాయిదా వేశామని తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తదుపరి పరీక్ష తేదీని https://employment.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

రూ.కోట్ల విలువైన బంగారం పట్టివేత

- నెల్లూరు జిల్లా గౌరవరం టోల్‌ప్లాజా వద్ద 2.94 కేజీల బంగారు బిస్కెట్లు స్వాధీనం
- వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద మరో 1.5 కిలోల బంగారం..
- కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



గౌరవరం టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో పట్టుబడిన బంగారం

కావలి/వెంకటాచలం: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోలీసులు ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న కోట్ల రూపాయల విలువైన బంగారాన్ని పట్టుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... కావలి సమీపంలోని గౌరవరం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం వేకువజామున మూడు గంటల సమయంలో కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు అనుమానాస్పదంగా కనిపించడంతో సోదాలు నిర్వహించారు. సీట్ల కింద ఎవరికి అనుమానం రాకుండా ఏర్పాటు చేసిన సీక్రెట్ లాకర్లలో పెట్టి తరలిస్తున్న సుమారు రూ.2.10 కోట్ల విలువైన 2.94 కేజీల బంగారు బిస్కెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. బంగారం తరలిస్తున్న చెన్నైకి చెందిన మార్వాడీ వ్యాపారులు ఆశిష్ కుమార్, కమలేష్‌లను ప్రశ్నించగా బంగారానికి సంబంధించి ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో పోలీసులు విచారణ చేపట్టారు.

మరో కారులో చెన్నై నుంచి తెనాలి తరలిస్తుండగా..

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద 1.5 కిలోల బంగారాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. టోల్‌ప్లాజా వద్ద ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చెన్నైకి చెందిన రాకేష్‌కుమార్ జైన్, లతాజైన్ దంపతులు చెన్నై వైపు నుంచి తెనాలికి టీఎస్ 01 బీఎస్3092 నంబరు కారులో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. కారులో 1.5 కిలోల బంగారాన్ని గుర్తించారు. బంగారానికి సంబంధించి ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో బంగారాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య ఎగుమతుల్లో ఏపీ జోష్!



- ఐదేళ్లలో 65 శాతం వృద్ధితో రూ.64,578 కోట్లకు పెరుగుదల
- ఏటా 13.04 శాతం సగటు వృద్ధితో రికార్డు
- 2023-24లో రూ.1.63 లక్షల కోట్లకు చేరిన ఎగుమతులు
- దేశవ్యాప్తంగా ఎగుమతులు క్షీణించినా రాష్ట్రంలో 2.63 శాతం వృద్ధి
- దేశంలో 6వ స్థానంతో ఏపీ దూకుడు

సాక్షి, అమరావతి: వాణిజ్య ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ మరోసారి దూకుడు ప్రదర్శించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి దేశవ్యాప్తంగా తగ్గినా రాష్ట్రంలో 2.63 శాతం వృద్ధి నమోదు కావడం ఇందుకు నిదర్శనం. 2022-23లో రూ.1,59,368.02 కోట్లుగా ఉన్న రాష్ట్ర వాణిజ్య ఎగుమతుల విలువ 2023-24కి రూ.1,63,562.68 కోట్లకు చేరినట్లు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో పేర్కొంది. ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల ఎగుమతులు క్షీణించినా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఎగుమతుల్లో వృద్ధి నమోదైందని అధికారులు వెల్లడించారు. సుదీర్ఘ తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర ఆధారిత ఆర్థిక అవకాశాలను అందిపుచ్చుకోవడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలు సత్ఫలితాలను అందిస్తున్నాయి. ఆయన అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర ఎగుమతుల విలువ రూ.98,983.95 కోట్లుగా ఉంది. వాణిజ్య ఎగుమతులు గత ఐదేళ్లలో 65.24 శాతం వృద్ధి చెంది రూ.1,63,562.68 కోట్లకు చేరాయి. అంటే.. ఏటా సగటున 13.04 శాతం వృద్ధి నమోదు చేయడం ద్వారా ఐదేళ్లలో ఎగుమతులు రూ.64,578.73 కోట్లకు పెరిగాయి. 2018-19 నాటికి దేశవ్యాప్త ఎగుమతుల్లో రాష్ట్రం 9వ స్థానంలో ఉంది. ఇప్పుడు 4.52 శాతం వాటాతో 6వ స్థానంలోకి ఎగబాకడం విశేషం.

10 శాతం వాటా లక్ష్యంగా అడుగులు..

2030 నాటికి 10 శాతం మార్కెట్ వాటాతో టాప్-3 రాష్ట్రాల్లో ఒకటిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంది. దీనికనుగుణంగా పలు కీలక చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ హబ్‌ను ఏర్పాటు చేసింది. ఆయా దేశాలకు చేస్తున్న ఎగుమతుల్లో ఇతర ఉత్పత్తుల ఎగుమతికి ఉన్న అవకాశాలను గుర్తిస్తోంది. వాటిని అందిపుచ్చుకునే విధంగా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.25,000 కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తోంది. ఇందులో రామాయపట్నం పోర్టు ఈ ఏడాది, మిగిలిన మూడు పోర్టులు 2025 నాటికి అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా నిర్మించే నాలుగు పోర్టుల ద్వారా అదనంగా లక్ష మందికి ఉపాధి లభించనుంది. దీంతో రాష్ట్ర జీడీపీ, ప్రజల తలసరి ఆదాయంలో గణనీయ వృద్ధి నమోదవుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఎగుమతుల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతిఆయోగ్ కూడా ప్రశంసించింది. 2022కి నీతిఆయోగ్ ప్రకటించిన ఎగుమతి సన్నద్ధత రాష్ట్రాల్లో రాష్ట్రం 59.27 పాయింట్లతో 8వ స్థానంలో నిలవడం విశేషం. రెండేళ్ల క్రితం ఎగుమతి సన్నద్ధత రాష్ట్రాల్లో 20వ స్థానంలో ఉన్న రాష్ట్రం 12 స్థానాలు మెరుగుపరుచుకొని 8వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం.

సత్వర వైద్యానికి 'అంబా'లెన్స్

- 1962 టోల్ ఫ్రీ నంబర్‌తో పశువులకు అంబులెన్స్ ఏర్పాటు
- పాడిరైతు ఇంటి ముగింటనే అందుతున్న పశువైద్య సేవలు



ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా..

ఆలమూరు: పశువులకు సత్వర వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 1962 అంబులెన్స్ వ్యవస్థను తీసుకువచ్చింది. జనానికి 108, 104 మాదిరిగానే పశువులకు అనారోగ్యం, ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవిస్తే సత్వరం స్పందించేలా 2022 మే 20న పశువైద్య సంచార సేవలను ప్రవేశపెట్టింది. పాడి పశువులు ఆపదలో ఉంటే సత్వరమే సంబంధిత యజమాని 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే అరగంటలో అంబులెన్స్ వచ్చి ఉచితంగా సేవలను అందిస్తుంది. వ్యాధి తీవ్రత తగ్గే వరకూ మందుల పంపిణీతో పాటు దిగువ స్థాయి సిబ్బంది పర్యవేక్షణలో ఉంచుతుంది. పాడిరైతులకు జీవనాధారమైన పశువులను రక్షిస్తూ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. 2019 పశు గణాంకాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,97,938 మూగజీవాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 99 పశు వైద్యశాలలు ఉండగా 11 ఏడీఏ కార్యాలయాల సహకారంతో 453 ఆర్బీకేల ద్వారా పశువైద్యశాఖ సేవలు అందిస్తోంది. పశువుల సంరక్షణతో పాటు పెంపుడు కుక్కలకు ఏ విధమైన వ్యాధులు సోకకుండా టీకాలు వేస్తున్నారు. పాడి పరిశ్రమ, మూగజీవాల రక్షణ, కోళ్ల పెంపకం అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఐదేళ్ల నుంచి కృషి చేస్తోంది. మండపేటలోని ప్రాంతీయ పశువైద్య శిక్షణ కేంద్రంలో అధునాతనంగా ఏర్పాటు చేసిన థియేటర్‌లో పశువులకు మెరుగైన శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి.

పశువులన్నింటికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలన్న ప్రభుత్వ దృఢసంకల్పం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటికే కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ తదితర రాష్ట్రాల పశువైద్య బృందాలు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో పర్యటించి పశుసంచార వైద్యసేవలపై అధ్యయనం చేశాయి. గతంలో పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే సుమారు ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్సను అందించవలసి వచ్చేది.

నిరంతర వైద్య సేవలు

జిల్లాలో రూ.16.19 కోట్లతో కొనుగోలు చేసిన 14 సంచార వాహనాలను నియోజకవర్గానికి రెండు చొప్పున పశుసంవర్ధశాఖ పాడిరైతులకు అందుబాటులో ఉంచింది. జిల్లాలో ప్రతి రోజూ సగటున 2,148 పశువులకు నిరంతరం వైద్య సేవలను అందిస్తోంది. జిల్లాలోవున్న పశువుల ఆస్పత్రుల్లో 81 రకాల మందులను అందుబాటులో ఉంచింది. జిల్లాలో గడచిన రెండేళ్ల కాలంలో పశువైద్యశాఖ ద్వారా రూ.2.35 కోట్ల మందులను ఉచితంగా అందజేసి సుమారు 60 వేల పశువులను, గొర్రెలను, మేకలను అనారోగ్యం నుంచి రక్షించి పాడిరైతులకు బాసటగా ప్రభుత్వం నిలిచింది.

సంచార పశువైద్యశాల (అంబులెన్స్) ప్రత్యేకతలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన మొబైల్ అంబులేటరీ క్లినిక్స్ (సంచార పశువైద్యశాల)లో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. పశువులకు ఏవిధమైన అనారోగ్య సమస్యలు తలెత్తినా 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే అరగంట వ్యవధిలో పశువుల మకాం వద్దకు అంబులెన్స్ చేరుకుంటుంది. అందులో పశువైద్యాధికారి, సాంకేతిక సహాయ సిబ్బంది, డ్రైవర్ కమ్ అటెండర్ ఉంటారు. ఆ అంబులెన్స్‌లో మైక్రోస్కోప్‌తో పరీక్షలు చేసే విధంగా 51 ప్రత్యేక పరికరాలు ఉంటాయి. వాటితో ప్రథమ చికిత్సను అందించడంతో పాటు కృత్రిమ గర్భాధారణ తదితర ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. 20 పరికరాలతో రోగ నిర్ధారణ, 15 పరికరాలతో రక్త పరీక్షలు చేసి సత్వరమే ఫలితాలను తెలియజేస్తారు. అంబులెన్స్‌లో సుమారు రూ.30 వేలు విలువ చేసే 81 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ఉచితంగా చికిత్సను అందించడంతో పాటు మందులను కూడా పశువైద్యశాఖ సమకూర్చుతుంది. అనారోగ్యం తీవ్రత ఉన్న పశువులను సమీప పశువుల ఆస్పత్రులకు తరలించేందుకు వీలుగా అంబులెన్స్‌లో లిఫ్ట్ సౌకర్యాన్ని కల్పించారు. నిమిషాల వ్యవధిలో పశువైద్యశాలకు తరలించి నాణ్యమైన చికిత్సను అందించిన అనంతరం ఆ అంబులెన్స్ మళ్లీ పశువుల మకాం వద్దకు తీసుకువస్తుంది. దీంతో పశువులను తరలించేందుకు అయ్యే వ్యయ,ప్రయాసలు తప్పుతున్నాయని రైతులు చెబుతున్నారు.

డిగ్రీ పేర్లకు అంతర్జాతీయ లుక్

- అమెరికా తరహాలో బీఎస్, ఎంఎస్‌గా మార్పులు
- నూతన జాతీయ విద్య విధానంలోనూ ప్రస్తావన
- అన్ని వర్సిటీలూ పాటించాలని యూజీసీ సూచన

సాక్షి, హైదరాబాద్: సంప్రదాయ డిగ్రీ, పీజీ కోర్సులైన బీఏ, బీకాం, బీబీఎం, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏలకు త్వరలో కొత్త పేర్లు రానున్నాయి. జాతీయ నూతన విద్యావిధానం-2020 (ఎన్ఈపీ) అమల్లో భాగంగా అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా వాటి పేర్లలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై ఆయా కోర్సులను అమెరికాలో పిలుస్తున్న తరహాలో బీఎస్, ఎంఎస్‌గా పిలవనున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అన్ని విశ్వవిద్యాలయాలకు సూచించింది. దేశంలో సంప్రదాయ డిగ్రీ కోర్సులు చేసిన విద్యార్థులు విదేశాల్లో ఉద్యోగాలు లేదా ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకే ఇలా పేర్లు మార్చనున్నారు.

విస్తృత కసరత్తు తరువాత

సంప్రదాయ కోర్సుల పేర్ల వల్ల కలిగే ఇబ్బందులపై జాతీయ నూతన విద్యా విధానం ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. క్రెడిట్ విధానం అమలు చేయాలని సూచించిన ఈ విధానం.. ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విద్యావిధానం భారత్‌లోనూ ఉండాలని కేంద్రానికి సూచించింది. ఈ సూచనల మేరకు గతేడాది యూజీసీ నిపుణులతో ఓ కమిటీని నియమించింది. అమెరికాలో ఉద్యోగాల కోసం వెళ్లే భారతీయులు అక్కడ గుర్తించే డిగ్రీలకన్నా భిన్నంగా ఉండటం వల్ల కొన్ని సమస్యలొస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని పేర్లు మార్చాలని ప్రతిపాదించింది. స్పెషలైజేషన్ చేసే విద్యార్థులకు దీనివల్ల అంతర్జాతీయంగా గుర్తింపు ఉంటుందని అధికారులు అంటున్నారు.

యూజీసీ సూచనలు ఇలా..

- దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు డిగ్రీల కొత్త విధానంపై యూజీసీ లేఖ రాసింది. ఇప్పటివరకు దేశంలో మూడేళ్ల కాలపరిమితి డిగ్రీ కోర్సులున్నాయి. వాటి స్థానంలో ఆనర్స్ కోర్సులను ప్రవేశపెడుతున్నారు. వాటి కాలపరిమితి నాలుగేళ్లు. సంబంధిత సబ్జెక్టులో లోతుగా అధ్యయనం చేసేలా కోర్సును నిర్వహించడం ఆనర్స్ కోర్సుల ఉద్దేశం.
- ఉదాహరణకు బీకాం ఆనర్స్ అనే కోర్సులో సాధారణ కోర్సుతోపాటు నిపుణులు, వివిధ వర్గాల అనుభవజ్ఞులతో ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉండేలా కోర్సును రూపొందిస్తారు. మన రాష్ట్రంతోపాటు అనేక రాష్ట్రాల్లో బీఏ, బీకాం ఆనర్స్ కోర్సులను ప్రవేశపెట్టారు.
- ఉత్తరాది రాష్ట్రాల్లో మరికొన్ని కోర్సులూ అమల్లోకి వచ్చాయి. ఇష్టమైన సబ్జెక్టును ఆన్‌లైన్ ద్వారా ఏ దేశంలోని వర్సిటీ నుంచైనా చేసే వీలు కల్పించారు. ఇలా ప్రపంచ స్థాయిలో విద్యావిధానం ఏకీకృతం అవుతున్న నేపథ్యంలో బీఏ, బీకాంలను బీఎస్, ఎంఎస్‌లుగా మార్చాలని యూజీసీ భావిస్తోంది.
- రాష్ట్రంలోనూ ఇందుకు అనుగుణంగా కొన్ని కోర్సుల్లో మార్పులు చేస్తున్నారు. మల్టీ డిసిప్లినరీ కోర్సులను ఎంచుకొనే అవకాశం కల్పిస్తున్నారు. ఉదాహరణకు ఒక విద్యార్థి చరిత్ర, భౌతిక శాస్త్రం, కామర్స్ సబ్జెక్టులను ఎంపిక చేసుకొనే విధానం తీసుకొస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఈ డిగ్రీని స్పెషలేషన్ సబ్జెక్టులుగా పేర్కొనాల్సి వస్తోంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

గెస్ట్ టీచర్లను కొనసాగించరూ..


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి ఉపాధ్యాయులను 2024–25వ విద్యా సంవత్సరంలో కొనసాగించాలని జనవేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు నాగరాజ్ మాట్లాడారు. 2023–24వ విద్యా సంవత్సరంలో అతిథి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించామని, తిరిగి ఆ పోస్టులనే తమకు కేటాయించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

మండీలను ఏపీఎంసీకి తరలించండి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలోని ప్రధాన కూడలి తీన్ కందిల్, మచ్చిమార్కెట్ల వద్ద ఉన్న పండ్ల మండీలను ఏపీఎంసీకి తరలించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సంచాలకుడు అంబాజీ రావ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి శివానంద పాటిల్ ఐదు నెలల క్రితం పండ్ల మండీల కోసం ఏపీఎంసీలో 16 దుకాణాలు కేటాయించినా అక్కడకు వెళ్లడం లేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయని, అందువల్ల ఇకనైనా మండీలను తరలించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అధిక ఫీజుల వసూలు తగదు


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా డొనేషన్లు, ఫీజులు వసూలు చేయడం తగదని సీపీఐ ఎంఎల్(రెడ్ స్టార్) నేత అమరేష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి ఆయన మాట్లాడారు. మధ్య తరగతి పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో చదవాలంటే రూ.లక్షల్లో డొనేషన్లు, వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా జిల్లా, తాలూకా విద్యాశాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడాన్ని ఖండించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: జూన్ 3న జరగనున్న ఈశాన్య కర్ణాటక పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఆరోగ్యధికారి సురేంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటు హక్కుపై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు గణేష్, శాకీర్, నందిత, వెంకటేష్ నాయక్‌లున్నారు.

రుతుస్రావంపై జాగ్రుతి పెంచుకోవాలి


పాల్గొన్న అధికారులు, విద్యార్థినులు

రాయచూరు రూరల్: విద్యార్థినులు రుతుస్రావంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ సేవా పథకం అధికారి వీరేష్ నాయక్ అన్నారు. శుక్రవారం నగరంలోని మునియప్ప ముద్దప్ప కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. 2024–25వ విద్యా సంవత్సరంలో విద్యార్థినులు తమ ఇంటి చుట్టు పక్కల వారికి రుతుస్రావంపై జాగృతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో అమరేష్ పాటిల్, శరణ బసవ, మంజునాథ్‌లున్నారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- 19 రౌండ్ల పాటు కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- లెక్కింపు కేంద్రంతో పాటు నగరంలో గట్టి బందోబస్తు
- ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తదితరుల వెల్లడి


మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, చిత్రంలో ఏఎస్పీ తదితరులు

సాక్షి,బళ్లారి: గత నెల 7వ తేదీన జరిగిన బళ్లారి లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపును ఈనెల 4వ తేదీన జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా పేర్కొన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్‌వైఎంఈసీలోని స్ట్రాంగ్ రూంల్లో ఈవీఎంలు భద్రంగా ఉంచామని, జూన్ 4న ఉదయం 8 గంటల లోపు ఈవీఎంలు ఉంచిన గదులను తెరిచి లెక్కింపు చేపడతామన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తామన్నారు. బళ్లారి లోక్‌సభలోని 8 నియోజకవర్గాల పరిధిలోని అన్ని ఈవీఎంలను ఒకే చోట ఆర్‌వైఎంఈసీలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఉంచామన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏజెంట్లకు, అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. ఇప్పటికే ఓట్ల లెక్కింపులో పాల్గొనే పాత్రికేయులతో సహా అందరికీ ఎంట్రీ పాసులు మంజూరు చేశామన్నారు. పాసులు ఉన్న వారికి మాత్రమే లోపలకు అనుమతి ఇస్తామన్నారు.

పాస్ ఉన్నవారికే అనుమతి

ఎన్నికల కమిషన్ నుంచి వెలువడిన పాస్‌లు తప్పనిసరిగా తీసుకుని ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి వెళ్లాల్సి ఉంటుందన్నారు. నిబంధనలను ఎవరూ ఉల్లంఘించకూడదన్నారు. బళ్లారి లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఓట్లు లెక్కింపును 19 రౌండ్లలో పూర్తి చేస్తామన్నారు. 14 టేబుల్స్ ఏర్పాటు చేశామని, ఒక రౌండ్‌కు 14 ఈవీఎంల ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం లోపు దాదాపుగా ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలు వెలువడే అవకాశం ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గెలిచిన అభ్యర్థులు ఎవరైనా ఊరేగింపులు, బాణసంచా పేల్చడం వంటివి చేయరాదని సూచించారు. ఏఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎస్పీతో పాటు ఇద్దరు ఏఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 15 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 25 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 40 మంది ఏఎస్ఐలు, 150 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 250 మంది కానిస్టేబుల్స్, 4 కేఆర్‌పీ, 4 డీఏఆర్ బృందాలు బందోబస్తులో పాల్గొంటాయన్నారు.

పరిషత్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఈనెల 3వ తేదీన జరగనున్న విధాన పరిషత్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లాధికారి పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 24,183 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. వీరిలో పురుషులు 14,981, మహిళా ఓటర్లు 9,198 మంది ఉన్నారని, ఇతర ఓటర్లు నలుగురు ఉన్నట్లు తెలిపారు.

పారదర్శక కౌంటింగ్‌కు డిమాండ్


జిల్లాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం నేతలు

బళ్లారిఅర్బన్: జూన్ 4 జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఎద్దేళు కర్ణాటక సంఘం నేతలు జిల్లాధికారిని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా ఉత్తర భారతంలో రైతులు, పీడిత తాడిత వర్గాలు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారన్నారు. ఈనేపథ్యంలో అడ్డదారిలో అందలం ఎక్కడానికి ఎటువంటి అక్రమాలకైనా పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా జనశక్తి సంఘం నేతలు కుమార్ సమతళ, సత్యబాబు, కరియప్ప గుడిమని, వెంకటేష్, ఇండి వెంకమ్మ, సయ్యద్ అంజాద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను నిర్లక్ష్యం చేయొద్దు


దుస్తులను పంపిణీ చేస్తున్న రమేష్ తదితరులు

బళ్లారిఅర్బన్: వృద్ధులను ఎట్టి పరిస్థితిలోను నిర్లక్ష్యం చేయరాదని సూపర్‌స్టార్ కృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు రాఘవ రమేష్ తెలిపారు. నగరంలోని గాంధీనగర్ 2వ క్రాస్‌లో శుక్రవారం శివశక్తి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సూర్యనివాస్ వృద్ధాశ్రమంలో దివంగత నటుడు కృష్ణ 82వ జయంతిని అవ్వ, తాతల మధ్య ఆత్మీయంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం పదాధికారులు ఆశ్రమంలోని అవ్వ,తాతలకు చీరలు, పంచలు పంపిణీ చేశారు. ప్రముఖులు క్యాటరింగ్ సాయి, సుబ్బరాయుడు, దేవకుమార్, రవిశంకర్ మల్లి, రాము, శీన, బాబు, అజ్జయ్య, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టభద్రుల దినోత్సవం


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కులపతి అనిల్ కుమార్ తదితరులు

హొసపేటి: వెనుకబడిన ప్రాంతాల్లో కష్టపడి చదివి అభివృద్ధి చెందేందుకు యువత సంకల్పించాలని కలబురిగి శరణ బసవేశ్వర విశ్వవిద్యాలయం కులపతి అనిల్‌కుమార్ అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్రౌడదేవరాయ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. నేటి యువతలో ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల కొరత ఉందన్నారు. కార్యనిర్వాహక మండలి సభ్యుడు వివి బసవరాజ్, డీన్ ప్రొఫెసర్ పార్వతి కడ్లి, సాంకేతిక విభాగాధిపతి ప్రొఫెసర్ రవికుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా 400 మందికి పైగా బీఈ, ఎంటెక్, ఎంబీఏ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు.

రుబెల్లా నిర్మూలనకు నడుం బిగిద్దాం


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు

హొసపేటి: జిల్లాలో రుబెల్లా(తట్టు) వ్యాధిపై టీకా అభియాన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయ హాలులో శుక్రవారం జరిగిన శాఖల అంతర్ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గవద బిళ్లల వ్యాధిని డిసెంబర్ 2024 నాటికి నిర్మూలించే దిశగా జిల్లాలో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. శిశువుకు 9 నెలల వయస్సు వచ్చిన తర్వాత మొదటి డోసు ఇవ్వాలన్నారు. ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా ఏడాదిన్నర తర్వాత రెండో డోసును అంగన్‌వాడీ, మహిళా సంఘాలు, ఆశా వర్కర్ల సహకారంతో 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ శంకర్ నాయక్, జిల్లా పొగాకు నియంత్రణ సెల్ అధికారి డాక్టర్ షణ్ముఖ్ నాయక్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి దొడ్డమని, జిల్లా వ్యాధుల నియంత్రణ అధికారిణి డాక్టర్ కే.కమలమ్మ, జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన అధికారిణి డాక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

నకిలీ దాఖలాలతో భూకబ్జా


మాట్లాడుతున్న కరియప్ప గుడిమని తదితరులు

బళ్లారిఅర్బన్: నగర శివారులోని బండిహట్టి ప్రాంతం సర్వే నెంబర్–715లో 44 మంది రైతులు, దళితులకు చెందిన 135 ఎకరాల భూమిని నకిలీ రికార్డులు సృష్టించి తన కుటుంబం పేరుపై మాజీ బుడా అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి రిజిస్టర్ చేయించుకున్నారని కర్ణాటక మాదిగ రక్షణ వేదిక నేత కరియప్ప గుడిమని ఆరోపించారు. ఆయన పలువురు వేదిక నేతలతో కలిసి శుక్రవారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలాంటి వ్యక్తిని ఓడించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి వ్యక్తి గెలిస్తే మరింతగా పేదలను, రైతులను వేధించి భూకబ్జాలకు పాల్పడుతారని ఆరోపించారు. సమావేశంలో బండిహట్టి మోహన్, జిల్లా కురుబ సంఘం కార్యదర్శి దారంమిల్ మోహన్, నాగరాజ్, రమేష్, జనశక్తి సంఘం కుమార్ సమతళ, వీబీ మల్లప్ప, ఈ.కుమార్, శాంతయ్య, శంక్రయ్య, నాగరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ముద్దు.. భిక్షాటన వద్దు

- పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులకు అధికారుల జాగృతి


కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: 14 ఏళ్ల లోపు వయస్సుగల పిల్లలను బడిలో చేర్పించడానికి ఆయా శాఖల అధికారులు పడుతున్న యాతన అంతా ఇంతా కాదు. పిల్లలతో భిక్షాటన చేయించకుండా బడికి పంపాలని వారు తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నారు. శుక్రవారం మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారి చేతన్ కుమార్, గ్రామీణ సీడీపీఓ మహేష్ కుమార్ దేవసూగూరులో నివాసముంటున్న సంతోష్ అనే 12 ఏళ్ల బాలుడు బడి మానేసి భిక్షాటన చేస్తుండటంతో అతని తల్లిదండ్రులను కలిసి సంప్రదించారు. సంతోష్ 1 నుంచి 7వ తరగతి వరకు దేవదుర్గ తాలూకా ముస్టూరు పాఠశాలలో చదివాడు. కుటుంబ పోషణ భారం కావడంతో ఊరూరా తిరుగుతూ అతని తల్లిదండ్రులు భిక్షాటన చేస్తున్న నేపథ్యంలో అధికారులు అతని కుటుంబ సభ్యులను కలిసి బడికి పంపించేలా ఒప్పించారు.

వృత్తే బాధ్యతగా.. ఉన్నతే ఊపిరిగా..

- ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు


ఉపాధ్యాయుడు, సీఆర్‌పీ అంజినిని సన్మానిస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: ఉపాధ్యాయ వృత్తిని ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుడు పి.అంజిని అని జిల్లా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సి.నింగప్ప తెలిపారు. శుక్రవారం రేడియో పార్క్‌లోని డయట్ ప్రాంగణం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడు, సీఆర్‌పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్) పి.అంజిని పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుట్టినప్పుడు ఊపిరి ఉంటుంది పేరుండదు, మరణించాక పేరుంటుంది ఊపిరి ఉండదు. అందువల్ల ప్రతిఒక్కరూ ఊపిరి పోయాక ఎప్పటికీ పేరు చెప్పుకొనేలా కీర్తి కోసం శ్రమించాలన్నారు. ఉపాధ్యాయుడు సీఆర్‌పీ పి.అంజిని ఆ కోవకు చెందినవారేనన్నారు. వృత్తిలో రాజీ పడకుండా నిజాయితీగా, క్రమశిక్షణతో విద్యార్థుల ఉన్నతికి పాటుపడిన ఉపాధ్యాయుడిగా పి.అంజిని పేరు చెప్పవచ్చన్నారు. తన పదవి విరమరణ కార్యక్రమంలో తనతో పాటు తన శిష్యులు గురువులుగా వేదికపై ఉండటమే ఇందుకు సాక్ష్యమన్నారు. సీఆర్‌పీగా క్లస్టర్ స్థాయిలో పాఠశాలల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుడు పి.అంజినిని ఉపాధ్యాయుల సంఘం ప్రముఖుడు శివశంకర్, విశ్రాంత ఖజానాధికారి నాగరాజు తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని బేగం, ఉపాధ్యాయులు వీరేశ్, రహంతుల్లా, వసంత, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై జాగృతి జాతా


జాతాను ప్రారంభిస్తున్న జడ్జి సిద్ధరామప్ప


జాతాలో పాల్గొన్న దంత వైద్య విద్యార్థులు

రాయచూరు రూరల్: పొగాకు నియంత్రణపై ముమ్మర ప్రచారం చేపట్టాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సిద్ధరామప్ప సూచించారు. శుక్రవారం జిల్లా ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రపంచ పొగాకు దినోత్సవ జాతాను ప్రారంభించి ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ పొగాకు నిషేధం గురించి గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అందరినీ ఏకతాటి పైకి తెచ్చి సమాజంలో నలుగురితో సమానంగా జీవించేలా చేయాలన్నారు. వైద్యాధికారి సురేంద్రబాబు మాట్లాడుతూ గుట్కా, పొగాకుతో కూడిన పదార్థాలను సేవించరాదన్నారు. జాతాలో అదనపు ఎస్పీ శివకుమార్, జిల్లా ఆరోగ్య అధికారులు గణేష్, మనోహర్ పత్తార్, నందిత, బసవరాజ్, విజయ్ శంకర్, ప్రజ్వల్‌లున్నారు.

పొగ.. ఆరోగ్యానికి సెగ

బళ్లారి రూరల్: పొగాకు వాడకం వల్ల శరీరంలోని అవయవాలకు సెగ తగిలి నోటి కేన్సర్, హృద్రోగాలు తదితర అనేక రోగాల బారిన పడుతున్నారని విమ్స్ ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ భారతి తెలిపారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన జాగృతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీడీ, సిగరెట్, గుట్కా, పొగాకు వాడకం వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందన్నారు. పొగాకు కేన్సర్, గుండె జబ్బులకు కారణమవుతుందన్నారు. ముఖ్యంగా యువత ఫ్యాషన్ కోసం సిగరెట్ అలవాటు చేసుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా దంతవైద్య కళాశాల నుంచి విమ్స్ క్యాజువాలిటీ వరకు ర్యాలీ నిర్వహించారు. విమ్స్ ఆసుపత్రి ముందు పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను నాటక రూపంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో విమ్స్ ప్రభుత్వ దంతవైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

హుబ్లీ: స్థానిక అంబాజీ చారిటబుల్ ట్రస్ట్, హెచ్‌కే సుమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి పాసైన ప్రతిభావంత నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడం కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. ఆర్థికంగా వెనుకబడిన హుబ్లీలో నివసిస్తున్న 10వ తరగతి పాసైన అర్హులైన విద్యార్థులు తమ ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు వివరాలతో స్వయానా ఈ కింది చిరునామాకు దరఖాస్తు పంపాలని కోరారు. అంబికా అప్లైయన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, లోవర్ గ్రౌండ్ ఫ్లోర్, కలబుర్గి ప్లాటినం, కుసుగల్ రోడ్డు, హుబ్లీ ఈ నెల 10 లోగా పంపాలని సదరు ట్రస్ట్ చైర్మన్ సురేంద్ర ఫోర్వల్ ఓ ప్రకటనలో కోరారు.

నేటి నుంచి జిల్లా కేంద్రాల్లో ఉద్యోగ మేళాలు

హొసపేటి: నగరంలోని చేతన్ బిజినెస్ స్కూల్, నిర్మల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి 21 వరకు వివిధ జిల్లా కేంద్రాల్లో ఉద్యోగ మేళాలను ఏర్పాటు చేసినట్లు ఆ స్కూల్ డైరెక్టర్ విశ్వనాథ కొరవి తెలిపారు. శుక్రవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడారు. ఎస్‌బీఐ లైఫ్, జియో, మోర్ తదితర 25 పైగా కంపెనీలు మేళాలో పాల్గొంటాయన్నారు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు, డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్హతలు ఉన్న వారు మేళాలో పాల్గొనవచ్చన్నారు. గత 13 ఏళ్లుగా ఉద్యోగ మేళా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సారి మేళాలో 500కు పైగా అభ్యర్థులు నమోదు చేసుకున్నారని, మొత్తం మీద 900 మంది అభ్యర్థులు పాల్గొంటారనే అంచనా ఉందన్నారు. జూన్ 1న స్థానిక ఉణకల్ శ్రీనగర్‌లోని చేతన బిజినెస్ స్కూల్‌లో, 15న శిరసి ఎంఏఎస్ కామర్స్ కాలేజీ, 21న హావేరి కేఎల్ఈ ఆర్ట్స్ కళాశాలలో, 29న గదగ్ జిల్లా కేఎల్ఈ జేటీ కాలేజీలో మేళా ఏర్పాటు చేశామన్నారు. ఆ ఫౌండేషన్ అధ్యక్షులు రాజన్న కొరవి మాట్లాడుతూ 2026 కల్లా నిర్మల ఫౌండేషన్ ద్వారా ఒక లక్ష ఉద్యోగాలు కల్పించే సంకల్పం ఉందన్నారు. మేళాను మూరుసావిర మఠం జగద్గురు డాక్టర్ గురుసిద్ధ రాజయోగీంద్ర స్వామి ప్రారంభిస్తారని, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగ విభాగం డైరెక్టర్ అనిరుథ్, రమాకాంత్ కులకర్ణి, కిరణ్ గలగలి పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో గానుగ నూనె తయారీపై శిక్షణ

హుబ్లీ: రాజీవ్ దీక్షిత్ గ్రామీణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కర్ణాటక కౌసల్య అభివృద్ధి కేంద్రం సారథ్యంలో గానుగనూనె తయారీ శిబిరాన్ని జూన్ 8, 9 తేదీల్లో ఏర్పాటు చేసినట్లు ఆ కేంద్రం నిర్వాహకులు ఎండీ పాటిల్ తెలిపారు. నగరంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 9 శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం జరుపుతున్న శిబిరం 10వదని వివరించారు. రెండు రోజుల శిక్షణా శిబిరంలో గానుగనూనె తయారీ సంబంధిత వర్క్‌షాపులో వంటనూనె తయారీ, విక్రయం తదితర కీలక విషయాలపై మానవ వనరుల అధికారులచే వివరంగా శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణలో పాల్గొనే అభ్యర్థులకు వసతి, భోజన సౌకర్యాలను కూడా కల్పించామన్నారు. శిక్షణ ముగిసాక సర్టిఫికెట్లను పంపిణీ చేస్తామన్నారు. గానుగనూనె వాడకం ద్వారా తీవ్ర వ్యాధులను నివారించవచ్చన్నారు. గానుగనూనె యూనిట్‌ను తక్కువ ఖర్చుతో ప్రారంభించవచ్చన్నారు. ఇలాంటి గానుగల ప్రారంభం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలగనుందన్నారు. సమావేశంలో శ్రీశైల బాదామి, శివానంద కుంబార తదితరులు పాల్గొన్నారు.

సంగం సర్కిల్ నుంచి కేసీ రోడ్డు విస్తరణకు చర్యలు

బళ్లారిఅర్బన్: నగరంలోని ఇందిరా సర్కిల్(సంగం సర్కిల్) నుంచి హజరత్ మక్దుం జానీ దర్గా ఎదుట వరకు కేసీ రోడ్డు విస్తరణకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిటీ కార్పొరేషన్ కమిషనర్‌కు సూచించినట్లు నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన గడిగి చెన్నప్ప సర్కిల్, నారాయణరావ్ పార్క్, కాటేగుడ్డ, సంగం సర్కిల్ రోడ్డు విస్తరణపై పాలికె అధికారులతో కలిసి పరిశీలించి వాటి సాధక బాధకాల గురించి తెలుసుకున్నారు. అక్కడే స్థలంలో ఉన్న కార్పొరేషన్ కమిషనర్ ఖలీంసాబ్‌కు ఈ రోడ్ల విస్తరణ గురించి ఎమ్మెల్యే కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రాయల్ సర్కిల్ నిర్మాణ పనులు, అక్రమాల తొలగింపు సంబంధిత అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇందిరా సర్కిల్ అభివృద్ధి పనుల గురించి కాంట్రాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఫుట్‌పాత్‌పై పుచ్చకాయలు అమ్ముతున్న మహిళ ఎమ్మెల్యేకు పుచ్చకాయ అందించగా ఆమెతో ఆత్మీయంగా మాట్లాడారు.

టీచరమ్మలా పాఠం చెప్పిన జిల్లాధికారిణి


ఓ పాఠశాలలో విద్యార్థినులకు పాఠాన్ని బోధిస్తున్న జిల్లాధికారిణి దివ్యప్రభు

హుబ్లీ: ధార్వాడ జిల్లాధికారిణి దివ్యప్రభు శుక్రవారం ఇంగ్లిష్ టీచరమ్మలా విద్యార్థులకు చక్కగా పాఠాన్ని బోధించారు. పాఠశాల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఆమె శుక్రవారం ధార్వాడలోని ఓ ప్రభుత్వ పాఠశాల సందర్శించారు. వేసవి సెలవులు ముగిసాక మే 29 నుంచి పాఠశాలలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆమె స్వయంగా ధార్వాడ నగరంలోని టీడీడబ్ల్యూ ప్రభుత్వ పాఠశాలను సందర్శించగా, ఓ విద్యార్థిని ఇంగ్లిష్ తనకు కొంచెం కష్టంగా ఉంటుందని అనడంతో జిల్లాధికారి దివ్యప్రభు 8వ తరగతి ఇంగ్లిష్ అచ్చుపుస్తకం తీసుకొని పాఠాలు బోధించడమే కాక విద్యార్థులకు యూనిఫాం అవశ్యకత గురించి వివరించారు. విద్యార్థులకు అర్థం అయ్యేలా బోధించడంతో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాఠాలను విన్నారు. ఈ క్రమంలో ఆమె విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. ఆమె విద్యార్థుల్లో ఇంగ్లిష్‌పై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు వివిధ చిట్కాలను వివరించారు. ఇంగ్లిష్‌ను కేవలం ఓ సబ్జెక్ట్‌గా మాత్రమే చూడాలని, ఏ భాష అయినా తప్పో ఒప్పో ముందుగా మాట్లాడటం నేర్చుకోవాలంటూ ఆమె విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆమె కోరారు.

జిల్లాల్లో పాఠశాలలు పునః ప్రారంభం


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న జెడ్పీ సీఈఓ


ప్రార్థనలో పాల్గొన్న పిల్లలు, ఉపాధ్యాయులు

రాయచూరు రూరల్: జిల్లాలో బుధవారం నుంచి పూర్తి స్థాయిలో పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. 2024–25వ విద్యా సంవత్సరంలో జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే పాఠశాలలను ప్రారంభించారు. శుక్రవారం తాలూకాలోని దుగనూరు, శ్రీరామనగర క్యాంప్ పాఠశాల విద్యార్థులతో పొలం పనులు మాని పాఠశాలకు రావాలని ప్రచారం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారికి అందాల్సిన పుస్తకాలు, యూనిఫాం, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆదర్శ పాఠశాల ద్వారా విద్యాభ్యాసం కల్పించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి బడిగేర్, పాఠశాల హెడ్‌మాస్టర్లు గఫూర్, చంద్రశేఖర్ నాయక్, నరసమ్మ, రాఘవేంద్ర, వెంకోబ, సంతోష్, లలిత, మహంతేష్ బిరాదార్‌లున్నారు.

హొసపేటిలో..

హొసపేటి: 2024–25వ ప్రస్తుత విద్యా సంవత్సరం ఈరోజు ప్రారంభమైందని టీబీ డ్యాం పీఎల్‌సీ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పూలు అందించి స్వాగతం పలికిన అనంతరం ఆయన మాట్లాడారు. మెరుగైన విద్యాభ్యాసం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ఉచిత పుస్తకాలు, యూనిఫాంను అందచేశారు. ఉపాధ్యాయులు, స్వర్ణకుమారి, హేమలత, నిర్మల, రవి, ఈరప్ప, మంజుల, ఎస్‌డీఎంసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.